వాకిలి
గత వారంలో ప్రపంచ విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 117 పేజీలు: 10+4 వెల: 6.50

హార్వర్డ్ వర్సిటీకి ట్రంప్ మరోసారి షాక్
ప్రభుత్వం ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం
5



## వరి సహా 14 పంటలకు
# 'మద్దతు' పెంపు

**రూ. 2.5 లక్షల కోట్లు కేటాయింపు**
**వడ్డీ రాయితీ పథకం కింద రూ. 15 వేల కోట్లు**
**బద్వేలు- గోపవరం హైవే ఆధునీకరణ**
**కేంద్ర కేబినెట్ వివరాలు వెల్లడించిన మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, మే 28:** ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం వరి పంటకు కనీస మద్దతుధరను మూడు శాతం పెంచింది. అంటే 69 రూపాయలు పెరిగి క్వింటాలుకు 2369 రూపాయలుగా ప్రకటించింది. అలాగే >>2

ఎస్సీ, ఎస్టీలను పాలకులను చేసింది కాంగ్రెస్సే..
ఒక్కయేడాదిలో 59 వేల ఉద్యోగాలిచ్చాం
గురుకుల విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేసిన సిఎం రేవంత్



# అడ్డుకుంటే వాతపెట్టండి
## ఉద్యోగాల భర్తీకి అవరోధాలు కల్పిస్తే ఎలా?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 28:** సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉందని ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని జగ్జీవన్‌రాం భవన్‌లో గురుకుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించిన సీఎం తర్వాత రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన సోషల్ వెల్ఫేర్ >>2



## తెలంగాణ హైకోర్టు సిజెగా ఎకె సింగ్
**త్రిపుర నుంచి బదలీ: కొలీజియం సిఫారసు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే28:** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ అపరేష్ కుమార్‌సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపురహైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇకప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం >>2

## పిల్లల అక్రమ రవాణా ముఠా అరెస్టు
**13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు** 6

## కెసిఆర్‌తో హరీష్ భేటీ


**కాళేశ్వరం విచారణపై మంతనాలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే28:** మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో మరోసారి హరీష్‌రావుభేటీ అయ్యారు. బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కెసిఆర్‌తో హరీశ్‌రావు సమావేశమయ్యారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో మూడోసారి హరీష్‌రావు కెసిఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ నోటీసులు, విచారణ సంబంధిత అంశాలపై ఇద్దరు చర్చించినట్లు తెలుస్తోంది.కాగా, కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరు కానున్నట్లు సమాచారం. జూన్ 5న పీసీ ఘోష్ కమిషన్ ముందు >>2

## 31న మిస్‌వరల్డ్-25 గ్రాండ్ ఫినాలె
**టాప్ 40లో ఇప్పటికే 12 బెర్త్‌లు ఖరారు** 2

## టిడిపి జాతీయ అధ్యక్షుడిగా మళ్లీ చంద్రబాబు 2

కడప మహానాడులో బుధవారం ప్రతిజ్ఞ చేస్తున్న ఎపి సిఎం చంద్రబాబు

## జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా మంజూరు పత్రాల పంపిణి
**-డిప్యూటీ సిఎం భట్టి**

**హైదరాబాద్,మే28:** రాష్ట్రంలోని లక్షలాదిమంది యువత శక్తి సామర్థ్యాలపై అపార విశ్వాసంతో ప్రభుత్వం వేల కోట్ల పెట్టుబడి సాయం చేస్తుంది, ఈ సహాయంతో యువత జీవితాల్లో వెలుగులు నిండాలి అదే సందర్భంలో రాష్ట్ర జిడిపి సైతం పెరిగేందుకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం సాయంత్రం మంత్రి పొన్నంప్రభాకర్‌తో కలిసి రాజీవ్ యువ వికాసం అమలు >>2


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డి.సిఎం భట్టి

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం



బీహార్ విమానయాన సంధానంలో ఉజ్వల ఘట్టం
ఒక మైలు రాయి సాధించాం
మరొక సువర్ణ ఆవిష్కరణకు రూపకల్పన

నూతన టెర్మినల్ భవనం
జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయం, పాట్నా

ప్రారంభోత్సవ శుభసందర్భం

శంకుస్థాపనకు శుభారంభం

కొత్త సివిల్ ఎన్‌క్లేవ్, బిహటా విమానాశ్రయం

ప్రయోజనాలు
- ప్రయాణ & పర్యాటక రంగాల వికాసానికి కొత్త టెర్మినల్స్ విస్తరణ, బీహార్ సుసంపన్న సాంస్కృతిక వారసత్వం మరియు ప్రాంతీయ కళలు, కళాకారులకు ప్రయోజనాలు
- విద్య, ఆరోగ్య, ఆతిథ్య రంగాలు పటిష్టత సాధించి బీహార్ ప్రజలకు కొత్త ఉద్యోగ అవకాశాల కల్పన
- బీహార్ సమగ్రాభివృద్ధి, ఆర్థిక పురోగతి చోదక శక్తిగా ప్రాంతీయ కనెక్టివిటీ వైపు ముందడుగులు

విశేష ముఖ్యాంశాలు

కొత్త టెర్మినల్ భవనం, పాట్నా విమానాశ్రయం
- 68,150 చ.మీ. కొత్త టెర్మినల్ భవనం ప్రస్తుతం ఉన్న దానికంటే ఆరు రెట్లు పెద్దదిగా, వార్షికంగా ఒక కోటి ప్రయాణీకులకు సేవలు అందించటానికి రూ.1200 కోట్లతో నిర్మించబడింది
- 64 చెక్-ఇన్ కౌంటర్‌లు, 16x-BIS మెషీన్‌లు, ఐదు ఎయిరో వంతెనలు, నాలుగు బ్యాగేజి కన్వేయర్ బెల్ట్‌లు మరియు 1100 కార్ పార్కింగ్ స్లాట్స్‌తో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సౌకర్యాలు
- విమానాశ్రయ ఆపరేషనల్ సామర్థ్యం పెంపుదలకు ఒకేసారి 11 విమానాలు పార్కింగ్‌కు శక్తివంతమైన యాప్రాన్

కొత్త సివిల్ ఎన్‌క్లేవ్, బీహార్ విమానాశ్రయం
- రూ.1413 కోట్లు వినియోగించి అభివృద్ధి చేస్తున్న కొత్త సివిల్ ఎన్‌క్లేవ్ వార్షికంగా 50 లక్షల ప్రయాణీకులకు సేవలందించే సౌకర్యాలతో 68,000 చ.మీ. ప్రాంతంపై నెలకొల్పబడుతోంది
- 64 చెక్-ఇన్ కౌంటర్‌లు, 16 స్వయం-సేవల కియోస్క్‌లు, 14x-BIS మెషీన్‌లు, ఆరు ఎయిరో బ్రిడ్జిలు మరియు ఆరు బ్యాగేజి కన్వేయర్ బెల్ట్‌లు
- 10 విమానాలు ఉండే అనుకూలతగా డిజైన్ చేయబడిన యాప్రాన్ డైరెక్ట్ కనెక్టివిటీకి దోహదం చేస్తుంది

గౌ॥ నరేంద్ర మోదీచే
భారత ప్రధాని

ఘనమైన వీరి సమక్షంలో

ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ — గవర్నర్, బీహార్
నితీష్ కుమార్ — ముఖ్యమంత్రి, బీహార్
రామ్‌మోహన్ నాయుడు కింజారపు — పౌర విమానయాన కేంద్ర మంత్రివర్యులు
సామ్రాట్ చౌదరి — ఉప ముఖ్యమంత్రి, బీహార్
విజయ్ కుమార్ సిన్హా — ఉప ముఖ్యమంత్రి, బీహార్
మురళీధర్ మోహోల్ — పౌర విమానయాన & సహకార సహాయ కేంద్ర మంత్రివర్యులు
రవి శంకర్ ప్రసాద్ — పార్లమెంట్ సభ్యులు (లోక్‌సభ)
మిషా భారతి — పార్లమెంట్ సభ్యులు (లోక్‌సభ)
అమరేంద్ర ధారి సింగ్ — పార్లమెంట్ సభ్యులు (రాజ్య సభ)
సంజీవ్ చౌరసియా — శాసన సభ్యులు
భాయ్ వీరేంద్ర — శాసన సభ్యులు

గురువారం, 29వ మే 2025 | సా.04.30 గం.కు | JPNI విమానాశ్రయం, పాట్నా, బీహార్

CBC 03111/15/0004/2526




DD న్యూస్‌పై కార్యక్రమాన్ని వీక్షించండి



వాషింగ్టన్‌లో యుఎస్ అండర్ సెక్రటరీ జెఫ్రీ కెస్లర్‌తో భేటీ అయిన భారత్ విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ

## 31న మిస్‌వరల్డ్-25 గ్రాండ్ ఫినాలె

### టాప్ 40లో ఇప్పటికే 12 బెర్త్‌లు ఖరారు

### మిగిలిన వారిని ఎంపిక చేయనున్న న్యాయ నిర్ణేతలు

**హైదరాబాద్,మే 28 ,ప్రభాతవార్త:** మిస్ వరల్డ్-2025 ఫైనల్ పోటీలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన నలభై మంది అందాల భామలు ఫైనల్‌లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీ పడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, బ్యూటీ విత్ ఏ పర్పస్ విభాగం నుంచి నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, మొత్తం 14 మంది విజేతలై ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26 మందిని అమెరికాకరేబియన్, యూరప్, ఆఫ్రికా, ఆసియాఓషియానా ఖండాల వారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు మిస్ వరల్డ్ నిర్వాహకులు తెలిపారు. ఇండోనేసియా, వేల్స్ భామలు 2 పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్ 40లో ఇప్పటివరకు 12 బెర్త్‌లు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి 10 మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తరువాత రౌండ్‌లో వీరిలోంచి టాప్ ఇరవై మందిని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదు మంది ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దరిని ఎంపిక చేస్తారు. ఆ తరువాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు 1, 2, 3 రన్నరప్‌గా నిలుస్తారు. హైదరాబాద్ నగరంలోని హైటెక్స్‌లో నూతనంగా నిర్మించిన నాలుగో హాల్‌లో ఈ నెల 31న జరిగే మిస్ వరల్డ్ ఫైనల్ పోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రాఫిక్ విభాగం, సైబర్ పోలీసులు, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. మిస్ వరల్డ్ 2025-ఫైనల్ వేడుకలు సాయంత్రం 6-30 నుంచే ప్రారంభమవుతాయి. తుది పోటీలు మూడు గంటల పాటు జరగనున్నాయి.

## టిడిపి జాతీయ అధ్యక్షుడిగా మళ్లీ చంద్రబాబు ఎన్నిక

**కడప మే 28, ప్రభాతవార్త బ్యూరో:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరో సారి ఎన్నికయ్యారు. మహానాడు వేదికగా ఆయనను ఎన్నుకున్నట్లు టీడీపీ నేతలు ప్రకటించారు. గత 30 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబు నాయుడు కొనసాగుతున్నారు. 1995లో మొదటి సారి ఆయన పార్టీ పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయనే అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవడం సాంప్రదాయంగా వస్తుంది. మరోసారి తనను జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పార్టీ నేతలందరికి చంద్రబాబు కృతజ్ఞతలు చెప్పారు.

## మంజూరు పత్రాల పంపిణి

>> ప్రగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. గత పది సంవత్సరాల కాలంలో కార్పొరేషన్ల ద్వారా మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించారు. కానీ ప్రజా ప్రభుత్వం మనసుపెట్టి రూపొందించిన రాజీవ్ యువ వికాసం గతానికి చాలా భిన్నంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. మొత్తం ఎనిమిది వేల కోట్ల పెట్టుబడితో ఐదు లక్షల మంది యువతకు ఉపాధి కల్పిస్తున్నాము.

ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున మానవ వనరుల వినియోగం జరుగుతుంది, వ్యాపార కార్యకలాపాలు విస్తృతంగా జరుగుతాయి తద్వారా రాష్ట్ర జిడిపి పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉంది కాబట్టి యావత్ యంత్రాంగం ఈ పథకాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను కోరారు. ఆర్థిక సహాయం అందించాం, పని పూర్తయింది అని కాకుండా లబ్ధి పొందిన యువత లాభాలు ఆర్జిస్తున్నారా?లేదా? ఎవరికైనా ఎక్కడైనా చిన్నచిన్న ఇబ్బందులతో వ్యాపారం నిర్వహించలేకపోతే అధికారులు జోక్యం చేసుకొని వారి వ్యాపారాలను పునరుద్ధరించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.

ఐకెపిల్లో సపోర్టు సిస్టం చక్కగా కొనసాగుతుంది అదే తరహాలో రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి పొందిన వారిని నిరంతరం పర్యవేక్షించేందుకు, అవసరమైన సహాయం చేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని డిప్యూటీ సీఎం సూచించారు. మొదటి సంవత్సరం ఈ పథకాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని భవిష్యత్తులో మరింతగా విస్తరించుకుందామని అధికారులకు సూచించారు.

## కెసిఆర్‌తో హరీష్ భేటీ

>> కెసిఆర్ విచారణను ఎదుర్కొనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కెసిఆర్, హరీశ్ రావులు సమావేశమవుతున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ప్రస్తుతం విచారణ చేస్తోంది. ఈ క్రమంలో కెసిఆర్, హరీశ్ రావు, బిజెపి ఎంపి ఈటల రాజెందర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 5న కెసిఆర్, 6న హరీశ్ రావు, 9న ఈటెల రాజేందర్ విచారణకు హాజరుకావాల్సిందిగా కమిషన్ నోటీసులు ఇచ్చింది.కమిషన్ ఎదుట హాజరై అభిప్రాయాలను చెప్పడమే మంచిదని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యంతో పాటు తక్కువ సమయంలోనే నిర్మించిన తీరు వంటి అంశాలను కమిషన్‌కు వివరించవచ్చని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం.

## తెలంగాణ హైకోర్టు సిజెగా ఎకె సింగ్

>> సిఫార్సు చేసింది. ఆయన స్థానంలో తెలంగాణ హైకోర్టుకు అపరేష్ కుమార్ సింగ్ బదిలీ అయ్యారు. ఎకె సింగ్ 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012,జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు. మరోవైపు తెలంగాణహైకోర్టు న్యాయమూర్తిజస్టిస్ టి.వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది.

## సుప్రీం కోర్టును ఆశ్రయించిన మంచు విష్ణు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే28:** సినీ నటుడు మంచు విష్ణు తనపై 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో నమోదైన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసును రద్దు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. 2019 సాధారణ ఎన్నికల సందర్భంగా మంచువిష్ణు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఈ ఆరోపణల నుంచి తనను విముక్తుడిని చేయాలని అభ్యర్థిస్తూ మంచు విష్ణు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై ప్రాథమిక విచారణ జరిపింది. అనంతరం, ఈ కేసుకు సంబంధించి ప్రతివాదులుగా ఉన్నవారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసులో తదుపరి విచారణను జులై 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ఆ రోజున జరిగే విచారణలో కేసు పూర్తి వివరాలు, సమర్పించిన ఆధారాలు, ప్రతివాదుల వాదనలను న్యాయస్థానం పరిశీలించే అవకాశం ఉంది.

సుమారు ఐదేళ్ల క్రితం నాటి ఈ కేసు ఇప్పుడు సుప్రీంకోర్టు వరకు చేరడం సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది.

## వారం - వర్జ్యం

తేది : 29-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
తదియ రా.11.23
ఆరుద్ర రా.10.43
వర్జ్యం ఉ.10.09-11.40
దు.ఉ.9.55-10.47, 2)మ.3.08-4.00
శుభసమయం: ఉ.5.20-6.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తులాభం

**వృషభం :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**మిథునం:** ఋణ వత్తిడులు ఎదురై చికాకులు పెడుతాయి. శ్రమ పెరుగు తుంది. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది.

**కర్కాటకం :** కొత్త విషయాలు తెలుసుకుంటారు. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**సింహం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి.

**కన్య :** కుటుంబ బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** కొత్త మిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదరుతాయి. బాకీలు వసూలవుతాయి. వస్త్రలాభం.

**ధనుస్సు:** నూతన పరిచయాలు పెరుగు తాయి. సోదరుల నుండి శుభ వర్తమానాలు అందుకుంటారు.

**మకరం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**కుంభం:** పెట్టుబడులలో తొందరపాటు వద్దు. శత్రువులు సమస్యలను సృష్టించి చికాకులు పెడతారు.

**మీనం:** ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వరి సహా 14 పంటలకు 'మద్దతు' పెంపు

>> పప్పుదినుసులు, నూనెగింజలకు 9శాతం చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్‌సమావేశం ఈమేరకు తమ నిర్ణయాలనుప్రకటించింది. నైరుతి రుతుపవ నాలు సాధారణ గడువుకంటే ముందే ప్రవేశించడంతో ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభం అవుతున్నందున ముందుగానే ప్రభు త్వం మద్దతుధరలనుప్రకటించింది. ఈసారి భారత సాలీనా ఆహారోత్పత్తులను 50శాతం పెంచాలని నిర్ణయించారు. కేబినెట్ సమావేశం వివరాలను సమాచారశాఖ కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్ మాట్లాడుతూ రైతులు సంక్షేమం కోసం రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లుచెప్పారు. ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలతోపాటు వడ్డీరాయితీపథకాన్ని కూడా పొడిగించినట్లు చెప్పారు. గడచిన 10-11 ఏళ్లలో 14 ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలు గణనీయంగాపెంచామన్నారు. వ్యవసాయ వ్యయాలు, ధరల పరిశీలన కమిటీ (సిఎసిపి) సిపారసుల ప్రకారం మద్దతుధరలు పెంచుతున్నట్లు తెలిపారు. ఇతర తృణధాన్యాల్లో రాగి ధరలు రూ.596 పెరిగి క్వింటాలుకు రూ.4886లుగాను, జొన్నలు క్వింటాలుకు రూ.328 పెరిగి రూ.3699(హైబ్రిడ్) రకానికి పెంచారు. మల్దాని జొన్నల రకానికి రూ.3749లుగా నిర్ణయించారు. మొక్కజొన్న రూ.175 పెరిగి క్వింటాలుకు రూ.2400గా నిర్ణయించారు. అలాగే సజ్జలు కూడా రూ.150 పెరిగి 2775వరకూ చేరాయి. ఇక పప్పుదినుసులపరంగా ధరలు 5.96శాతంపెరిగాయి. నూనెగింజలు 9శాతంపెరిగినట్లు కేంద్ర మంత్రి వివరించారు. దేశీయంగానే ఉత్పత్తిని పెంచి దిగుమతులను తగ్గించే లక్ష్యంతోనే మద్దతుధరలతో రైతులను మరింత ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇక వేరుశెనగ ధరలు రూ.480 పెంచి క్వింటాలుకు 726, సోయాబీన్‌ను రూ.436 పెంచి క్వింటాలుకు 5329గాను నిర్ణయించారు. అలాగే పొద్దుతిరుగుడు గింజలు రూ.441పెంచి రూ.7721గా నిర్ణయించారు. ఇక నువ్వులు రూ.579 పెంచి క్వింటాలుకు 9846గాను ఇతర తృణ ధాన్యాలు రూ.820 పెంచి క్వింటాలుకు 9537గాను నిర్ణయించినట్లుకేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్ తెలిపారు. ఇక వాణిజ్యపంటలపరంగా పత్తి కనీసమద్దతుధరను క్వింటాలుకు 589 పెంచి రూ.7710గానిర్ణయించారు. పొడవు గింజల పత్తి క్వింటాలుకు రూ.8110గానిర్ణయించారు. దేశవ్యాప్త సగటు ఉత్పత్తి వ్యయాన్ని పరిగణనలోనికి తీసుకుని 1.5 రెట్లు కనీస మద్దతుధరలను పెంచుతున్నట్లు చెప్పారు. మొక్కజొన్నలో 59శాతం,కందులులో 59శాతం, మినుములులో 53శాతం ఉత్పత్తి వ్యయాలున్నట్లు తేలింది. మిగిలిన పంటలకు ఉత్పత్తి వ్యయం కూడా 50శాతం పెరిగిందని తేల్చారు. రాగి, పత్తి, నువ్వులు పంటలకు కనీస మద్దతుధరల్లో గరిష్టంగా పెంచినట్లు కేంద్రం ప్రకటించింది. అలాగే వడ్డీరాయితీకింద రూ.15, 642 కోట్లు, కనీసమద్దతుధరలకు రూ.2.7 లక్షలకోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రూతులకు పెట్టుబడిపై 59శాతం మార్జిన్ ఉండేటట్లు నిర్ణయించా మన్నారు. దేశంలో కిసాన్‌క్రెడిట్‌కార్డుదారులకు 2014లో రూ.4.24 లక్షకోట్లు ఇస్తే 2024 డిసెంబరునాటికి ఆ మొత్తం రూ.10.05 లక్షలకోట్లకు పెరిగిందన మంత్రి వివరించారు. సాలీనా వ్యవసాయ పరపతి రూ.7.3 లక్షలకోట్లనుంచి ప్రస్తుతం రూ.25.49 లక్షలకోట్లకుపెరిగిం దని కేంద్ర మంత్రితెలిపారు. ఇందుకోసం కిసాన్ రిన్ పోర్టల్‌ను కూడా ప్రారంభించినట్లు చెప్పారు. రైతులకు గ్రామీణ ప్రాంతాల్లో రుణపరపతి చేరువచేయడం, రైతు రాబడులను రెట్టింపుచేసే లక్ష్యంతోనే వడ్డీరాయితీని అమలుచేస్తున్నట్లు చెప్పారు. అలాగే మహారాష్ట్ర, మద్యప్ర దేశ్‌లలో ప్రయాణ సౌకర్యాలు మరింత పెంచేందుకు రవాణా వ్యయం మరింత తగ్గించే లక్ష్యంతో 2ప్రాజెక్టులు ప్రారంభించింది. రత్లాం నగోడా మూడు,నాలుగో లైన్, వార్ధా బలార్షా నాలుగోలైన్ ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం వ్యయం 3399 కోట్లుగా ఉంటుంది. ఈప్రాజెక్టులు 2029-30 కల్లాపూర్తి అవు తాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని నాలుగు జిల్లాల మీదుగా ఈ ప్రాజెక్టువెళుతుంది. రైల్వేలు 176 కిలోమీట ర్లమేర విస్తరిస్తోంది. 784 గ్రామాలకు కనెక్టివిటీ పెరుగుతుంది. మొత్తం 19.74 లక్షలజనాభాకు రైల్వే మార్గం అందుబాటులోకి వస్తుంది. బొగ్గు, సిమెంట్, క్లిం కర్, జిప్సం, ఫ్లైయాష్, కంటైనర్లు, వనయవసాయ ఉత్పత్తులు, పెట్రోలియం ఉత్పత్తులు రవాణాకు మరింత సులభం అవుతుంది. సాలీనా 18.40 మిలియన్ టన్నులు రవాణాకు వీలవుతుంది. ఈప్రాజెక్టుల ద్వారా 74 లక్షల పనిదినాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అదేవిధంగా ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ రూ.3653.10 కోట్ల వ్యయంతో 108.134 కిలోమీటర్ల నిడివిగల బద్వేల్ గోపవరం గ్రామాల మధ్య ఎన్‌హెచ్ హైవేను ఆదునీకరిస్తోంది. అలాగే గురువిందపూడివరకూ కూడా ఈ హైవే విస్తరిస్తున్నారు. డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్‌కింద ఈ హైవే నిర్మాణం జరుగుతుంది. సన్నచిన్నకారు రైతులకు ఎంఐఎస్ఎస్ పథకం కింద మూడు లక్షలవరకూ కిసాన్‌క్రెడిట్‌కార్డులపై పొందగలుగుతారు. దీనిపై వడ్డీ ఏడుశాతం మాత్రమే ఉంటుంది. అందులోనూ 1.5 శ్తాతం వడ్డీరాయితీ ఉంటుంది. అర్హతపొందిన బ్యాంకింగ్ సంస్థలు ఈ రుణాలుకేటాయిస్తాయి. క్రమం తప్పకుండా చెల్లించే రైతులకు మరో మూడుశాతం సక్రమ చెల్లింపుల ప్రోత్సాహకం కింద పొందుతారని, దీనితో కెసిసి రుణాలకు వడ్డీ కేవలం నాలుగుశాతం మాత్రమే ఉంటుందని తెలిపారు. ఇక పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖల్లో రుణాలు తీసుకునేవారికి వడ్డీ ప్రయోజనాలు రూ.2 లక్షలవరకూ ఉంటాయి. మొత్తం 7.75 కోట్లకుపైగా కెసిసి ఖాతాలున్నాయి.



శ్రీనగర్ విమానాశ్రయం తిరిగి తెరిచిన తర్వాత బుధవారం మక్కాకు వెళ్తున్న హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న బంధువులు

## పైలట్ జిల్లాల్లో నేడు ఇందిరమ్మ అమృత పథకం ప్రారంభం

### ఏర్పాట్లు చేసిన అధికారులు

**హైదరాబాద్,మే 28,ప్రభాతవార్త:** ఆరోగ్య తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆడపిల్లలకు శక్తినిద్దాం.. ఆరోగ్య తెలంగాణను నిర్మిద్దాం అనే నినాదంతో మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రక్తహీనత సమస్యతో బాధపడుతున్న కౌమార బాలికలకు పోషకాహారాన్ని అందజేసేందుకు మహిళా,శిశు సంక్షేమ శాఖ చర్యలు మొదలు పెట్టింది.

ఇందిరమ్మ అమృతం పేరుతో కౌమార బాలికలకు పోషకాహారం అందించేందుకు పల్లి, చిరుధాన్యాలతో తయారు చేసిన చిక్కీలను ప్రతి నెల అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం, కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలను ఎంపిక చేశారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 5 ప్రకారం, రాష్ట్రంలో 64.7 శాతం కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఇందిరమ్మ అమృతం పేరుతో 14 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సున్న కౌమార బాలికలకు పోషకాహారంగా పల్లి,చిరుధాన్యాలతో తయారైన చిక్కీలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

## రెవెన్యూ రికార్డుల్లో పేరు ఉంటే.. హక్కు ఉన్నట్లు కాదు..

### సంచలన తీర్పు ఇచ్చిన హైకోర్టు

**హైదరాబాద్,మే 28 ,ప్రభాతవార్త:** భూమి హక్కుల విషయంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. రెవెన్యూ రికార్డుల్లో పేరుంటే హక్కులు రావని తేల్చి చెప్పింది. పహాణీలు, రెవెన్యూ ఎంట్రీలు కేవలం పన్నులు, పంటల వివరాల కోసమేనని స్పష్టం చేసింది. భూమిపై అసలైన హక్కు సివిల్ కోర్టులోనే తేలుతుందని తెలిపింది. ఆలయ భూముల వివాదాలను ఎండోమెంట్ ట్రిబ్యునల్ పరిష్కరిస్తుందని కోర్టు పేర్కొంది. ఈ తీర్పు భూ వివాదాలకు ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. భూ యాజమాన్య హక్కులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. కేవలం రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నంత మాత్రాన ఆ భూమిపై ఎటువంటి హక్కు లేదా టైటిల్ సంక్రమించదని స్పష్టం చేసింది. భూమి వర్గీకరణ, పంటల స్వభావం, భూమి శిస్తు (పన్ను)ల కోసం మాత్రమే పహాణీలు, ఇతర రెవెన్యూ ఎంట్రీలుఉపయోగపడతాయని కోర్టు పేర్కొంది. ఒవెన్యూ ఎంట్రీలను ఎప్పుడూ రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌వోఆర్)గా భావించరాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో తెలంగాణ హైకోర్టు రెవెన్యూ రికార్డుల ప్రామాణికతపై స్పష్టతనిచ్చింది. రెవెన్యూ రికార్డుల్లోని ఎంట్రీతో కొత్త హక్కులు సంక్రమించబోవని. ఇప్పటికే ఉన్న హక్కులు హరించుకుపోవని కోర్టు వివరించింది. భూమిపై నిజమైన హక్కు ఎవరిది అనే విషయం కేవలం సంబంధిత సివిల్ కోర్టులోనే తేలుతుందని. రెవెన్యూ అధికారులు జారీ చేసే పత్రాలు కేవలం పరిపాలనా ప్రయోజనాలకేనని హైకోర్టు నొక్కి చెప్పింది. భూ వివాదాల పరిష్కారంలో సివిల్ కోర్టులదే అంతిమ నిర్ణయం అని ఈ తీర్పు తేటతెల్లం చేసింది. ఇది భూ వివాదాలను తగ్గించి.. పారదర్శకతను పెంచడంలో సహాయపడుతుంది. రెవెన్యూ అధికారులు కేవలం భూమి పన్ను వసూలు, సాగు వివరాలు వంటి వాటిని నమోదు చేయడానికి మాత్రమే అధికార పరిధిని కలిగి ఉంటారని ఈ తీర్పు స్పష్టం చేసింది. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల గ్రామంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి చెందిన 14.05 ఎకరాల భూమి వివాదానికి సంబంధించి ఈ తీర్పు వెలువడింది. 2018లో తమకు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసి.. ఆ తర్వాత తమ పేర్లను తొలగించడం చెల్లదని పేర్కొంటూ ఆలయ పూజారి ఆరుట్ల నర్సింహాచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివాదంపై వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ఈ వివాదాన్ని ఎండోమెంట్ ట్రిబ్యునల్లో తేల్చుకోవాలని సూచించింది. దేవాదాయ ధర్మాదాయ సంస్థలకు ఈ కేసు ద్వారా.. ఆలయ భూములు లేదా దేవాదాయ ధర్మాదాయ సంస్థలకు సంబంధించిన భూ వివాదాలను సివిల్ కోర్టులకు బదులుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎండోమెంట్ ట్రిబ్యునల్స్ పరిష్కరించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇది దేవాదాయ భూముల రక్షణకు, వాటి యాజమాన్య హక్కుల స్పష్టతకు దోహదపడుతుంది. ఈ తీర్పు భవిష్యత్తులో తెలంగాణలో తలెత్తే అనేక భూ వివాదాలకు మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## అడ్డుకుంటే వాతపెట్టండి

>> గురుకులాల విద్యార్థులకు అవార్డులు అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా వారి స్ఫూర్తిని కొనసాగించేందుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నాం, కోఠిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ కొనసాగిస్తోందని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసుకుంటున్నట్లు తెలిపారు. పాలితులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు.. మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు, చదువు మాత్రమేనని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువులతోనే సాధ్యమవుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనత భావాన్ని వీడాలి, వారిలో ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, ఒక విద్యార్థి చదువు, ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు, మౌలిక వసతులు కూడా బాగుండాలని సీఎం వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు చదువులు వద్దు. కులవృత్తులు మాత్రమే చేసుకోవాలని గత పాలకులు భావించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు, బీసీలు, గొర్రెలు,బర్రెలు, చేపలు పెంచుకుంటూ ఉండాలన్నట్లుగా మాజీ సీఎం వ్యవహరించారని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు ఇచ్చారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదు? అని ప్రశ్నించారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారని, మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. తన ఇంట్లో వాళ్ల ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత మా ప్రభుత్వానిది చెప్పారు. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాల భర్తీ త్వరగా పూర్తయితే ఉద్యోగం రానివారు మరో పని చూసుకుంటారని అన్నారు. ఉద్యోగాల భర్తీ త్వరగా జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని, కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశాం, కానీ నోటికాడి కూడును కిందపడేసినట్లు రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని చెప్పారు. తమ హయాంలో 563 గ్రూప్1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్1లో 89శాతం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారని,అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని చెప్పారు. నోటి కాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్లుగా కేసులు వేస్తున్నారని, ఉద్యోగాలను అడ్డుకుంటున్న వారిని ప్రజలు నడి రోడ్డుపై నిలదీయాలని రేవంత్ రెడ్డి అన్నారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో వీసీగా తొలిసారిగా దళితుడిని నియమించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది, విద్యా కమిషన్ చైర్మన్ గా ఆకునూరి మురళిని నియమించాం, అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నాం, వీళ్ళందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి గుర్తింపు వచ్చింది అని చెప్పారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది, అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ. లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, కడియం కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో మంత్రులకు డిన్నర్ మీటింగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే28:** పెండింగ్‌లో ఉన్న టిపిసిసి కార్యవర్గం, మంత్రి వర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు,డిసిసి అధ్యక్షుల నియామకం తదితర వాటిపై కాంగ్రెస్ తీవ్ర కసరత్తు చేస్తోంది. ఇదే అంశంపై ఈనెల 30న ఢిల్లీకి వెళ్లి అధిష్ఠాన పెద్దలతో చర్చలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. బుధవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులందరికీ సిఎం డిన్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సిఎం తొలిసారి మంత్రులందరికీ తన నివాసంలో డిన్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ డిన్నర్ మీటింగ్‌కు మంత్రి సీతక్క తప్ప మంత్రులందరూ హాజరయ్యారు. కాగా ఉదయం నుంచి ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మీనాక్షి నటరాజన్ మంత్రులు,నేతలతో సమావేశం నిర్వహించి పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. నేతల మధ్య విభేదాలను కూడా ఆరా తీశారు. మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్ మధ్య వివాదాలను, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ గడ్డం వంశీ మధ్య ప్రోటోకాల్ సమస్యలను మీనాక్షి నటరాజన్ చర్చించి సమన్వయం కోసం తగు సూచనలు చేసినట్లు సమాచారం. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీనాక్షి నటరాజన్‌తో సమావేశమయ్యారు. తర్వాత సాయంత్రం సిఎం వద్ద జరిగన డిన్నర్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డితో పార్టీ,ప్రభుత్వ అంశాలను చర్చించారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి అమలు తీరు గురించి ఇరువురు చర్చించినట్లుగా సమాచారం. పార్టీ నాయకుల ద్వారా సేకరించిన అభిప్రాయాలు,సూచనలు,సలహాలను సిఎం రేవంత్‌రెడ్డిడి ఆమె తెలిపినట్లుగా సమాచారం. కులగణన దేశ వ్యాప్తంగా తెలంగాణ ఆదర్శం కావడంతో దాని కొనసాగింపుగా ఏం చేయాలనే దానిపై కూడా చర్చించినట్లుగా తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లపై ప్రభుత్వ పరంగా,పార్టీ పరంగా వ్యవహరించాల్సిన తీరుపై డిస్కస్ చేశారని తెలిసింది. దీంతో పాటు జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం చేపట్టబోయే కార్యక్రమాలను సిఎం వివరించినట్లుగా సమాచారం.

# ఆన్‌లైన్ లావాదేవీలపై సైబర్ నేరగాళ్ల నజర్

**ఏమరపాటుగా ఉంటే డబ్బులు హాంఫట్**

**జాగ్రత్తలు పాటించాలంటున్న సైబర్ నిపుణులు**


**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రకటనలు ఇస్తూ అమాయకులను టోకరా వేస్తున్న సైబర్ నేరగాళ్ల నేరాలు ఇటీవల పెరిగాయి. ఆన్‌లైన్‌లో లావాదేవీలు ఎక్కువగా నిర్వహించే వ్యక్తులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకుని ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైంపోలీసుల పరిశీలనలో తేలింది. ఈ తరహా మోసాలపై అందరు జాగ్రత్తగా వుండాలని సైబర్‌నిపుణులు కోరుతున్నారు.

సైబర్ నేరగాళ్ల దోపిడీలు కొత్త పుంతలు పోతున్నాయి. ఇప్పటి వరకు అనేకరకాలుగా అమాయకులను టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ఆన్‌లైన్‌లో లావా దేవీలు సాగించే వారిని టార్గెట్ చేసుకోసాగారు. ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వాడకం పెరిగిపోవడంతో 90శాతం మంది నగదు లావాదేవీలకు బదులు ఆన్‌లైన్ చెల్లింపుల వైపు మళ్లడంతో సరిగ్గా ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు ఈతరహా లావాదేవీలు సాగించే వారి వివరాలు తెలుసుకునివారి సెల్‌ఫోన్లకు అనేక రకాలుగా మెసేజ్‌లు పంపుతున్నారు. ముఖ్యంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్‌లకు వస్తున్న మెసేజ్‌లు ఆన్‌లైన్‌లో లావాదేవీలు సాగించే వారిని ఆకట్టుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో లావాదేవీలు సాగిస్తున్న మీరు మా కంపెనీ వస్తువులు తక్కువ ధరకు కొనండి, వీటిని మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్మించే పూచీ మాది అంటూ సైబర్ నేరగాళ్లు తరుపున ప్రకటనలు వస్తున్నాయి. వీటిని ఎవరైనా నమ్మి క్లిక్ చేస్తే మొదట వెయ్యి రూపాయల వరకు వస్తువులకు ఆర్డర్ చేయమని సైబర్ నేరగాళ్లు అడుగుతారు. ఇందుకు అమాయకులు సరే అని వెయ్యి రూపాయలు పంపగా 1300 రూపాయల విలువ చేసే వస్తువులు ఇంటికి వస్తాయి. ఇలా రెండు మూడు దఫాలు రెండోసారి, మూడోసారి వందల లాభాలు చూపుతారు. ఆ తరువాత లక్ష రూపాయల వస్తువులకు ఆర్డర్ చేయమంటారు. నేరగాళ్లు చెప్పినట్లు చేయగానే అవతలి వ్యక్తుల ఫోన్‌లు స్విచాఫ్ అవుతాయి. ఈ తరహా మోసాలు దేశ వ్యాప్తంగా గడచిన కొన్ని నెలల కాలంలో వేల సంఖ్యలో జరిగినట్లు సైబర్ క్రైం పోర్టల్‌లో వున్న గణాంకాలు చెబుతున్నాయి. తెలంగాణ వర కు వస్తే పది వరకు జరిగాయని తేలింది. ఈ తరహా మోసాలు పల్లెల నుంచి పట్టణాల వరకు అంత టా సాగుతుండడం గమనార్హం. ఆన్‌లైన్ లావాదేవీలతో పాటు లోన్ యాప్‌ల పేరిట కూడా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. రుణం కోసం లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వలురకాల ఫీజుల పేరిట లక్ష రూపాయల వరకు వసూలు చేసి ఆ తరువాత సెల్ ఫోన్లు స్విచాఫ్ చేస్తున్నారు.

**సైబర్ నిపుణుల సూచనలు:** ఆన్‌లైన్‌లో వ్యాపారం పేరిట వచ్చే ప్రకటనలను ఎవరూ గుడ్డిగా నమ్మవద్దని సైబర్ నిపుణులు కోరుతున్నారు. ముఖ్యంగా ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రకటనలను అసలు నమ్మవద్దని వారు కోరుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఓఎల్‌ఎక్స్, స్వాప్ డీల్ ద్వా రా ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. తమకు తెలియని వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎలాంటి నగదు బదిలీలు చేయకూడదని వారు చెబుతున్నారు. వ్యక్తిగత రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తామని వచ్చే ఫోన్లు, లింకులకు స్పందించ వద్దని వారు కోరుతున్నారు. డెబిట్ కార్డు, ఫోన్ హ్యాక్ అయిందనే అనుమానం వచ్చిన వెంటనే ఆన్‌లైన్ కొనుగోళ్లను ఆపివేయాలని వారంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా నగదు పంపడం లేదా తీసుకోవడం చేయ వద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో ఏమాత్రం అనుమానం వచ్చినా, ఎవరైనా మోసపోయినా వెంటనే టోల్ ఫ్రీ 1930 లేదా సమీప పోలీసు స్టేషన్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని నిపుణులు కోరుతున్నారు.

# హమాస్ చీఫ్ మహ్మద్ సిన్వర్‌ను హతమార్చాం!

## ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని నెతన్యాహు ప్రకటన



**జెరూసలెం, మే 28:** హమాస్ అధినేత మహ్మద్ సిన్వర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు బుధవారం ప్రకటించారు. తమసైన్యం సీనియర్ హమాస్ నేత సిన్వర్‌ను హతమార్చిందని గాజాస్ట్రిప్‌లోని ఒక ఆసుపత్రిపై జరిపిన వైమానిక దాడిలోసిన్వర్ హతమయినట్లు ప్రధానమంత్రి చెప్పారు. తన సోదరుడు యాహ్యా సిన్వర్‌అంతమొందించిన తర్వాత హమాస్‌నేతగామహ్మద్ సిన్వర్ బాధ్య తలుచేపట్టారు. గత ఏడాది జరిగిన ముకుమ్మడి దాడిలో యాహ్యాసిన్వర్ ఇజ్రాయెల్ సైనికుల చేతిలో హతమ య్యాడు. బుధవారం ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో మాట్లా డుతూ యుద్ధ మొదలైన గాజాలో యాహ్యాసిన్వర్ సైన్యం "సోదరుడు ప్రస్తుత చీఫ్ మహ్మద్ సిన్వర్‌కూడా మృతుల జాబితాలో చేరాడని ప్రకటించారు. మధ్యప్రాచ్య యొమిత్రదూరులపై మార్పు వేసామని, మన ప్రాదేశిక ప్రాంతం నుంచి మొత్తం ఉగ్రవాదులను తరిమికొట్టామని, గాజాస్ట్రిప్‌లో కూడా మన దళాలు వేలాది ఉగ్రవాదులను నిర్మూలించాయని ఇందులో భాగం గానే మహ్మద్ సిన్వర్‌ను కూడా హత మార్చినట్లు బెంజమిన్ పార్లమెం టులో తెలిపారు. దక్షిణ గాజా సిటీలోఖాన్‌యూనిస్‌లో ఈనెల 13వ తేదీ ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హత మయినట్లు నిర్ధారించారు. ఖాన్‌యూనిస్‌లోని యూరోపియన్ ఆసుపత్రి వద్ద ఉన్న హమాస్ కమాండ్ కం ట్రోల్ సెంటర్, భూగర్భంలో ఉన్న ఉగ్రమౌలికవ నరుల కేంద్రంలో సిన్వర్ ఉన్నట్లు నిర్ధారించుకుని దాడులుచేసినట్లుప్రకటించారు. ఇజ్రాయెల్ పెద్దన్న యాహ్యా సిన్వర్ నేతృత్వంలోనే ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి దిగింది. అందువల్లనే 2024 అక్టోబరులో సిన్వర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. హమాస్ సైనిక చీఫ్ మహ్మద్ డైయిఫ్ చనిపో యిన తర్వాత ఆ సేనకు మహ్మద్ నాయకత్వం వహిస్తున్నాడు.

# యాదాద్రి దేవస్థానంలో చింతపండు దొంగలు

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు**

**అక్రమానికి పాల్పడిన ఇంటి దొంగలు**

**ప్రసాదాల తయారీ కేంద్ర ఇన్‌చార్జికి షోకాజ్ నోటీసులు జారీ**

**కేసు నమోదు చేసిన పోలీసులు**



**ప్రభాతవార్త - భువనగిరి:** దేవుడికే శఠగోపం పెట్టారు దేవస్థాన ఉద్యోగులు. ప్రసాదాల తయారీ కోసం ఉపయోగించే చింతపండు దొంగిలించి గుట్టు చప్పుడు కాకుండా కారులో వేసుకుని వెళ్తున్న సదరు దేవస్థాన ఉద్యోగులను పోలీసులు రెడ్ హాం డెడ్‌గా పట్టుకున్న సంఘటన తెలంగాణ తిరుపతిగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాత దేవస్థానంగా రూపుదిద్దుకుంటున్న యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో బుధవారం దొంగతనం సంఘటన వెలుగుచూసింది. భక్తులు ముక్కున వేలువేసుకునేలా కంచే చేను మేసిందన్న చందంగా చోటు చేసుకున్న సంఘటన విస్మయపర్చింది. ప్రసాదాల తయారీలో ఉపయోగించే ముడి సరుకుల్లో ఒకటైన చింతపండును చోరీ చేస్తూ ఉద్యోగులు పోలీసులకు రెడ్ హాండెడ్‌గా పట్టుబడిన వైనం దేవస్థానంలో భద్రతా డొల్లతనం బట్టబయలైనట్లు అయ్యింది. ఈ సంఘటన అధికారుల పర్యవేక్షణ లోపాన్ని కొట్టొచ్చినట్లు ఎత్తిచూపుతుంది. ప్రసాదాల విక్రయ శాలలో పనిచేస్తున్నటువంటి ఔట్ సోర్సింగ్ సిబ్బంది మధు, గణేష్ అనే ఇద్దరు పది బస్తాల చింతపండును కారులో వేసుకుని తరలిస్తుండగా ఎస్‌పిఎం సిబ్బంది కంట పడ్డారు. ఈసమాచారాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించగా హుటాహుటీగా సంఘటన స్థలికి చేరుకుని దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కారులో తరలిస్తున్న చింతపండు బస్తాల గుట్టు విప్పారు. ఎపి9ఎడబ్ల్యూ 3254 నెంబర్ గల కారు నుంచి ఆరు బస్తాలు, కన్వేర్ బెల్టుపై 3 బస్తాలు స్వాదీనం చేసుకోవడం జరిగిందని, ఈ సంఘటనకు బాధ్యులైన ఔట్ సోర్సింగ్ సిబ్బంది సిహెచ్.గణేష్, పులిహోర మిషన్ ఆపరేటర్ పి.మధు, క్లీనింగ్ స్టాఫ్‌వారులుగా గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ సంఘటనపై ప్రసాదాయాల తయారీ గుమ్మస్తాల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పించిందని షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఉప కార్యనిర్వాహణ అధికారి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

**అందరి చూపు ఆ అధికారిపైనే:** యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో నాలుగు విభాగాలను పర్యవేక్షించే ఒక అధికారి అంతా తానై సిబ్బందిని ఇష్టానుసారంగా తన దందాకు వాడుకుంటున్నట్లు గుసగుసలు గుప్పుమంటున్నాయి. ఈ దొంగతనం సంఘటనలో అతడి పాత్రపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని స్వామి వారి భక్తులు డిమాండ్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే ప్రసిద్ధి గాంచిన యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ సన్నిదిలోనే దేవస్థాన ఉద్యోగులే దొంగతనానికి పాల్పడిన సంఘటన యాదాద్రి జిల్లాలో కలకలకం సృష్టిస్తుంది.



పుట్టిన బిడ్డతో కలెక్టర్, వైద్యులు

# సర్కార్ దవాఖానలో కలెక్టర్ సతీమణి ప్రసవం..

**కలెక్టర్ సతీమణికి పురుడుపోసిన ప్రభుత్వ వైద్యులు**

**పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన శ్రద్ధ జితేష్ వి పాటిల్**

**కొత్తగూడెం, మే 28 - ప్రభాతవార్త:** సర్కార్ దవాఖానాల్లో మెరుగైన వైద్యం అనందిస్తున్నారనే విషయాన్ని అందరికి చాటిచెప్పారు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్. ప్రైవేట్, కార్పోరేట్ ఆస్పత్రులు అంటూ పరుగులు తీసే వారికి పాల్వంచ సర్కార్ ఆస్పత్రిలో వైద్యులు మంచి వైద్యం అందిస్తున్నారని అందరికీ అర్థమయ్యేలా చేసి చూపించారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సదుద్దేశంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తన సతీమణినీ పాల్వంచ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రి లో చేర్పించారు. బుధవారం పండంటి మగ బిడ్డకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ జన్మనిచ్చారు. తల్లీ, బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉన్నారు. గర్భవతి అయినప్పటి నుంచి ఆమె ను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి కి జిల్లా కలెక్టర్ ప్రతినెలా కూడా తీసుకుని వచ్చి దగ్గరుండి మరి అన్ని పరీక్షలు చేయిస్తూ ఆరోగ్య చర్యలు తీసుకుంటున్నారు ఈ క్రమంలో కలెక్టర్ సతీమణికి 9 నెలల నిండడంతో బుధవారం ఆస్పత్రికి తీసుకువచ్చారు.. జిల్లా వైద్య సమన్వయ అధికారి రవిబాబు పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెంట్ రాంప్రసాద్, సర్జన్ సోమరాజు దొర, మత్తు డాక్టర్ ప్రసాద్ సమక్షంలో నర్సింగ్ ఆఫీసర్ స్వర్ణలత గైనకాలజిస్టు సరళ, అనూష లు సిజేరియన్ ఆపరేషన్ చేసి మగ బిడ్డను సురక్షితంగా తీశారు. ఈ సందర్భంగా పాల్వంచ వైద్య సిబ్బంది కలెక్టర్కు స్వీట్లు తినిపించి అందరూ సంబరాలు చేసుకున్నారు.

# ఎసిబి అదుపులో ఇబ్రహీంపట్నం ఆర్ఐ

## లక్షలలో లంచంకేసు..



ఆర్ఐ కృష్ణ

**ఇబ్రహీంపట్నం, మే 28, ప్రభాతవార్త :**రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులుదాడులు నిర్వహించారు. మండల పరిధిలోని ఆదిభట్ల రెవెన్యూ లోని సర్వేనెంబర్. 355 ఏడుగుంటల భూమి ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఆ భూమినీ నమోదు చేసేందుకు సంబంధిత రైతు ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణను ఆశ్రయించగా డబ్బులుముట్ట చెప్పాల్సి వస్తుందని అందుకు రూ.12లక్షలు ఖర్చవుతుందని రైతును డిమాండ్‌చేశాడు. కాగా సంబంధిత రైతు తాను అంత డబ్బు ఇచ్చుకో లేనని తెలుపడంతో రూ.9లక్షలకు బేరం కుదిరించుకున్నారు. ముందుగా రూ.4.5లక్షలు ఇవ్వాలని పని పూర్తయ్యాక మిగతా డబ్బు అందజేయాలని ఇరువురి మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు.దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణను బుధవారం ఏసీబీ అధికారులు తహసిల్దార్ కార్యాలయంలో అదుపులోకి తీసుకొని మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన విచారణ రాత్రి 8గంటల వరకుకొనసాగింది. అయితే డబ్బులు డిమాండ్ చేసిన వారిలో ఉన్నతాధికారులు అన్న ప్రస్తావన రావడంతో స్థానిక ఆర్డిఓ, ఎమ్మార్వో, డిప్యూటీ తహసిల్దార్లను సైతం విచారించినట్లు తెలుస్తుంది. కాగా విచారణ సమయంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దారు అనిత ఉన్నారు. ఈ మేరకు ఆర్. కృష్ణను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తదుపరి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పి తెలిపారు.

# జూన్ 8,9 తేదీలలో చేప ప్రసాదం పంపిణి





బుధవారం మీడియా మావేశంలో మాట్లాడుతున్న అమర్నాథ్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 28 ప్రభాతవార్త:** రెండు శతాబ్దాలుగా ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గ వంటి శ్వాస సంబంధ వ్యాధుల నివారణకు మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియాల్లో జూన్ 8వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు ప్రసాదం పంపిణీ చేస్తున్నామని బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్గీయ బత్తిని హరినాథ్‌గౌడ్ తనయుడు అమర్నాథ్‌గౌడ్, ఇతర కుటుంబ సభ్యులు శివశంకర్ గౌడ్, గౌరీశంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, శివగౌడ్ మాట్లాడుతూ ఈ చేప ప్రసాదం కోసం దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది వస్తుంటారని ఇందు కోసం ఎవరికి అసౌకర్యం కలగకుండా సిఎం రేవం త్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ పర్యవేక్షణలో పూర్తి సహకా రాన్ని సంబంధిత శాఖలు అందిస్తున్నాయని, అందరి సహకారంతో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని, ప్రతి ఏడాదిలో వలే ఈ ఏడాది కూడా జిహెచ్‌ఎంసి, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, మున్సి పాలిటి, పోలీస్, విద్యుత్ శాఖతోపాటు మత్స్యశాఖ కూడా కావాల్సినన్ని చేపలను సిద్ధం చేస్తున్నదన్నారు. జూన్ 8వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 10 గంటల వరకు చేప ప్రసాదం పంపిణి జరుగుతుందని, ఆ తరువాత ఇంకా ఎవరైనా వస్తే తమ నివాసాలైన దూద్‌భౌలి, కవాడిగూడలో పంపిణి చేస్తామన్నారు. నగరంలోనూ, శివారు ప్రాంతాలలో నివసించే వారు చేప ప్రసాదం కోసం త్వరపడరాదని, అందరికి పంపిణి చేస్తామని వారు హామీ ఇచ్చారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు రోగులకు ఉచితంగా కాఫీ, టి, భోజనం, మంచినీరు, మజ్జిగ

# పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం అభివృద్ధిపై పనులు వేగవంతం



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో పలు అభివృద్ధిపనులు వేగవంతం చేయాలని, నిర్మాణంలోని భవనాలు, మౌళిక సదుపాయాలు ,పరికరాల వివరాలు సమగ్రనివేదిక అందించాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఇక్క చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సలు ,గుండె మార్పిడి తదితర వార్డులను ఆయన పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం ఇఒ శ్యామలరావు,జెఈఒ వీరబ్రహ్మం, సిఇ సత్యనారాయణతో కలసి తనిఖీ చేశారు. పద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని మరింతగా అన్ని రకాల వైద్యసేవలందించేదిశగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు.

# విద్యార్థులే టాయిలెట్స్ కడగాలి..

**కాంగ్రెస్ పాలనలో గురుకులాల దుస్థితి ఇది : ఎమ్మెల్సీ కవిత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40వేలు కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారు అని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెలనుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించి నందున పిల్లలే టాయిలెట్లు, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమా దవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీగా ఏర్పడి క్వాలిటీ చెక్ చేసుకునేవారు.కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ, మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. శ్రమను గౌరవించడం నేర్పడంవేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పినదాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటికాదు. మేడం పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్ లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చో గానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఎఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు.

# పాత రైల్వే స్టేషన్ భవనంలో డిఆర్ఎం తనిఖీలు

**గుంతకల్లు రైల్వే,మే 28,ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు పాత రైల్వే స్టేషన్ భవనాన్ని డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా తనిఖీలు నిర్వహించారు. రైల్వే డివిజనల్ ప్రధాన కేంద్రమైన గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ఇటీవల జరిగిన దురదృష్టకర సంఘటనలో కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డివిజన్‌కే ప్రధాన పరిపాలన అధికారి అయిన డిఆర్ఎం గుప్తా సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి స్టేషన్‌లోని పాత భవనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రయాణికుల భద్రతలను దృష్టిలో ఉంచుకొని స్టేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, సీనియర్ సబార్డినేట్లు తదితరులు పాల్గొన్నారు.

# గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు టిటిడి చైర్మన్ నాయుడుకు ఆహ్వానం



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఆలయ అర్చకులు ఆహ్వానించారు. బుధవారం ఉదయం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బిఆర్‌నాయుడును గోవిందరాజస్వామి ఆలయ ఇఒ విఆర్‌శాంతి, అర్చకులు ఆహ్వానపత్రిక అందజేశారు. అనంతరం వేదాశీర్వచనం చేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని అధికారులకు నాయడు సూచించారు.

# కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో ఆర్టీఎ డేటాబేస్ అనుసంధానం



అనుసంధానంపై జరిగిన భేటీలో పాల్గొన్న రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, టిజిఐసిసిసి డైరెక్టర్ కమలాసన్ రెడ్డి

**ఆర్టీఎ కమిషనర్‌తో టిజిఐసిసిసి డైరెక్టర్ భేటీ**

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** రోడ్డు రవాణా అథారిటీకి సంబంధించిన డేటాబేస్‌ను తెలంగాణ సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి)తో అ నుసంధానించనున్నారు. దీనికి సంబంధించి రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, టిజిఐసిసిసి డైరక్టర్ కమలాసన్ రెడ్డిల మధ్య బుధవారం నాడు బంజా రాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో ఓ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిజిఐసిసిసి అధికారులతో పాటు రవాణా శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు. వాహనదారులు తప్పిదాలకు పాల్పడినపుడు పోలీసులు చలాన్లు విధించే సమయంలో కాలుష్య నియంత్రణ సర్టిఫికేట్, బీమా, వాహనాల రిజిస్ట్రేషన్ వివరాలతో పాటు రవాణా శాఖలో వాహనాలకు సంబంధించి వుండే అన్ని వివరాలు దీనివల్ల తెలుసుకునే వీలుంటుందని ఈ సందర్భంగా టిజిఐసిసిసి డైరక్టర్ కమలాసన్ రెడ్డి తెలిపారు. ఈ వివరాలు అందుబాటులో వుండడం వల్ల ట్రాఫిక్ పోలీసుల విధుల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఆయన వెల్లడించారు. అ న్ని వాహనాలకు సంబంధించిన పూర్తి సమాచారం పోలీసుల వద్ద వుండే సింప్యూటర్స్‌లో వుంటే తప్పిదాలకు పాల్పడే వాహనదారులపై గతంలో వున్న చలాన్ల వివరాలు వెంటనే తెలుసుకునే వీలుంటుందని, వాహనాల పత్రాలలో ఏవైనా సవ్యంగా లేకుంటే వెంటనే తెలుసుకుని జరిమానా విధించే వీలుంటుందని ఆయన అన్నారు. రవాణా శాఖ వద్ద వున్న డేటాబేస్‌ను టిజిఐసిసిసితో అనుసంధానం చేయడానికి సంబంధించి ఒక ప్రత్యేక సాంకేతిక బృందాన్ని నియమిస్తున్నామని ర వాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఈ ఏర్పాట్లు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీంతో పాటు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం కింద వున్న పనుల గురించి కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఇందులో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రి కగ్నేషన్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు గురించి కూడా చర్చించారు. దీంతో పాటు టిజిఐసిసిసి వినియోగిస్తున్న సిసి కెమెరాల పనితీరును కూ డా ఈ సమావేశంలో పరిశీలించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ జాయింట్ కమిషనర్లు శివ లింగయ్య, చంద్ర శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# చత్తీస్‌గఢ్ సిఎస్, డిజిపి, ఐజిలపై ఎపి హైకోర్టులో న్యాయస్థాన ధిక్కారకేసు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** మావోయిస్టు పార్టీ నేతలు నంబాల కేశవరావు, సజ్జా నాగేశ్వరరావు మృతదేహాలను బంధువులకు అప్పగిస్తామని చత్తీస్‌గఢ్ ఎజి రాష్ట్ర హైకోర్టు బెంచ్ ఎదుట హామీ ఇచ్చి ఆ తర్వాత ఇవ్వడానికి నిరాకరించారని హైకోర్టులో కోర్టు ధిక్కార కేసు నమోదైంది. ఈ మేరకు కేశవరావు తల్లి భారతమ్మ, అన్నయ్య ఢిల్లీశ్వరరావు తరపున పౌరహక్కుల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. ఈపిటిషన్ గురువారం విచారణకు రానుంది. ప్రతివాదులుగా చత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమితాబ్ జైన్, ఆ రాష్ట్ర డిజిపి అరుణ దేవ్ గౌతమ్, బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్‌ను చేర్చారు.

# దక్షిణ కాలువలో చిరుత మృతదేహం

**కలువాయి (నెల్లూరు), మే 28, ప్రభాతవార్త :** కలువాయి దక్షణకాలువ నుండి ప్రవహాస్తున్న నీటిలో చింతలాత్మకూరు సమీపంలో చిరుతపులి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. చిరుత మృతదేహాన్ని గ్రామస్తులు వెలికి తీసి అటవి శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్టు బీటు ఆఫీసర్ జనార్దన్ పరిశీలించారు మండలంలోని చిరుతపులి మృతదేహం చూసిన గ్రామస్తులు భయాందోళనకు గురైయ్యారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**

NIWAS HOUSING FINANCE

(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంథేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంథేరీ (ఈస్ట్), ముంబై-400093

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద ప్రకటన**

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసిత గృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ / RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణ బకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణ బకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలముగా ఈ ప్రచురణ ద్వారా పిలుపు ఇమ్మనది ఏమనగా వారికి ఎదుటగా పేర్కొన్న రుణ బకాయి మొత్తాలను తదుపరి ఛార్జీలు మరియు తిరిగి చెల్లింపు వరకు అయిన వడ్డీతో సహా సదరు డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. విఫలమైతే NHFPL చట్టప్రకారం బకాయి మొత్తం రికవరికి ఆస్తుల స్వాధీనం, డిస్పోజ్/అమ్మకం అన్నీ లేదా ఏదైనా తదుపరి చర్యలకు ఉపక్రమించి చెల్లించవలసిన రుణ బకాయి మొత్తాన్ని రుణ ఒప్పందం యొక్క చట్ట నిబంధనల ప్రకారం తిరిగి వసూలుకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలు ఆస్తుల యొక్క ఓనర్‌షిప్‌పై థర్డ్ పార్టీ ఆసక్తి సృష్టించడం లేదా పరాధీనం చేయడం వంటి చర్యలు చేపట్టవద్దని హెచ్చరిస్తూ అదుపు చేయడమైనది.

| క్ర. సం. | స్థానం / రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు / సహ-రుణగ్రహీతలు / హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1 | నిజామాబాద్ LNNIZLAP-07230033903 | బతే రాజేశ్వర్ (రుణగ్రహీత) బతే సుమలత (సహ-రుణగ్రహీత) | 20-మే-2025 | రూ.639595/- (రూపాయలు ఆరు లక్షల ముప్పై తొమ్మిది వేల ఐదు వందల తొంభై ఐదు మాత్రమే) |
| | ఆస్తి యొక్క వివరణ : TS మరియు పిప్రి యొక్క పరిధి గ్రామ పంచాయతీలో నిజామాబాద్ జిల్లా, ఆర్మూర్ మండలం, పిప్రి గ్రామం వద్ద ఉన్న ఆస్తి RCC పైకప్పు బిల్ట్-అప్ ఏరియా (484.44) చ.అడుగులు మరియు మొత్తం స్థలం కొలత ఏరియా (89.59) చ.గజాలు లేదా (74.89) చ.మీటర్లు అసెస్‌మెంట్ నం. 1481, ప్రకారం GP నం.(10-52/1) కలిగి ఉన్న RCC పైకప్పు నివాసిత గృహం కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: పల్లాటి సాయన్న యొక్క ఇల్లు, పడమర: 20-0 వెడల్పు రోడ్, ఉత్తరం: గుర్రం నర్సయ్య యొక్క ఇల్లు, దక్షిణం: మెయిన్ రోడ్. | | | |

ప్రదేశం : నిజామాబాద్, తెలంగాణ
తేదీ : 29.05.2025

సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

వార్త

ఒక విషయాన్ని గురించి తెలిసినా, తెలియకపోయినా ఫ్రెంచి పౌరుడు ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాడు, ఆంగ్లేయుడు తనకు తెలియని విషయాన్ని గురించి మౌనం వహించడమే మంచిదని భావిస్తాడు.

- శామ్యూల్ జాన్సన్

# ఆత్మహత్యలే పరిష్కారమా!?


పరీక్షల్లో తప్పామని, అనుకున్న మార్కులు రాలేదని, సాటి వారికన్నా వెనుకపడ్డామని, అనుకున్న స్థాయిలో లక్ష్యాన్ని చేరుకోలేకపోయామని భావించిన వారంతా ఎంతో కొంత కుంగుబాటుకు గురయ్యామని భావించడం సహజం. అలా అని తనువుచాలిస్తే, వారు కన్నవాళ్లకు కడుపుకోతే మిగిలేది. ఆ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా ఈ కాలపు పిల్లల్లో కొంతమంది ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం దురదృష్టకరం. లక్ష్యాన్ని సాధించలేకపోవడం తప్పేమీ కాదు. అది మరో మంచి ప్రయత్నానికి శుభ ప్రారంభం అనుకోవాలి తప్ప, అదే తనజీవితానికి చివరిరోజుగా భావించి ఆవేశంలో ఆత్మహత్యలకు పూనుకోవడం అవివేకమే అవుతుంది. అంతేతప్ప ఏడుస్తూ కూర్చుంటేనో, ఉసురుతీసుకుంటేనో సమస్యకుపరిష్కారంకాదు. ఇలాంటి ఆలోచనలు ఓ నిండుప్రాణాన్ని కోల్పోతాం. తనపై ఆశలు పెట్టుకున్న అమ్మా నాన్నలకు కడుపుకోత మిగిల్చిన వైనం వ్యక్తిగత చరిత్రలో ఉండిపోతుంది. ఇప్పుడదే జరిగింది రాజస్థాన్‌లోని కోటలో జరిగిన ఆత్మహత్యలన్నీ ఈకోవకు చెందినవారని తేలింది. దీనికంతకూ కారణం విద్యాసంస్థ లేనని చెప్పలేం. కానీ జరిగింది విషాదమే. ఇలాంటివి విన్నప్పుడు అయ్యో! అనకుండా ఉండలేం. గతంలో నుండి తరచూ ఇలాంటి ఉదంతాలు వింటూనే ఉన్నాం. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఇద్దరు, రాజస్థాన్‌లోని కోటలో ఇద్దరు, తాజాగా కోటలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ హత్యల పరంపర ఉన్నత న్యాయ ధర్మాసనానికి ఆగ్రహం కూడా తెప్పించింది. దేశంలో విద్యార్థుల ఆత్మహత్యలు తీవ్ర ఆందోళన కలిగించే రీతిలోనే వున్నాయి. రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట అంటేనే దేశంలో అతి ప్రధానమైన కోచింగ్ రాజధానిగా ప్రసిద్ధికెక్కింది. అత్యంత ప్రతిష్ఠాకర ఐఐటీ, ఎయిమ్స్, ఇంజినీరింగ్, వైద్య ప్రవేశ కోర్సుల కోచింగ్‌కు పెట్టిందిపేరు. కోటలో 248 కోచింగ్ సెంటర్లు ఉంటాయి. రోజుకు 10గంటలకు పైగా వివిధ తరగతులుంటాయి. ఇలా ఒత్తిడి కలిగించి ఉండచ్చు. మే 23న కోటలోనే విద్యార్థులు ఎందుకు బలవన్మరణానికి పాల్పడుతున్నారో ప్రభుత్వం తెలుసుకోకపోవడం, పోలీసులు కనీసం ప్రాథమిక సమాచార నివేదికను కూడా నమోదు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. ఆ తర్వాత కూడా ఆత్మహత్యలు ఆగలేదు. 2023లో ఇదే కోట పట్టణంలో 23మంది కోచింగ్‌కి వచ్చిన విద్యార్థులు చనిపోయారు. అధికారిక సమాచారం తెలిసేవరకు మిలియన్ డాలర్ల ప్రశ్నే. కానీ భవిషత్తు కోసం ర్యాంకుల కోసం కోచింగ్‌కి వచ్చే విద్యార్థుల మనోభావాలు తెలుసుకుంటే తప్ప, ఏమీ చెప్పలేం. అయితే ఇక్కడ కోచింగ్ తీసుకునేవారికి అత్యధిక మార్కులు వస్తాయని నమ్మకం. అందుకే కోట అంటేనే అత్యున్నత కోచింగ్ కేంద్రాలుగా భాసిల్లుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం విద్యార్థులఆత్మహత్యలు 2022లో 13వేల కంటే ఎక్కువ నమోదయ్యాయి. పరిస్థితి చూస్తే ఆందోళన కలిగించే విషయమే. దేశంలో ప్రతిరోజూ సుమారు 35 మంది విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. అంటే ప్రతి 42 నిమిషాలకు ఒక ఆత్మహత్య నమోదవుతోంది. 2021లో 13,089 మంది విద్యార్థుల ఆత్మహత్యలు, 2022లో 13,044కి స్వల్పంగా తగ్గినప్పటికీ, మొత్తం ఆత్మహత్యల రేటు పెరిగినట్లులెక్క. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణాలను తరచి చూస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి అధిక అంచనాలు వారిలో అధిక ఒత్తిడికి గురిచేస్తాయి. పరీక్షలలో బాగారాణించాలనే ఒత్తిడికి దారి తీస్తాయి. ఉన్నతవిద్య అధికఖర్చు విద్యార్థుల ఆత్మహత్య లకు దారిచేస్తాయి. కుటుంబవిభేదాలు, సామాజికమద్దతు లేని సందర్భాలలో కుంగుబాటుకు లోనవుతారు. ఇలాంటివి మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లలో ఎక్కువ. ముఖ్యంగా రాజస్థాన్ కోటలో నీట్ పరీక్షల కోచింగ్‌కు వెళుతున్న విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నారు. తాజాగా కాశ్మీర్కు చెందిన ఓ అమ్మాయి బలవన్మరణం చెందింది. గతంలో ఐఐటి వల్ల వరుసగా ఆత్మహత్యలు కలవర పెట్టేవి. ఈసంవత్సరం కోటాలో జరిగిన 14 ఆత్మహత్య లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఈ విషయాన్ని తేలికగా తీసుకోకూడదని, తీవ్రంగా పరిగణించాలని కూడా చెప్పింది. వాటిని ఉపయోగించడం వల్ల ఫ్యాన్ నూసైడ్ మారణాలను అరికట్టవచ్చని తెలిపింది. కానీ ఈ విధానాన్ని అక్కడి వారు పాటించక పోవడం కూడా వారి మరణాలకు మరింత అవకాశాలు పెరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారా లేక మరేదైన కారణం ఉందా అన్నది అంతు చిక్కడం లేదు. ఇప్పటి విద్యార్థులకు పరీక్షలు వాటి ఫలితాలు జీవన్మరణ సమస్యలుగా మారాయి. నూటికి నూరుశాతం మార్కులు, అత్యుత్తమ ర్యాంకులు కొల బద్దలుగా నిలిచాయి. వెలుగు చూడనివి ఇంకొన్ని ఉండవచ్చు. పోటీ ప్రపంచంలో విద్యార్థుల చదువులు చూస్తే అది వారి పట్ల మరణశాసన మోతోంది. విద్యార్థులలో ఆత్మస్థైర్యం పెంచేలా బోధనలు సాగాలి. ర్యాంకులు రాకుంటే జీవితం లేదన్న భావన నుంచి బయటపడే యాలి. ఇలాంటి సందర్భాలలో విద్యార్థులకు నిరంతర మానసిక విద్యాబోధన కూడా అవసరం. తరచూ వారికి కౌన్సిలింగ్ ఇప్పించే విధానాన్ని ప్రభుత్వ పరంగా ప్రవేశపెట్టడం వలన సత్ఫలితాలు ఉంటాయి.

ప్రవర్తన చెట్టు వంటిది కాగా, ఖ్యాతి నీడ లాంటిది. నీడ మన ఊహ అయితే చెట్టు యదార్థమైనది.



అబ్రహాం లింకన్

పంచదార పేరు చెప్పినంత మాత్రాన నాలుకకు దాని రుచి తగలదు. కనుక దైవానుభవం లేకుండానే నానా ప్రసంగాలు చేయకూడదు.



తుకారాం

# 4వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

**ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల్లో 30.507 లక్షల కోట్ల డాలర్లతో అమెరికా ప్రథమ స్థానంలో ఉన్నది. 19.231 లక్షల కోట్ల డాలర్లతో 2వ స్థానంలో చైనా, 4.744 లక్షల కోట్ల డాలర్లతో జర్మనీ, 4.187 లక్షల కోట్ల డాలర్లతో 4వ స్థానంలో భారత్, 4.186 లక్షల కోట్ల డాలర్లతో 5వ స్థానంలో జపాన్, 3.839 లక్షల కోట్లతో యూకె 6వ స్థానం, 3.211 లక్షల కోట్ల డాలర్లతో 7వ స్థానంలో ఫ్రాన్స్, 2.422 లక్షల కోట్లతో 8వ స్థానంలో ఇటలీ, 2.225 లక్షల కోట్లతో 9వ స్థానంలో కెనడా, 2.125 లక్షల కోట్ల డాలర్లతో 10వ స్థానంలో బ్రెజిల్ దేశాలు నిలిచాయి. 2025లో ప్రపంచ అభివృద్ధి రేటు 2.8 శాతం ఉండగా, 2026లో 3 శాతానికి చేరవచ్చని తెలుస్తున్నది.**

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

ప్రపంచ దేశాల్లో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని నీతి ఆయోగ్ సిఇఒ బి వి ఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటించడం భారతీయులకు ఒక మహాద్భుత కానుకగా నిలుస్తున్నది. నిన్నటి వరకు మొదటి స్థానంలో అమెరికా, 2వ స్థానంలో చైనా, 3వ స్థానంలో జర్మనీ, 4వ స్థానంలో జపాన్, 5వ స్థానంలో భారత్ నిలిచాయని, నేడు 4వ స్థానంలో ఉన్న జపాన్‌ను వెనక్కి నెట్టి 4వ స్థానానికి భారత్ చేరడం జరిగిందని ఐఎంఎఫ్ వరల్డ్ ఎకనమిక్ అవుట్‌లుక్ నివేదిక ఆధారంగా నీతి ఆయోగ్ బాధ్యులు ప్రకటించడం హర్షదాయకం. రానున్న 2.5 నుంచి 3.0 యేండ్లల్లో, అనగా 2028 నాటికి, జర్మనీని కూడా వెనక్కి నెట్టి 5.5 లక్షల కోట్ల వ్యవస్థను నమోదు చేసుకొని 3వ స్థానానికి భారత్ ఎదగడం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. 2025లో జర్మనీ వృద్ధి రేటు జీరో ఉందని, 2026లో 0.9 శాతం మాత్రమే పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. 2025 ఏప్రిల్‌లో భారత జిడిపీ 4.19 లక్షల కోట్ల యూఎస్ డాలర్లకు చేరుతూ జపాన్‌ను దాటడం (4.187లక్షల కోట్ల యూఎస్ డాలర్లు) జరిగిందని ప్రకటించారు. భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత వేగంగా (6 శాతం అభివృద్ధి రేటుతో) పెరుగుదలను నమోదు చేస్తున్నట్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**భారత తలసరి వార్షిక ఆదాయం:**

ఐఎంఎఫ్ వివరాల ప్రకారం భారత తలసరి ఆదాయం 2013-14లో 1,438 యూఎస్ డాలర్లు ఉండగా 2025లో రెట్టింపు పెరిగి 2,880 డాలర్లకు చేరడం జరిగిందని స్పష్టం అవుతున్నది. ప్రైవేట్ వినియోగం, గ్రామీణాభివృద్ధి ఆధారంగా 2025-26లో భారత ఆర్థిక వ్యవస్థ 6.2శాతం వృద్ధి రేటును నమోదు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం పౌరుల తలసరి వార్షిక ఆదాయం 14,005 డాలర్లు ఉండాలని, భారత్‌లో కూడా తలసరి వార్షిక ఆదాయం ఆ స్థాయికి చేరి భారత్ కూడా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేరుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆయోగ్ వికసిత్ రాజ్య ఫర్ వికసిత్ భారత్ 2047 నివేదిక ఆధారంగా 2047 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ 30లక్షల కోట్ల డాలర్లకు చేరి వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను అధిగమిస్తుందని




వివరిస్తున్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను సుసాధ్యం మ్యాక్రోఎకనమిక్ గోల్స్, పౌరుల సాధికారత పెంచడం, సుస్థిర ఆర్థికాభివృద్ధికి చేయూత, టెక్నాలజీ ఇన్నొవేషన్ లీడర్‌షిప్, గ్లోబల్ లీడర్, విశ్వ బంధు, న్యాయ పరమైన భద్రత/పాలన అందించడం లాంటివి దోహదపడతాయని అంచనా వేస్తున్నారు. ప్రపంచ దేశాల ఆర్థికవ్యవస్థల్లో 30.507 లక్షల కోట్ల డాలర్లతో అమెరికా ప్రథమ స్థానంలో ఉన్నది. 19.231 లక్షల కోట్ల డాలర్లతో 2వ స్థానంలో చైనా, 4.744 లక్షల కోట్ల డాలర్లతో జర్మనీ, 4.187 లక్షల కోట్ల డాలర్లతో 4వ స్థానంలో భారత్, 4.186 లక్షల కోట్ల డాలర్లతో 5వ స్థానంలో జపాన్, 3.839 లక్షల కోట్లతో యూకె 6వ స్థానం, 3.211లక్షల కోట్ల డాలర్లతో 7వ స్థానంలో ఫ్రాన్స్, 2.422 లక్షల కోట్లతో 8వ స్థానంలో ఇటలీ, 2.225 లక్షల కోట్లతో 9వ స్థానంలో కెనడా, 2.125లక్షల కోట్ల డాలర్లతో 10వ స్థానంలో బ్రెజిల్ దేశాలు నిలిచాయి. 2025లో ప్రపంచ అభివృద్ధి రేటు 2.8శాతం ఉండగా, 2026లో 3 శాతానికి చేరవచ్చని తెలుస్తున్నది. ఇతరదేశాలతో పోల్చితే భారత ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పెరగడానికికారణాలుగా దేశీయ వినియోగం పెరగడం, ప్రభుత్వాల నిరంతర నిధులవిడుదల, సుస్థిరమైనవిదేశీ వాతావరణం, ద్రవ్యోల్బణం అదుపులో ఉండడం, ఉద్యోగకల్పనకు ప్రాధాన్యం ఇవ్వడం, పెట్టుబడులఆకర్షణ, పిఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్, ఉత్పత్తి ఆధార ప్రోత్సాహాలు ఇవ్వడం లాంటి అంశాలు ప్రధానంగా దోహదపడుతున్నాయి. 2047 నాటికి యువభారతం అభివృద్ధి చెందిన దేశంగా నిలవడానికి మనదైన ప్రత్యేక నైపుణ్యత కలిగినయువశక్తిని సక్రమంగా వినియోగించుకోవాలి. 2028 కన్న ముందుగానే భారత్ 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిలవాలని కోరుకుందాం, మనలో ప్రతి ఒక్కరం దానిని సుసాధ్యం చేయడానికి కృషి చేద్దాం. ●

# ఆకలి కేకలు పరిష్కరించలేమా ?

**డి జె మోహన రావు**

ఆకలి అనేది సమాజానికి పట్టిన ఒక శాపం. నాగరికత పురోగమిస్తున్నప్పటికీ ఆకలితో అలమటిస్తున్న వారి సంఖ్య తగ్గడం లేదు. ఇది కేవలం కడుపు నింపే సమస్య కాదు. శారీరక, మానసిక సామాజిక జీవనాన్ని అతలా కుతలం చేసే అగ్నికీల. ఇది మానవాళి పురోగతికి అడ్డం పట్టే చేదు నిజం. ప్రపంచంలో ఆహారం పుష్కలంగా ఉన్నప్పటికీ, అదిఅందరికి చేరడం లేదు. యుద్ధాలు వాతావరణ విపత్తులు, ఆర్థిక మాంద్యాలు, లోతుగా పాతుకుపోయిన అసమానతలు ఆ ప్రధాన కారణాలు. 2004 గ్లోబల్ రిపోర్ట్ ఆన్ ఫుడ్ క్రైసిస్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 78.3 కోట్ల మంది ఆకలితో పోరాడుతున్నారు. 2023లో 28.2 కోట్ల మంది తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ అంచనా ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 42శాతం మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇది మానవాళి సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. అపారమైన వ్యవసాయ సంపద ఉన్న మన భారతదేశంలో ఆకలి పోషకాహార లోపం తీవ్ర సమస్యలు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్, నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 5 గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. మన దేశంలో సుమారు 16శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదేళ్లలోపుపిల్లలలో 35.5శాతం మంది వయస్సుకి తగ్గ ఎత్తు లేరు. 19.3శాతం మంది ఎత్తుకి తగ్గ బరువు లేరు, మరియు 32.1శాతం మంది తక్కువ బరువుతో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్న మన దేశంలో ఈ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. మహిళల విషయానికొస్తే ప్రపంచవ్యాప్తంగా కోటి మందికి పైగా మహిళలు, కౌమార బాలికలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ సంఖ్యలో మనదేశం నుంచి గణనీయమైన వాటా ఉంది. ఐదేళ్లలోపు పిల్లలలో సంభ వించే మరణాలలో దాదాపు 45శాతం పోషకాహార లోపు వల్లనే సంభవిస్తున్నాయని అంచనా. ఆకలికి ఆజ్యం పోసే కారణాలు ఆకలి సమస్యకు మూలాలు బహుముఖంగా ఉన్నాయి. వాతావరణమార్పులు, అస్తవ్యస్థమైన వర్ష పాతం, కరువులు, వరదలు, వడగాల్పులు వంటి రూపాల్లో ఆహార ఉత్పత్తిని నిరంతరం బెదిరిస్తున్నాయి. అతివృష్టి, అనావృష్టి రెండూ పంటలను నాశనం చేస్తున్నాయి. దీనికి తోడు, ఆర్థిక అసమానతలు, ద్రవ్యోల్బణం వలనపండ్లు, కూరగాయలు, పాలఉత్పత్తులు, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాలు చాలా ఖరీదుగా మారి పేదలకు అందుబాటులో ఉండడం లేదు. ఈ ఆహార భద్రత లేమీ పేదరికాన్ని మరింత పెంచుతుం. పిల్లలను బడికి దూరం చేస్తుంది. పెద్దల పని సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. సామాజికంగా, పోషకాహార లోపంతో బాధపడే పిల్లలు చదువులో వెనుకబడి జీవితాంతం తక్కువ సంపాదనతో జీవిస్తారు.



పెద్దలు అలసటతో ఏకాగ్రత లోపంతో బాధపడతారు. ఆకలి సమాజాలను రాజకీయ అస్థిరతకు, ఘర్షణలకు మరింత గురి చేస్తుంది. కడుపు నిండా తినే హక్కు ప్రతి మనిషికి ఉంది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన. ఆహార ప్రాథమిక మానవ హక్కుగా గుర్తిస్తుంది. కేవలం కడుపు నింపడం కాదు, ఆ కడుపు నింపే వ్యవస్థలకు ప్రాణం పోయాల్సిన సమయమిది. వ్యవస్థాగత మార్పులు ఆకలీసమస్యలకు తట్టుకుని, మళ్ళీ నిలబడేశక్తిని, బలాన్నికలిగించే వ్యవస్థలను తయారు చేయాలి. స్థితిస్థాపక ఆహార సరఫరా గొలుసులను నిర్మించడం, స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించడం ఇవన్నీ ఇందులో భాగం. వాతావరణ మార్పుల సుడిగుండంలో చిక్కుకుపోయి, ప్రతిరోజు బతుకు కోసం పోరాడుతున్న చిన్న రైతులకు ముఖ్యంగా మహిళలకు అండగా నిలబడాలి. స్థానిక ఆహార వ్యవస్థలకు వారే వెన్నెముక. వారికి వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులు, అప్పులు, సాంకేతికత మార్కెట్ అనుసంధానం మరింత సురక్షితమైన, సమానమైన ఆహార పంపిణీకి బాటలు వేస్తుంది. మహిళారైతులకు వనరులకు సమానప్రాప్యత ఉన్నప్పుడు, వ్యవసాయ ఉత్పత్తి 30శాతం వరకు పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రభుత్వ పథకాలు సమర్థ వంతమైన అమలు కీలక పాత్ర పోషిస్తాయి. మన భారతదేశం ఈసమస్యకు స్పందించే తీరులో స్వల్పకాలిక ఉపశమనం, దీర్ఘకాలిక వ్యవస్థాగత మార్పు రెండూ ఉండాలి. పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్, మధ్యాహ్న భోజన పథకం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ వంటి పథకాలు కొంత వరకు ఫలితాలనిచ్చినా, వాటి అమలులో లోపాలు, లీకేజీలు ఇంకా అందరికి అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. పోషకాహార సున్నితమైన వ్యవసాయాన్ని ప్రోత్స హించడం, ఆహార వైవిధ్యాన్ని పెంచడం తక్షణ అవసరం. మూరుమూల గిరిజన ప్రాంతాలలో ఇనుము, ప్రొటీన్, సూక్ష్మపోషకాలు అధికంగా ఉండే ఆహారాలు లభించేలా చూసుకోవడం చాలా కీలకం. కేవలం ప్రభుత్వ విధానాలు మాత్రమే కాకుండా, ప్రైవేట్ రంగం కూడా ఆహార నష్టాన్ని వ్యర్థాలను తగ్గించడంలో, స్థానిక రైతులకు మద్దతు ఇవ్వడంలో పౌష్టికాహారాన్ని అందించే ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టడంలో భాగస్వామ్యం వహించాలి. కరువుని తట్టుకునే, తక్కువ నీటితో పండే పంటల విత్తనాలను రైతులకు అందివ్వాలి. తక్కువ వీటిని వాడే డ్రిప్ ఇరిగేషన్ వంటి నూతన వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టాలి. పంటలు నష్టపోయి నా వారికి కొంత డబ్బు వచ్చేలా ఇప్పటి కంటే ఇంకా ఎక్కువ బీమాపథకాలు ఏర్పాటు చేయాలి. పండిన పంటను సరైన ధరకి అమ్ముకోవడానికి మార్కెట్లకు అనుసంధానం కల్పించాలి. చివరిగా, మన దేశంలో చాలా ఆహారం పండుతున్నా అది పేదలందరికీ సరిగా చేరడం లేదు. మధ్యలో వృథా అవుతోంది. లేదా దళారుల చేతుల్లోకి వెళ్లుతోంది. ఆహారం అందరికీ చేరేలా ఒక బలమైన వ్యవస్థ నిర్మించాలి. ఆకలి లేని రేపటి కోసం మనవంతు కృషి పేదరికం ఆకలికి దారితీసి, అది తిరిగి పేదరికాన్ని పెంచే ఈ ఆకలి చక్రాన్ని బద్దలుకొట్టాలి. ఆకలిని కేవలం ఆహార సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక, పర్యావరణ న్యాయ సమస్యగా గుర్తించాల్సిన సమయం ఇది. మనం ప్రజలలో, ముఖ్యంగా అట్ట డుగు వర్గాల వారిలో పెట్టుబడి పెట్టాలి. ఇంకా ఉత్పావక మైనవి మాత్రమే కాకుండా, అందరినీ కలుపుకు పోయే, సమానమైన, స్థిరమైన ఆహార వ్యవస్థలను నిర్మించాలి. ఏ బిడ్డ ఆకలితో ఉండకూడదు. ఏ తల్లి బలహీనంతో బిడ్డను కనకుండా ఏ రైతు ఒంటరిగా పోరాడకుండా చూసేందుకు మనం కట్టుబడి ఉందాం. ఎక్కడ ఆకలి ఉన్నా, అది మానవాళికి ముప్పు అని గుర్తుంచుకుందాం. మనచుట్టూ ఉన్న ఆకలి కేకలను విందాం, మనవంతు సాయం చేద్దాం. రేపటి తరం ఆకలి లేని సమాజంలో జీవించేలా మనవంతు కృషి చేద్దాం! ఈ మహత్తర కార్యంలో మనమంతా భాగమవుదాం. ●

# ప్రజావాక్కు



## తారా స్థాయికి చేరుతున్న అవినీతి

తెలంగాణరాష్ట్రంలో అవినీతి తారాస్థాయికిచేరింది తమకు వచ్చే వేతనంతో సరిపెట్టుకోకుండా లక్షలు కోట్లకు పడగలెత్తి ధనవంతులు కావాలనే ఉద్దేశ్యంతో లంచాలకు మరుగుతున్నారు ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది తాజాగా ఒకేరోజు ముగ్గురు అధికారులు ఎసిబికి చిక్కడం అందర్నీ షాక్ గురి చేసింది సికింద్రాబాద్ జోనల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి కామారెడ్డిలో అసిస్టెంట్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెద్ద శంకరంపేట ఇంచార్జి ఎంపీడీవో ముగ్గురు ఏసీబీకి చిక్కడం ఏవిధంగా అవినీతి ఉందో తెలుస్తుంది ఇప్పటివరకు గత ఈ యేదాది లో సుమారు 1000మంది అధికారులు ఏసీబీకి చిక్కారు లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలలేని పరిస్థితి ఉంది ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పుడం రావడం లేదు ఏసీబీ అధికారులు మరిన్ని దాడులు చేసి లంచగొండి అధికార్ల భరతం పట్టాలి వారిని సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించాలి ప్రజలలో అవినీతి నిరోధక శాఖ చేస్తున్న కార్యక్రమాల మీద అవగాహన కల్పించాలి ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్స్ గ్రామాల వారిగా గోడల మీద రాయించాలి

- కామిడి సతీష్ రెడ్డి జడలపేట

## తీర్థయాత్రల్లో జాగ్రత్తలు

మనదేశంలో నదులు, చెరువులు, జలపాతాలు, సముద్రాల వద్ద అనేక మంది నీట మునిగి మరణిస్తున్నారు. ఇందులో పిన్నలు, పెద్దలు, వృద్ధులు అందరూ ఉంటున్నారు. తగు జాగ్రత్తలు పాటించకపోవటం వల్ల ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇవి నివారించతగిన మరణాలు. ఈత రాకుండా లోతైననీటిలోకి దిగటం అతి ప్రమాదకరం. అన్నీ తెలిసి కూడా కొందరు నీటిలోకి దిగి సాహసాలకు ఒడిగడుతుంటారు. సరదాకోసం చేసేపని వారి తల్లిదండ్రులకు, బంధు మిత్రులకు క్షోభను మిగులు స్తున్నాయి. ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనల పట్ల ప్రజలలో అవగాహన తేవాలి. నీరుఉండే అన్ని పర్యాటకప్రదేశాలు, పుణ్యతీర్థాలవద్ద నిరంతరం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మైకులు, హెచ్చరికలు తెలిపే ఆటోమేటిక్ ప్రకటనల వ్యవస్థను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. -కప్పగంతు వెంకట రమణమూర్తి

## ఉపాధ్యాయ బదిలీల్లో సమస్యలను పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో తీసుకున్న నిర్ణయాల వలన కొంత మంది ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. కావున వాటిని సరిచేసి అమలు చేయాలలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రస్తుత స్టేషన్లో పనిచేసిన కాలానికి 5 లేదా 8 సంవత్సరాల గరిష్ట పరిమితి ప్రభుత్వం విధించింది. గరిష్ట పరిమితి లేకుండా పనిచేసిన పూర్తి కాలానికి స్టేషన్ పాయింట్లు కేటాయించాలని ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒక డిఎస్సి ద్వారా ఎస్జిటి తత్సమాన పోస్టుకు ఎంపికై తరువాత మరో డిఎస్సి ద్వారా స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన ఉపాధ్యాయులకు ఎస్జీటీ తత్సమాన సర్వీసును సర్వీసు పాయింట్లకు లెక్కించడం లేదు. అటువంటి ఉపాధ్యాయులకు ఎస్జీటీసర్వీసుకు కూడా పాయింట్లు కేటాయించాలి. 8సంవత్సరాలు పూర్తి కాకపోయినా 8 అకడమిక్ సంవత్సరాల పూర్తి పేరుతో తప్పనిసరి బదిలీ చేస్తున్నందున వారికి 8 సంవత్సరాల పూర్తి స్టేషన్ పాయింట్లు కేటాయించాలి.

-వాసిలి సురేష్ నెల్లూరు జిల్లా

## కరోనాపై అసత్యపు ప్రచారాలు

ఈ మధ్యకాలంలో కొంత మంది సోషల్ మీడియా వేదికగా కరోనా వైరస్ గురించి తప్పుదారి పట్టించే అసత్యపు ప్రచారాలు జరుపుతుండటం గమనార్హం. కరోనా మళ్లీ వచ్చేస్తోంది, పాత లాక్‌డౌన్ రోజులు తిరిగివస్తాయి అంటూ భయాందోళనలు కలిగించే రీతిలో వార్తలు వ్యాపిస్తున్నాయి. జేఎన్1 వంటివారి వేరియంట్ల పేరుతో ప్రజల్లో గందరగోళం సృష్టించే విధంగా ప్రచారం చేయడం అత్యంత బాధాకరం. కరోనావ్యాప్తి పూర్తిగా తగ్గిన ఈ సమయంలో ఇటువంటి ప్రచారాలు సమాజానికి మానసిక ఒత్తిడి మాత్రమే కలిగిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం కొత్త వేరియంట్లు ఉండవచ్చునుగానీ, అవి తీవ్రంగా ప్రభావితం చేయవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ, మెడికల్ మాఫియా, వ్యాపార ప్రయోజనాల కోసం కొందరు అపోహలు సృష్టిస్తున్నారు. ప్రజలు అధికారిక వేదికల నుండి వచ్చిన సమాచారం మాత్రమే నమ్మాలి. ఆరోగ్య శాఖ, డబ్ల్యూహెచ్‌ఓ వంటి సంస్థల మార్గదర్శకాలను అనుసరించడం మంచిది. అటువంటి అసత్యపు ప్రచారాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. అసత్యపు ప్రచారాలను అడ్డుకునేందుకు మీడియా, స్వచ్ఛంద సంస్థలు, తమ పాత్రను బాధ్యతాయుతంగా నిర్వహించాలి.

-సి. హెచ్. ప్రతాప్.

మనవి **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దివ్యాంగుల 'స్థానిక' సంక్షేమం అవసరం!

**తరిగోపుల నారాయణస్వామి**

భారత రాజ్యాంగం అందరికీ సమానత్వ హక్కును కల్పించినప్పటికీ, దివ్యాంగుల పట్ల సమాజం ఇంకా సంపూర్ణంగా ఆ మార్గంలో ప్రయాణించలేక పోతోంది. చట్టాలు ఉన్నప్పటికీ అవి ఆచరణలోకి రావడం చాలా ఆలస్యం అవుతోంది. కేంద్ర ప్రభుత్వం 2016లో దివ్యాంగుల హక్కుల చట్టం (The Rights of Persons with Disabilities Act, 2016)ను ప్రవేశపెట్టి, దివ్యాంగుల సమస్యలను చట్టపరంగా గుర్తించి, వారికి జీవితమంతా అవసరమైన భద్రత, హక్కులు కల్పించాలని సంకల్పించింది. ఈ చట్టం ప్రకారం దివ్యాంగుల శ్రేణులు 7 నుండి 21కి పెంచబడ్డాయి. శారీరక, మానసిక, వాక్య, ఆడిటరీ, విజువల్, బౌద్ధిక పరిమితులన్నీ ఇందులో కవర్ చేస్తూ సమగ్రతకు ప్రాధాన్యంఇచ్చారు. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో 4 రిజర్వేషన్, విద్యాసంస్థలలో 5 రిజర్వేషన్ కల్పించబడింది. కానీ ఈ రిజర్వేషన్లు అన్ని రాష్ట్రాల్లో సమంగా అమలవుతున్నాయా అన్నది అనుమానాస్పదం. విద్యారంగంలో దివ్యాంగుల ప్రవేశానికి ప్రత్యేక నిబంధనలు ఉన్నా, కొన్ని విశ్వవిద్యాలయాలు ఇంకా ఈ హక్కుల అమలులో వెనుకబడ్డాయి. ప్రత్యేక హాజరు మినహాయింపులు, స్కాలర్‌షిప్‌లు, సహాయక ఉపకరణాల కొరత స్పష్టంగా కనిపిస్తుంది. ఉపాధ్యాయుల నియామకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ ఉన్నా, జాబితాలో పేర్లు ఉంటూ కూడా నియామకాలు జరగకపోవడం, "ఫిట్‌నెస్" అనే పేరుతో నిరాకరణలు జరగడం ఒకప్రధాన సమస్యగాఉంది. ఉద్యోగ నియామకాల విషయంలో, కొన్ని రాష్ట్రాల్లో దివ్యాంగుల కోటా ఖచ్చితంగా పాటించబడుతున్నా, మరికొన్ని రాష్ట్రాల్లో సమాచారం లోపం, అభ్యర్థుల శిక్షణలో వ్యత్యాసం, వ్యవస్థా లోపాలు వల్ల వారిని విస్మరిస్తున్నారు. బదిలీల విషయంలో, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలు దివ్యాంగులకు స్థానికంగా ఉద్యోగం కొనసాగించే అవకాశాలు కల్పిస్తున్నా, ఆంధ్రప్రదేశ్ అలాగే ఉత్తరాది రాష్ట్రాల్లో ఇంకా నిబంధనల పటిష్టత కనిపించదు. దివ్యాంగులకు ఉద్యోగంలో బదిలీ సమయంలో కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య అంశాలను పరిగణనలోకి తీసుకోవడం చట్టబద్ధమైనఅవసరం. కానీ ప్రస్తుతానికి ఇది అధికారులు ఇష్టానుసారంగా నిర్ణయించు



కుంటున్నారు. ఆరోగ్యరంగంలో దివ్యాంగుల అవసరాలను తీర్చేందుకు ప్రత్యేక కేంద్రాలు అవసరం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అవగాహన లోపించడం వల్ల వారు అనారోగ్యంతో నిర్లక్ష్యగా జీవిస్తున్నారు. ఆస్తులరక్షణ విషయంలో దివ్యాంగుల పట్ల అసహనం, దుర్వినియోగం కనిపిస్తోంది. కొందరు వారిని మానసికంగా బలహీనులుగా అర్థం చేసుకుని వారిపై అక్రమ ఆస్తి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దివ్యాంగులపై శారీరక, మానసిక దాడులపై చట్టం కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నా, పోలీస్ వ్యవస్థ స్పందన శీఘ్రంగా ఉండడం లేదు. విచారణలో నిర్లక్ష్యం ప్రధాన సమస్యలు. ఉపాధి అవకాశాల విషయానికి వస్తే, దివ్యాంగులకు ప్రత్యేకంగా వృత్తిపరమైన శిక్షణ కేంద్రాలు, సబ్సిడీలతో ఉపకరణాలు అందించాల్సిన అవసరం ఉంది. కానీ చాలా చోట్ల అవి హక్కులుగా కాక, దాతృత్వంగా చూపబడుతున్నాయి. పాఠశాలలు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు భౌతికంగా ప్రాప్తించదగినవిగా ఉండాలన్నది చట్టం స్పష్టంగా చెబుతోంది. కానీ అందులో చాలాచోట్ల ర్యాంప్‌లు, లిఫ్ట్‌లు, ప్రత్యేక టాయిలెట్లు లేవు. కేంద్రం రూపొందించిన నేషనల్ పాలసీ ఫర్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ దేశవ్యాప్తంగా సమానంగా అమలుకావాలంటే, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కానీ కొన్ని రాష్ట్రాలు ఇంకా నిబంధనల రూపకల్పన దశలోనే ఉన్నాయన్నది నిజం. అనేక మార్గాలలో చట్టాల అమలు విఫలమవుతున్నప్పటికీ, కొన్ని రాష్ట్రాలు మంచి మోడల్‌గా నిలుస్తున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు దివ్యాంగుల సంక్షేమంలో ముందున్నాయని చెప్పొచ్చు. చట్టం అమలు కంటే మించినది సమాజంలో మార్పు. సామాజిక అవగాహన పెరగాలి. కుటుంబ సభ్యులు, ఉద్యోగులు, ప్రజలు దివ్యాంగులను ఒక పౌరునిగా గౌరవించే దిశగా దృష్టి మార్చాలి. పత్రికలు, మీడియాలో దివ్యాంగుల సమస్యలను కవర్ చేయడం, పరిష్కార మార్గాలను చర్చించడం వల్ల ప్రభుత్వాలపై ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది ప్రజా అవగాహన పెంచడానికి ఉపయోగపడుతుంది. "దివ్యాంగుల కోసం కాదు-దివ్యాంగులతో పాటు" అనే దృక్పథం మన చట్టాలలో, విధానాలలో, వ్యవహారాలలో నిబద్ధంగా ఉంటేనే ఈ దేశం నిజంగా సమానతకు నిలు వెత్తు ఒక మంచి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. ●

# ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం



## గవర్నర్‌కు వినతిపత్రం

## మణిపూర్‌లో కొత్త రాజకీయం

**ఇంఫాల్, మే 28:** మణిపూర్‌లో తీవ్రతరం అవుతున్న ఆర్థిక, రాజకీయసంక్షోభం రోజుకో కొత్తమలుపు తిరుగుతోంది. మణిపూర్ ప్రభుత్వం పేరును చెరిపివేసిన భద్రతా బలగాల చర్యలతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసారు. మరోపక్క మణిపూర్ సిఎం బీరేన్‌సింగ్ రాజీనామాతో ప్రస్తుతం రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. ఇపుడు ఒక్కసారిగా రాజకీయాలు మారిపోయాయి. 44 మంది ఎమ్మెల్యేలు మణిపూర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని రాష్ట్రగవర్నర్ అజయ్‌కుమార్ భల్లాను కలిసి వినతిపత్రం ఇచ్చారు. బిజెపిఎమ్మెల్యే థోక్‌చోమ్ రాధేశ్యాంసింగ్ తాము ప్రభుత్వం ఏర్పాటుచేస్తామని గవర్నర్‌ను కలిసి తెలిపారు. బిజెపినుంచి ఎనిమిదిమంది ఎమ్మెల్యేలు, మేఘాలయ సిఎం కోన్రాడ్ సంగ్మా ఎన్‌పిపినుంచి ఒకరు, మరొకరు స్వతంత్ర ఎమ్మెల్యేకూడా ఉన్నారు సపమ్ నిషికాంతసింగ్ స్వతంత్ర ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పాపులర్‌ప్రభుత్వం ఏర్పాటుకోసం గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. మణిపూర్ శ్రేయస్సుకోసమే ఎమ్మెల్యేంతా కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం అవుతున్నారని చెప్పారు. 22 మంది ఎమ్మెల్యేలు సంతకాలున్న పత్రాన్ని గవర్నర్‌కుఇచ్చామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీకి సైతం ఇదే పత్రం ఇచ్చామన్నారు. ఇక్కడ అందరూ లేకపోయినా అందరూ మాతోనే ఉన్నారని అందరూ తమకు మద్దతు తెలుపుతారని వీరంతా కూడా పాపులర్ ప్రభుత్వం ఏర్పాటుకావాలని, మణిపూర్‌ప్రజల శ్రేయస్సుకోసం ఈ ప్రభుత్వం ఏర్పాటుకావాలని కోరుతున్నారని స్వతంత్ర ఎమ్మెల్యే చెప్పారు. 60 మంది సభ్యులున్న అరుణాచల్ అసెంబ్లీలో 44 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బిజెపి సిఎం ఎన్ బీరేన్‌సింగ్ గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసిన తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సింగ్ గవర్నర్ భల్లాను కలిసి రాష్ట్రంలో కొనసాగుతున్న అశాంతిపై చర్చలుజరిపారు. రెండురోజుల ముందు మైయిటీ గ్రూప్ కోఆర్డినేటింగ్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ కోకోమి గవర్నర్‌ను బాయ్‌కాట్‌చేయాలని పిలుపునిచ్చింది. ఈ పిలుపును అనుసరించి ప్రజలు ర్యాలీలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. అలాగే కొన్ని చోట్ల బైఠాయింపు జరిపి నిరసనలు తెలిపారు. ప్రభుత్వరంగంలోని బస్సులపైపేర్లను తొలగించాలని చెప్పడంపై వీరంతా భగ్గుమంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఈసంఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది. కోకోమి ఈ సంఘటన వెనుక ఉన్నట్లు గుర్తించారు. గవర్నర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని, ప్రధాన కార్యదర్శి పికెసింగ్, భద్రతా సలహాదారు కుల్‌దీప్ సింగ్, డిజిపి రాజీవ్‌సింగ్ ఈ సంఘటనలకు బాధ్యత వహించి రాజీనామాచేయాలని కోరారు. గడచిన ఫిబ్రవరి 13నుంచి రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 2023 మే 3వ తేదీనుంచి ఉధృతంగా జరుగుతున్ననిరసనలు 250 మందివరకూ చనిపోగా 60వేలమందికిపైగా నిరాశ్రయులయ్యారు.



## 51వ రాష్ట్రంగా చేరితే

# కెనడాకు గోల్డెన్‌డోమ్ ఫ్రీ!

## ట్రంప్ భారీ ఆఫర్

**వాషింగ్టన్, మే 28:** భూమి, అంతరిక్షం నుంచి అమెరికా గగతలంపై నిఘా ఉంటేందుకు అత్యంత ఆధునిక రక్షణ కవచం గోల్డెన్ డోమ్‌ను రెడీ చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఈ ప్రాజెక్ట్‌లో చేరేందుకు కెనడా కూడా ఆసక్తి కనబర్చింది. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, 51వ రాష్ట్రంగా చేరితే, గోల్డెన్ డోమ్‌ను ఉచితంగా పొందొచ్చని పేర్కొన్నారు. లేదంటే 61 బిలియన్ డాలర్లు ఖర్చు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని తన సొంత సోషల్‌మీడియా ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు.

మా అద్భుతమైన గోల్డెన్‌డోమ్ వ్యవస్థలో భాగం కావాలంటే కెనడాకు 61 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుందని చెప్పా. కానీ, అమెరికాకు 51వ రాష్ట్రంగా మారితే దీనికి జీరో డాలర్లు ఖర్చువుతాయి. వారు ఈ ఆఫర్‌ను పరిశీలుస్తున్నారని ట్రంప్ పోస్ట్ చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా నుంచి ఎటువంటి స్పందన రాలేదు. గోల్డెన్ డోమ్‌కు 175 బిలియన్ డాలర్లు ఖర్చు అవుతుంది. గోల్డెన్ డోమ్ వ్యవస్థ భూమి, అంతరిక్షం నుంచి అమెరికా గగనతలంపై నిఘా ఉంచుతుంది. తమ దేశం వైపు వచ్చే క్షిపణులు, ఇతర ముప్పులను ముందుగానే గుర్తిస్తుంది. చాలావరకు అవి టేకాఫ్ అవ్వక ముందే లేదా మార్గమధ్యలోనే వాటిని ధ్వంసం చేసే సత్తా గోల్డెన్ డోమ్ వ్యవస్థకు ఉంటుంది. ఈ వ్యవస్థలో అంతరిక్షం నుంచి ప్రయోగించే ఇంటర్ సెప్టర్ల నెట్‌వర్క్ అత్యంత కీలకం. వీటిల్లో లేజర్ ఆయుధాలు కూడా ఉండే అవకాశాలు ఉన్నాయి.

ఇదొక రకంగా రోనాల్డ్ రీగన్ ప్రతిపాదించిన స్టార్ వార్స్ వ్యవస్థ లాంటిదే. యూఎస్ విశాలమైన దేశం కాబట్టి అన్ని నగరాలు గోల్డెన్ డోమ్ కింద కవర్ అవ్వాలంటే అంతరిక్షంలో ఇంటర్‌సెప్టర్లతో ఓనెట్‌వర్క్‌నే సృష్టించాల్సి ఉంటుందని బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫారెన్ పాలసీ ప్రోగ్రామ్ పరిశోధన విభాగం డైరెక్టర్ మిషెల్ ఓ హన్‌లోన్ వెల్లడించారు. లేజర్లను అంతరిక్షంలోకి పంపడం అంత తేలికైన విషయం కాదన్నారు. అందుకోసం భారీగా ఇంధనం, అద్దాలు, ఇతర సామగ్రిని భారీ మొత్తంలో అంతరిక్షంలోకి పంపాల్సి ఉంటుందన్నారు.

కాగా, గోల్డెన్ డోమ్‌ను చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా నుంచివచ్చే ముప్పులను ఎదుర్కోవడం కోసమే రెడీ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను చైనా, రష్యా తీవ్రంగా వ్యతిరేస్తున్నాయి. ఇవి తీవ్రస్థాయిలో అస్థిరతలను సృష్టిస్తాయని, అంతరిక్షాన్ని యుద్ధ క్షేత్రంగా మార్చేస్తుందని ఆయా దేశాలు మండిపడుతున్నాయి.

# హార్వర్డ్ వర్సిటీకి ట్రంప్ మరోషాక్

## 100 మిలియన్ డాలర్ల కాంట్రాక్టు రద్దు

**వాషింగ్టన్, మే 28:** హార్వర్డ్ యూనివర్సిటీకి డోనాల్డ్ ట్రంప్‌నేతృత్వంలో అమెరికా ప్రభుత్వం వరుస షాక్‌లు ఇస్తోంది. ఇప్పటికే వర్సిటీపై పలు ఆంక్షలు విధించిన ట్రంప్ సర్కారు తాజాగా సంచలన నిర్ణయం తీసుకుంది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో కుదుర్చుకున్న 100 మిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్ట్‌లను రద్దు చేసుకోవాలని ట్రంప్ యంత్రాంగం ఆదేశించినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. కాంట్రాక్ట్‌లను సమీక్షించి ప్రత్యామ్నాయ సంస్థలను ఎంపిక చేయాలని సాధారణ పరిపాలన శాఖ ఒక ముసాయిదా లేఖను పంపిందని చెప్పారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో తొమ్మిది ఏజెన్సీలు 30 కాంట్రాక్ట్‌లు కుదుర్చుకున్నట్లు మరో అధికారి తెలిపారు. అందులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్‌కు చెందిన అధికారులకు ఎగ్జిక్యూటీవ్ శిక్షణ కాంట్రాక్ట్ కూడా ఉందని చెప్పారు. కాంట్రాక్ట్‌ల విలువ 100 మిలియన్ డాలర్లు వరకు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ట్రంప్ సర్కార్ హార్వర్డ్, కొలంబియా, బ్రౌన్ సహా తొమ్మిది ప్రముఖ విశ్వవిద్యాలయాలకు 2.6 బిలియన్ డాలర్ల ఫెడరల్ గ్రాంట్లను రద్దు చేసింది.

# మోడీకి చెంచాగిరీ చేస్తున్న శశిథరూర్



## కాంగ్రెస్‌నేత ఉదిత్‌రాజ్ ధ్వజం

**న్యూఢిల్లీ, మే 28:** కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ఇప్పుడు సొంత పార్టీ నేతల నుంచే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అఖిలపక్ష బృందానికి సారథి హోదాలో ఆయన ప్రస్తుతం విదేశాల్లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా తాజాగా పనామా సిటీలో థరూర్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ ఖండించారు. 26 మంది భారతీయ మహిళల సిందూరాన్ని పాక్ ఉగ్రవాదులు చెరిపేశారు. అందుకే భారత ప్రధాని మోడీ ఆపరేషన్ సిందూర్ చేపట్టారు. చెరిగిపోయిన భారతీయ మహిళల సిందూరపు రంగును హంతకులు, ఉగ్రవాదులు, కుట్రదారుల రక్తపు రంగుతో సమం చేసేందుకే ఆ ఆపరేషన్‌ను నిర్వహించారని పనామా సిటీలో శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఉదిత్ రాజ్ తప్పుపట్టారు. శశి థరూర్ బిజెపికి సూపర్ స్పోక్స్‌పర్సన్‌గా మారిపోయారని కాంగ్రెస్‌నేత ఉదిత్‌రాజ్ ధ్వజమెత్తారు. మోడీజీకి చంచాగిరి చేసే విషయంలో బిజెపి నాయకులను శశిథరూర్ మించిపోయారని విమర్శించారు. మిలిటరీ ఆపరేషన్లు, సర్జికల్ స్ట్రైక్‌లు చేసినప్పుడు గత కేంద్ర ప్రభుత్వాలు ఏంచేసేవో థరూర్‌కు తెలుసా, ఇప్పటి మోడీ ప్రభుత్వమైతే ఆర్మీ ఏం చేసినా తానే క్రెడిట్ తీసుకుంటోంది. దానిపై పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటోంది. బిజెపి చేస్తున్న ఈ ప్రచార విన్యాసాలకు శశిథరూర్ ప్రతినిధిగా మారిపోయారని ఉదిత్ రాజ్ అన్నారు.. ఉదిత్ రాజ్ ఒక మాజీ ఎంపీ. ఆయన గతంలో బిజెపిలోనే ఉండేవారు. మన దేశం దాదాపు గత నాలుగు దశాబ్దాలుగా ఉగ్రదాడులనుఎదుర్కొంటోంది. వాటివల్ల మనం ఎంతో బాధపడ్డాం.

ఎన్నో నష్టాలకు గురయ్యాం. వీటి గురించి అన్ని దేశాలకు చెప్పుకుంటే పెద్దగా ప్రయోజనమేం ఉండదు. భారత్‌లో ఉగ్రదాడులు చేయించేందుకు కుట్రపన్నుతున్న వాళ్లపై ప్రత్యక్ష ఒత్తిడిని పెంచాలి. ఇప్పటి వరకు జరిగిన ఉగ్రదాడుల్లో భాగస్తులైన తీవ్రవాదులను గుర్తించి శిక్ష పడేలా చేయాలని కామెంట్స్ చేశారు. భారత్‌లో ఉగ్రదాడికి పాల్పడితే వెంటనే తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని పాకిస్థాన్ ఉగ్రవాదులు గ్రహించారు.

## వర్షాకాల సమావేశాల్లోనే జస్టిస్ వర్మపై

# అభిశంసన తీర్మానం!



**న్యూఢిల్లీ, మే 28:**జడ్జి ఇంటిఆవరణలో నోట్లకట్టల కేసుకు సంబంధించి ప్రధాన బాధ్యుడిగా ముగ్గురుసభ్యుల కమిటీ నిర్ధారించిన జస్టిస్ యశ్వంత్‌వర్మపై ఎన్డీయే సర్కారు అభిశంసన తీర్మానానికి ప్రతిపాదనలు సిద్ధంచేస్తోంది. రానున్న వర్షాకాల సమావేశాల్లోనే ఈ అభిశంసనను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. తన అధికార నివాసంలో నోట్లకట్టలు లభించాయన్న తీవ్రస్థాయి ఆరోపణలు రావడంతో ఆయనపై విచారణజరిగిన సంగతి తెలిసిందే. అలహాబాద్ హైకోర్టుకు ఆయన్ను తిరిగి పంపించడం, ఆయనకు ఎలాంటి కీలక బాధ్యతలు అప్పగించకపోవడంవంటి సంఘటనలు జరిగాయి. అంతేకాకుండా ఆయనపై విచారణకు నియమించిన ముగ్గురుసభ్యుల కమిటీ, సుప్రీంకోర్టు అప్పటి సిజెఐ సంజీవ్‌ఖన్నా సిఫారసులు కూడా కేంద్ర న్యాయశాఖకు వెళ్లాయి. అలాగే జస్టిస్ వర్మ స్పందించకపోవడాన్ని కూడా త్రీమెన్ కమిటీ పరిగణనలోనికి తీసుకుంది. వీటన్నింటిన నేపథ్యంలో ప్రభుత్వం పదవీచ్యుతికి అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెడుతోంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్‌షాలు ఇటీవలే రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం అయ్యారు. దీనితో జడ్జిపై అభిశంసన తీర్మానం ప్రతిపాదిస్తున్నారన్న వార్తలు గుప్పుమన్నాయి. జస్టిస్‌వర్మకు ముగ్గురు సభ్యుల కమిటీ క్లీన్‌చిట్ ఇవ్వలేదు. ఫోటోలు, కాలిన నోట్లు ఉన్న విడియోలు జడ్జి నివాసం నుంచే స్వాధీనం చేసుకున్నారు. జస్టిస్ వర్మ రాజీనామాచేయకపోవడం, ఎఫ్ఐఆర్ ఇప్పటికీ నమోదుకాకపోవడం వంటి అంశాలు జస్టిస్ వర్మపై అభిశంసనకు మార్గం వేసాయి.

# ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ రాజ్యసభకు




## అధికారిక ప్రకటన చేసిన డిఎంకె పార్టీ!

**చెన్నై, మే 28:** మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్‌హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డిఎంకెతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. ఈ విషయాన్ని డిఎంకె-ఎంఎన్ఎం ఖరారు చేశాయి. ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడులో ఆరు, అస్సాంలో రెండు సీట్లు వీటిల్లో ఉన్నాయి. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్, ఎం.షణ్ముగం, ఎన్ చంద్ర శేఖరన్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, పి.విల్సన్, వైగో ఎగువసభ పదవీకాలం జులై 25తోముగుస్తుంది. ప్రస్తుతం ఆరాష్ట్ర అసెంబ్లీలో డిఎంకెకు 134 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దాంతో నాలుగు స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంటుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే విపక్ష ఇండియా కూటమిలో ఎంఎన్ఎం భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డిఎంకె, కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలు, పుదుచ్చేరిలోని ఒకస్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువసభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డిఎంకె నేతృత్వంలోని కూటమి అంగీకరించింది. ఆయన 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. అవినీతి వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, గ్రామాల సాధికారత కోసం దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్నాడిఎంకెకు ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఒక్క రాజ్యసభ ఎంపి గెలుస్తుంది. ఒకవేళ మరో అభ్యర్థిని కూడా గెలిపించుకోవాలని భావిస్తే అది బిజెపి, పిఎంకె ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. బిజెపి ప్రస్తుతం అన్నాడిఎంకె పక్షానే ఉంది.

## సౌదీ పర్యటనలో గులాం నబీకి అస్వస్థత!



**రియాద్(సౌదీ)మే 28:** ఉగ్రవాదానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న పాకిస్థాన్ తీరును అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకుగాను ఎంపిల బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ కమిటీల్లో ఒకకమిటీ సౌదీ అరేబియాలో పర్యటిస్తోంది. ఎంపిల బృందంలో సీనియర్‌నేత గులాం నబీ ఆజాద్ అస్వస్థతకు గురయ్యారు. దీనితో ఆయనను రియాజ్‌లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఎంపి ఆజాద్‌కు అస్వస్థతపై కమిటీ సభ్యుడు పాండా మాట్లాడుతూ ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. ఆయన వైద్యులపర్యవేక్షణలో ఉన్నారని వివరించారు. మరికొన్ని పరీక్షలు చేయాల్సి ఉందని వైద్యులుచెప్పారని బైజయంత్ పాండా తెలిపారు. బహ్రెయిన్, కువైట్ పర్యటనల్లో ఆయన ఎంతో కృషిచేసారని పాండా చెప్పారు. అయితే సౌదీ అలాగే అల్జీరియాల్లో నిర్వహించే సమావేశాలకు ఆజాద్ హాజరు కాలేరని ఎంపిపాండా వివరించారు. కాగా తన పర్యటనల్లో పాకిస్థాన్‌పై గులాంనబీ ఆజాద్ ఘాటైన విమర్శలుచేసారు. ప్రపంచ వ్యాప్తంగా నివసిస్తున్న ఉగ్రవాదులకంటే పాకిస్తాన్‌లో అత్యధికంగా ఉగ్రవాదులున్నారన్నారు. భారత్‌లో ఉద్రిక్తతలు, అశాంతిని రేకెత్తించేందుకు పాకిస్తాన్ ప్రయత్నాలుచేస్తోందన్నారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ తప్పుడు సమాచారంవ్యాప్తిచేస్తోందని మండిపడ్డారు. ఇదే ఆదేశం అసలు వైఖరి అన్నారు. తమ పర్యటనలవల్ల పాక్‌ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రపంచదేశాలకు అర్థం అయిందని ఆజాద్ అన్నారు.



## త్రైపాక్షిక చర్చలైనాసరే

# మేం సిద్ధమే

## ట్రంప్‌తోపాటు పుతిన్‌తో కూడా చర్చలకు జెలెన్‌స్కీ రెడీ

**కీవ్, మే 28:** రష్యా ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పుతిన్‌సేనలు మాత్రం ఉక్రెయిన్‌పై విరుచుకుపడుతున్నాయి. ఈదశలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తాజా ప్రతిపాదనలు చేసారు. ద్వైపాక్షిక చర్చలు పుతిన్‌కు ఇష్టం లేకపోతే త్రైపాక్షిక చర్చలైనా పర్వాలేదని, ఏ తరహా సమావేశానికి అయినా నేను సిద్ధమేనని జెలెన్‌స్కీప్రతిపాదించారు. తనతోపాటు పుతిన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ కలిసి చర్చల్లో పాల్గొనాలనే ఉద్దేశంలో ఆయన పిలుపునిచ్చారు. అలాగే శాంతి ఒప్పందానికి రాకుండా ముందుకువెళుతున్న రష్యాపై ఆంక్షలు విదించాలని డిమాండ్ చేసారు. పుతిన్ దూకుడుపై అమెరికా అధ్యక్షుడు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నిప్పుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇక్కడ నేను లేకుండా ఉండి ఉంటే రష్యాకు చాలా విఘాతం కలిగి ఉండేదని, చాలా నష్టంజరిగేదని అన్నారు. ఈ విషయం పుతిన్ తెలుసుకోవడంలేదని ట్రంప్ అన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద వైమానిక దాడిచేసినవైనంపైనా ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. పుతిన్‌తో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని, కానీ కొన్నిసార్లు ఆయనకు ఏం అవుతుందో అర్థం కావడంలేదని, పూర్తిగా పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తున్నారని, అవసరం లేకపోయినా అనేకమందిని చంపేస్తున్నారన్నారు. కేవలం సైనికులగురించి మాత్రమే కాదని, కారణం లేకపోయినా ఉక్రెయిన్ నగరాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతున్నారని ఉక్రెయిన్‌లో కొంతభూభాగం కాదు ఆ దేశం మొత్తం స్వాధీనంచేసుకోవాలని కోరుకుంటున్నాడని ధ్వజమెత్తారు. ఇది రష్యా పతనానికే దారితీస్తుందని హెచ్చరించారు. రష్యా ఉక్రెయిన్‌ల మధ్య తక్షణమే కాల్పుల విరమణ చర్చలు ప్రారంభం అవుతాయని కొన్ని రోజులక్రితమే ట్రంప్‌ప్రకటించారు. అయితే అందుకు తగినట్లుగా అడుగులు పడలేదు.

# ఇరాన్‌లో ముగ్గురు పంజాబీలు మిస్సింగ్!




**న్యూఢిల్లీ, మే 28:** పంజాబ్‌లోని సంగ్రూర్‌నుంచి హోషియార్‌పూర్; ఎస్‌బిఎస్‌నగర్‌లనుంచి ఇరాన్‌కువెళ్లి ముగ్గురు భారతీయుల ఆచూకీ గల్లంతయింది. టెహ్రాన్‌లోని భారత దౌత్యకార్యాలయం ఈసమాచారాన్ని ధృవీకరించింది. అత్యవసరంగా వారిని గుర్తించేందుకు గాలింపు ముమ్మరం చేసినట్లు ప్రకటించింది. హుషన్‌ప్రీత్ సింగ్, జస్‌పాల్‌సింగ్, అమృత్‌పాల్ సింగ్‌లు ఈ ముగ్గురూ కూడా పంజాబ్‌లోని సంగ్రూరు, జస్‌పాల్‌సింగ్, హోషియార్‌పూర్‌లనుంచి ఇరాన్‌కు వచ్చినట్లు తేలింది. ఈనెల ఒకటవ తేదీనుంచి కూడా వారు అదృశ్యం అయ్యారు. టెహ్రాన్‌లో వారు ల్యాండ్ అయినప్పటినుంచి కూడా కనిపించడంలేదని తేలింది. కుటుంబసభ్యులు ఎంబసీ అధికారులకు సమాచారం అందించారు. ఇరాన్‌కు వెళ్లిన తమ సభ్యులు కనిపించడంలేదని, వారి ఆచూకి వివరాలు వెంటనే చెప్పాలని కోరాయి. ఇరాన్ యంత్రాంగంతో భారత్ ఎంబసీ అధికారులు అత్యవసర సమస్యగా లేవనెత్తారు. వారికి పూర్తి భద్రత కల్పించాలనికూడా ఇరాన్‌ను కోరారు. పంజాబ్‌లో ఒక ఏజెంట్ ఈ ముగ్గురికి ఆస్ట్రేలియా పంపిస్తానని దుబాయి ఇరాన్ రూటులో వారిని ఆస్ట్రేలియం పంపిస్తానని చెప్పాడు. మార్గమధ్యంలో ఇరాన్‌లో బస చేయాల్సి ఉంటుందని చెప్పాడు. ఈనెల 1వ తేదీ ఇరాన్‌లో ల్యాండ్ అయిన వెంటనే వారు కిడ్నాప్‌కు గురయ్యారు.

వారిని కిడ్నాప్ చేసారని కోటి రూపాయలు ఇవ్వాలని బెదిరిస్తున్నారని చెప్పారు. పసుపు రంగు తాళ్లతో కట్టివేసి, వారి మోచేతులనుంచి రక్తం కారుతున్న విడియోలను చూపించారని, వారు కోరిన సొమ్ము పంపించకపోతే ముగ్గురినీ హత్యచేస్తామని బెదిరించారన్నారు.

కిడ్నాపర్ల ఫోన్లతోనే వారు కుటుంబీకులతో మాట్లాడగలుగుతున్నారు. ఈనెల 11వ తేదీ నుంచి ఈ కుటుంబాలతో మళ్లీ వారి పిల్లలు కాంటాక్టులోకి రాలేదు. వీరిని ప్రలోభపెట్టి ఆస్ట్రేలియా పంపిస్తానని చెప్పిన ఏజెంట్ కూడా పరారీలో ఉన్నట్లు తేలింది.

# సెప్టిక్‌ట్యాంక్‌లో బంగారంకోసం వెళ్లి నలుగురు మృతి

## రాజస్థాన్‌లో ఘటన!

**జైపూర్, మే 28:** సెప్టిక్‌ట్యాంక్‌లో పేరుకుపోయిన బంగారం మడ్డినీ తీసుకురావడానికి అందులోకి వెళ్లి నలుగురు కూలీలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జైపుర్‌లోని ఒక జ్యువెలరీ షాపు యజమాని వికాస్ మెహతా బంగారం, వెండిని తమ సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్న సమయంలో అందులో కొంత మొత్తం సెప్టిక్ ట్యాంక్‌లో పేరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని బయటకు తీయాలని అతడు ఎనిమిది మంది కూలీలను అడగగా మొదట వారు నిరాకరించారు.

బంగారు రజను తీసుకువస్తే అదనంగా డబ్బులు ఇస్తామని షాపు యజమాని ఆశ చూపడంతో చివరికి అంగీకరించారు. సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగేటప్పుడు ఎటువంటి భద్రతా పరికరాలు తీసుకెళ్లకపోవడంతో గాలింపు సమయంలో ఊపిరాడక ఎనిమిది మంది కార్మి కులు స్పృహ కోల్పోయారు.

వారిని బయటకు తీయగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన రోహిత్ పాల్, సంజీవ్ పాల్, హిమాంగ్షుసింగ్, అర్పిత్ యాదవ్ అనే నలుగురు కూలీలు మృతి చెందినట్లు పోలీ సులు తెలిపారు. మరో నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎటువంటి భద్రతా చర్యలులేకుండా భూగర్భ సెప్టిక్ ట్యాంక్‌లోకి కార్మికులను పంపడంపై దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. అందులో నిజంగానే బంగారు రజనుఉందా అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆభరణాలషాపు యజమాని, కాంట్రాక్టర్లపైనా చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గహ్లోత్ స్పందిస్తూ సెప్టిక్ ట్యాంకులలోకిదిగి పారిశుధ్య కార్మికులు మరణిస్తున్న ఘటనలు రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్నాయని, వాటిని శుభ్రపరిచేందుకు యంత్రాలను కొనుగోలు చేస్తా మని ప్రభుత్వం ప్రకటించినా చర్యలు తీసుకో లేదని విమర్శించారు. పారిశుధ్య కార్మికుల భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.

## చెన్నై ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా

# విమానానికి తప్పిన ముప్పు

**చెన్నై, మే 28:** చెన్నై విమానాశ్రయంలో బుధవారం ఉదయం ప్రమాదం తృటిలో తప్పింది. సింగపూర్ నుంచి 180 మంది ప్రయాణికులతో వస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ల్యాండింగ్ సమయంలో సమస్యలు తలెత్తడంతో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. అయితే, పైలట్ల సమయస్ఫూర్తితో విమానం సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సింగపూర్ నుంచి బయలుదేరిన ఎయిర్‌బస్ విమానం బుధవారం ఉదయం 10:15 గంటలకు చెన్నై విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానం వేగంగా కిందికి దిగడం, అదే సమయంలో ప్రతికూల గాలులు బలంగా వీయడంతో పరిస్థితి అదుపు తప్పుతున్నట్లు పైలట్లు గుర్తించారు.

రన్‌వేకు కేవలం 200 అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు, ప్రమాదాన్ని పసిగట్టిన పైలట్లు వెంటనే ల్యాండింగ్‌ను రద్దు చేసుకుని గో అరౌండ్‌ప్రక్రియను చేపట్టారు. దీంతో విమానం తిరిగి గాల్లోకి లేచి, విమానాశ్రయం చుట్టూ చక్కర్లు కొట్టింది. సుమారు 30 నిమిషాల తర్వాత రెండో ప్రయత్నంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విమానం ల్యాండింగ్‌ను రద్దు చేసుకున్న విషయాన్ని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ధృవీకరించారు. రన్‌వేలోని సెయింట్ థామస్ మౌంట్ వైపు ల్యాండింగ్ సమయంలో విమానం అస్థిరంగా ఉందని తెలిపారు.

సురక్షితమైన ల్యాండింగ్ కోసం విమానం కిందికి దిగే వేగం నియంత్రణలో ఉండాలి, సరైన వేగంతో పాటు రన్‌వేకు అనుగుణంగా ఉండాలి. ఈ సందర్భంలో, విమానం చాలా వేగంగా కిందికి దిగింది, అదే సమయంలో గాలుల వేగంలో ఆకస్మిక మార్పు వచ్చిందని ఓ అధికారి తెలిపారు.

ఈ ఘటన చెన్నై విమానాశ్రయంలో ఇటీవలి ల్యాండింగ్ సంబంధిత సమస్యలపై మరోసారి ఆందోళనలను రేకెత్తించింది. గత ఏడాది అక్టోబర్‌లో జైపూర్ నుంచి వచ్చిన ఇండిగో విమానం కూడా ఇలాంటి కారణాలతోనే టచ్ అండ్ గో చేయాల్సి వచ్చింది. అలాగే, ఈ ఏడాది మార్చిలో ముంబైచెన్నై విమానం ల్యాండింగ్ సమయంలో తోక భాగానికి నష్టం వాటిల్లింది.

## ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రం ఏర్పాటు

**హైదరాబాద్,మే 28,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పని లేక ఇంటి వద్ద ఉంటున్న వారి కోసం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. రోజువారీ కూలీ రూ. 307గా నిర్ణయించినప్పటికీ కార్మికులకు తక్కువ మొత్తం అందుతోందనే ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆదేశించింది. కార్మికులు అనారోగ్యానికి గురైనా లేదా ప్రమాదానికి గురైనా వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలని అధికారులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒక సహాయ కేంద్రం ప్రారంభించింది. కూలీ డబ్బులు రూ. 307 అని చెబుతున్నా, కనీసం రూ. 200 కూడా ఇవ్వడం లేదని తెలంగాణలో ఉపాధి హామీ కార్మికులు వాపోతున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, పనిని బట్టి కూలీ చెల్లిస్తామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఉపాధి హామీ పథకం కార్మికులకు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కార్మికులకు రోజుకు నిర్ణీత పని పరిమాణంలో పనిచేస్తే కేంద్రం నిర్ణయించిన రూ. 307కూలీ చెల్లించాలని సూచించారు. ఈ పథకం అమలులో సమస్యలను తెలియజేయడానికి ప్రభుత్వం హైదరాబాద్‌లో ఒక సహాయ కేంద్రం ఏర్పాటు చేసింది.

## రాష్ట్ర ఆవిర్భావం రోజున ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ

### సన్నాహాలు చేస్తున్న రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు

**హైదరాబాద్,మే 28,ప్రభాతవార్త:** పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పరుగులు తీస్తోంది. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు కొన్ని ఇళ్లను ప్రారంభించేందుకు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. లబ్ధిదారుల్లో కొందరు ఖాళీ స్థలంలో ఇళ్లు కట్టుకుంటుండగా, మరికొందరు తాత్కాలిక నిర్మాణాలను తొలగించి నిర్మాణం చేపడుతున్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని జీహెచ్ఎంసీ పరిధిలోకి వెళ్లే నియోజకవర్గాలు, డివిజన్లను మినహాయించి మిగిలిన ప్రాంతాల్లోని లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎల్బీనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాల్లో రెండు మండలాలు, మేడ్చల్ జిల్లాలో కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు ఇందులో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఇళ్ల నిర్మాణం తొలుత మందకొడిగా ప్రారంభమైనా ఏప్రిల్ చివరి వారం నుంచి వేగంగా పనులు జరుగుతున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలో తొలుత 4,800 ఇళ్లు నిర్మించాలని భావించగా, 3500 ఇళ్లకు ప్రణాళికలు రూపొందించారు. ముందుకు వచ్చిన 1028 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో 400 చదరపు అడుగులతో మాత్రమే ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం మొదటగా ఆదేశాలు జారీ చేసింది. నమూనా ఇంటిని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు మరింత విశాలంగా ఉండేలా చూడాలంటూ ఆదేశించారు. దీంతో 600 చదరపు అడుగుల్లో ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించారు.

## ఆర్జీయుకెటిలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్సలర్ గోవర్ధన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ బాసర సెంటర్‌లో 1500ల సీట్లు, మహబూబ్‌నగర్ సెంటర్‌లో 180 సీట్లకు ఆరేండ్ల సమీకృత విద్యావిధానంలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి అప్లికేషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పడిందని, ఇంజినీరింగ్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. దీంతో ఉపాధి, ఉద్యోగావకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని అన్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాలను ట్రిపుల్ ఐటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలియజేశారు. ఈ నెల 31 నుంచి జూన్ 21 వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నామన్నారు. పదో తరగతి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కాగా, మహబూబ్‌నగర్‌లో కొత్త ఆర్జీయుకెటి ఐటీ క్యాంపస్‌కు అనుమతి లభించింది. 2025-26 విద్యా సంవత్సరం నుండి అక్కడ క్లాసులు ప్రారంభం కానున్నాయి. కొత్త క్యాంపస్‌లో మూడు కొత్త కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డేటా సైన్స్ కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్జీయుకెటి బాసర ఆధ్వర్యంలోనే మహబూబ్‌నగర్ క్యాంపస్ నడవనుంది. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకన్వీనర్ డాక్టర్ దేవరాజ్, అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్ పాల్గొన్నారు.




ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నేత పేరాల చంద్రశేఖర్‌రావు

## అక్రమ చొరబాటు దారులను తరిమివేయాలి

### భారత్ నేషనలిస్ట్ ఫోరం, జాతీయ వాదుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పలువురు నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 28, ప్రభాతవార్త:** భారతదేశంలో అక్రమంగా ప్రవేశించి, నివాసం ఉంటున్న చొరబాటుదారులను తక్షణమే దేశం నుండి తరిమివేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. బుధవారం భారత్ నేషనలిస్ట్ ఫోరం, జాతీయ వాదుల సంయుక్త ఆధ్వర్యంలో అక్రమవలస దారులను దేశం నుండి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు బీజేపీ సీనియర్ నేత పేరాల చంద్రశేఖర్‌రావు, నటుడు వైభవ్ సూర్య, సరూర్‌నగర్ కార్పోరేటర్ ఆకుల శ్రీవాణి, సినీనటి కరాటే కళ్యాణి, యమునా పాటక్‌లు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం దేశాల నుండి భారత్‌లోకి ఎక్కువ సంఖ్యలో వలసదారులు, రోహింగ్యాలు వస్తున్నారని, వారి వల్ల దేశ భద్రతకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వలసదారుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు జి. భరత్‌గౌడ్, నిర్వాహకులు సామ కృష్ణారెడ్డి, రాంబాబు, కొత్త కొండ రాజు మరియు హిందూ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

## మాలలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ: చెన్నయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మాలలంతా గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువస్తే అధికారంలోకి వచ్చిన తరువాత మాలలకు తీరని అన్యాయం చేస్తున్నదని మాల మహానాడు జాతీయ కమిటీ ఆరోపించింది. కనీసం ఇప్పటి వరకు మాలలకు మంత్రి వర్గంలో చోటు దక్కలేదని, త్వరలో చేపట్టబోయే మంత్రి వర్గ విస్తరణలో మాలలకు మంత్రి పదవి ఇవ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నామినేటేడ్ పదవుల్లో కూడా మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. షెడ్యూల్డ్ కులాలరెసిడెన్షియల్ కళాశాలలను మూసివేసే ఆలోచనలను ప్రభుత్వం మానుకోవాలని లేకుంటే ప్రభుత్వంపై మాలల పోరాటం తప్పదని హెచ్చరించారు. చేవేళ్ళ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, అంబేద్కర్ అభయ హస్తం కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాలల్లో అనేకృతను అసరాగా తీసుకుని సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయకుండా దళిత సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. జూన్7వ తేదీన మాల మహానాడు రాష్ట్ర ముఖ్యనాయకులు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సమావేశంలో మాలల భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, నాయకులు కడారంవినయ్‌కుమార్, పుణ్య భానుప్రకాష్, ఎం.సరళ తదితరులు పాల్గొన్నారు.

# విశిష్ట చరిత్రకారుడు, సంఘసంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి

### తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి

### వైభవంగా సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి

### నూతన అధికారిక లోగో ఆవిష్కరణ

### 10కోట్ల నికర నిధులతో రాష్ట్రప్రభుత్వం ప్రతాపరెడ్డి పేరిట తెలుగు వర్సిటీ పీఠాన్ని ఏర్పాటు చేయాలి : డా. సంగిశెట్టి శ్రీనివాస్



సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అధికారిక లోగోను ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి, బాలకృష్ణారెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస్ తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), మే 28 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజల్లో సాంస్కృతిక చైతన్యాన్ని నింపిన సామాజిక సాహిత్యకారుడు, విశిష్ట చరిత్రకారుడు, గొప్ప సంఘసంస్కర్త, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా పేరుతో ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి రాష్ట్రప్రభుత్వం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంగా మార్చినందున సురవరం 129వ జయంతిని పురస్కరించుకొని నాంపల్లి తెలుగు విశ్వవిద్యాల యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జి.చిన్నారెడ్డి విశిష్ట అతిథులు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య వి.బాలకృష్ణారెడ్డి, తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రతాపరెడ్డి కుమారుడు డా. సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ప్రముఖ రచయిత, చరిత్రకారుడు డా. సంగిశెట్టి శ్రీనివాస్, విశ్వవిద్యాలయ విస్తరణ సేవావిభాగం సహసంచాలకుడు రింగురామమూర్తి తదితరులతో కలిసి విశ్వవిద్యాలయ అధికారిక నూతన లోగోను ఆవిష్కరించి ప్రసంగించారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు ఎంతో సబబు అని రాష్ట్రప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. వెయ్యి వసంతాల ఆంధ్రుల చరిత్రను పరిశీలించి రచన చేసిన గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న సాహితీమూర్తి ప్రతాపరెడ్డి అని గుర్తుచేశారు. గోల్కొండ పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారని ప్రశంసించారు. నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో తెలంగాణ అస్థిత్వ ప్రతీకగా సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం హర్షదాయకమన్నారు. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యావ్యవస్థను సంస్కరించే విధంగా విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నామన్నారు. శివారెడ్డి ఆంధ్ర, తెలంగాణ సంస్కృతి గురించి విషయ పరిజ్ఞానాన్ని తన రచనల ద్వారా ఆందించి తెలుగుజాతికి చైతన్యమూర్తిగా నిలిచిన గొప్పవ్యక్తి అన్నారు. ప్రధాన వక్తగా డా. సంగిశెట్టి శ్రీనివాస్ ప్రతాపరెడ్డి గురించి మాట్లాడడమంటే తెలంగాణ సోయి, చైతన్యం గురించి మాట్లాడినట్లేనని కొనియాడారు.

8భాషల్లో ప్రావీణ్యతను పొంది వేలకొద్దీ వ్యాసాల ద్వారా ప్రజల్లో రాజకీయ, సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చి తెలంగాణలో 180 గ్రంథాలయాల ఏర్పాటుచే కృషిచేసిన బహుభాషావేత్తని గుర్తుచేశారు. సురవరం అముద్రిత రచనలను విశ్వవిద్యాలయం ముద్రించాలని సంగిశెట్టి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం సురవరం ప్రతాపరెడ్డి పేరున ప్రత్యేక పురస్కారాన్ని ఏర్పాటుచేసి ప్రతీయేటా ఆయన జయంతి రోజున ప్రదానం చేయాలని, 10కోట్ల నికర నిధులతో సురవరం ప్రతాపరెడ్డి పేరిట తెలుగు విశ్వవిద్యాలయ పీఠాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. రింగు రామమూర్తి కార్యక్రమ సమన్వకర్తగా వ్యవహరించారు.

## సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించండి

### మీనాక్షి నటరాజన్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన సర్పంచ్‌ల జెఎసి

**హైదరాబాద్,మే 28,ప్రభాతవార్త:** సుమారు గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లును ఇప్పించాలని కోరుతూ తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యహారాలు ఇన్‌చార్జ్‌కు మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం ఈ మేరకు ఆమెను హైదర్‌గూడలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతి పత్రం అందచేశారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. అనేక మార్లుకు సర్పంచ్‌లు బిల్లుల చెల్లించాలని ప్రభుత్వం పెద్దలకు విజ్ఞప్తి చేసిన ఇంత వరకు ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అప్పుల బాధలతో అనేక మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. సర్పంచ్‌ల బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆమెకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.మీనాక్షి నటరాజన్‌ను కలిసివారిలో సర్పంచ్‌ల సంఘం నాయకులు రాంపాక నాగయ్య తదితరులు ఉన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌పై మీనాక్షి నటరాజన్ దృష్టి

### వరుస సమీక్షలు,కార్యాచరణపై వివరాల సేకరణ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టి సారించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ బలోపేతం, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పనితీరుపై ఆమె సమీక్షలు జరుపుతున్నారు. బుధవారం నాడు మీనాక్షి నటరాజన్ వివిధ లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో సమావేశమయ్యారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయం ఈ సమీక్షలకు వేదికైంది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన జరుగుతున్న ఈ భేటీలలో మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులతో ఆమె చర్చలు జరుపుతున్నారు. పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యలపై స్పందన వంటి అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరా బాద్, మెదక్, మల్కాజ్‌గిరి స్థానాలపై దృష్టి సారించారు. ఈ సమావేశాలలో ఆయా నియోజకవర్గాల పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు,భవిష్యత్ కార్యాచరణపై నేతల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కూడా మీనాక్షి నటరాజన్ విడివిడిగా సమావేశమై చర్చించనున్నారు. ఈ విస్తృత స్థాయి సమీక్షల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసి, తదుపరి చర్యలకు రూపకల్పన చేయ నున్నట్లు తెలుస్తోంది. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు,ఎంపీతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. నియోజకవర్గ సమస్యలు, స్థానిక ఎన్నికల్లో బలాలు,బలహీనతలు, కమిటీ లపై ప్రకటనపై చర్చ జరిగింది.ఈ సమావేశానికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం ఆదిలాబాద్ పార్లమెంటరీ నియో జకవర్గ నేతలతో మీనాక్షి సమావేశం నిర్వహించారు.



ఎసిబి అధికారులకు చిక్కిన ఆర్‌ఐ మహేష్

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ముషీరాబాద్ ఆర్‌ఐ

### ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం లక్షాపదివేల రూపాయలు డిమాండ్

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 28, ప్రభతవార్త:** ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం లక్ష రూపాయల లంచం డిమాండ్ చేసి, లంచం తీసుకుంటూ ఉండగా ప్రభుత్వ అధికారి పట్టుబడిన సంఘటన ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో మహేష్ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో జి.రామకృష్ణ అనే వ్యక్తి ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం కార్యాలయంకు వచ్చి మహేష్‌ను సంప్రదించగా తనకు లక్షా పదివేల రూపాయలు ఇస్తేనే సర్టిఫికెట్ వస్తుందని చెప్పాడు. దిక్కుతోచని రామకృష్ణ అవినీతి నిరోధఖ శాఖ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల ప్రకారం లంచం ఇచ్చేందుకు ఒప్పుకుని, ముందుగా 25 వేల రూపాయలు మహేష్‌కు ఇచ్చాడు. లంచం తీసుకున్న వెంటనే రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు మహేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, లంచం డబ్బును స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీనెంబర్ 1064కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చునని, వాట్సాప్ నెంబర్ 9440446106 కూడా ప్రజలకు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఎవరు ఫిర్యాదు చేసినా వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, లంచం ఎవరు డిమాండ్ చేసినా నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రైడ్స్‌లో సీఐలు గౌస్ అజాద్, జగన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితో పాటు 15 మంది సిబ్బంది పాల్గొన్నారు.

## మే నెలలో సున్నా స్థాయికి పడిపోయిన యూనిట్ విద్యుత్ ధరలు

### సామాన్యులపై బిల్ భారాన్ని తగ్గించాలంటున్న విద్యుత్ రంగ నిపుణులు

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ప్రతీ ఏడాది వేసవి కాలంలో విద్యుత్ వినియోగం భారీగా వుండడం తెలిసిందే. ముఖ్యంగా మే నెలలో ఏసిలతో పాటు కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌ల వినియోగం ఎక్కువగా వుండడం వల్ల విద్యుత్ వినియోగం ఎక్కువగా వుంటుంది. చాలాసార్లు ట్రాన్స్‌కో అధికారులు డిమాండ్‌కు తగినంత సరఫరా చేయలేక కొన్నిచోట్ల కోతలు విధిస్తుండడం పరిపాటి. ఈ కోతలు గ్రామాల్లో ఎక్కువగా వుంటాయి. పట్టణాలలో సబ్ స్టేషన్ల నిర్వహణ, అత్యవసర నిర్వహణ పేరిట పలు సందర్భాలలో కోతలు విధించిన ఉదంతాలూ వున్నాయి. అయితే ఈ ఏడాది మే నెల ఇందుకు పూర్తిగా భిన్నంగా వుందని చెప్పాలి. వాతావరణంలో అనూహ్య మార్పులతో పాటు బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడడం, రుతుపవనాలు పది రోజుల ముందుగానే రావడంతో దేశ వ్యాప్తంగా ముందుగానే వర్షాలు కురవసాగాయి. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో విద్యుత్ డిమాండ్ మే నెలలో తొలిసారిగా అనూహ్యంగా పడి పోయింది. ఈ కారణంగా స్పాట్ మార్కెట్ ఇండియన్ పవర్ ఎక్స్ఛేంజిలో విద్యుత్ ధరలు యూనిట్‌కి మార్చి నెలలో వుండాల్సిన దానికంటే సగటున 25 శాతం పడిపోయాయి. ఒక రకంగా చెప్పాలంటే యూనిట్ ధరలు దాదాపు సున్నాకు దగ్గరగా చేరుకున్నాయని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. ఏసిలు, కూలర్ల వాడకం తగ్గడం, ఈ కాలంలో వీటి అమ్మకాలకు వుండే డిమాండ్ భారీగా తగ్గడం వల్ల దీని ప్రభావం విద్యుత్ వినియోగంపై పడిందని విద్యుత్ రంగ నిపుణులు అంటున్నారు. దీని కారణంగా ధరల పతనం అయ్యిందని వారంటున్నారు. వాస్తవానికి ఈ ఏడాది వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ మే నెల మూడవ వారం చివరకు 266 గిగావాట్లకు చేరుకుంటుందని కేంద్ర విద్యుత్ అధికారులు అంచనా వేశారు. ఇందుకు తగినట్లుగా పవర్ జనరేషన్ కంపెనీలతో పాటు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాట్లు చేసుకున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ ఏర్పాట్లు భారీగానే జరిగాయి. కానీ అనూహ్యంగా వర్షాలు పడడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించి విద్యుత్ డిమాండ్ తగ్గిపోయింది. దీనివల్ల విద్యుత్ వినియోగం మే నెల మూడవ వారంలో 231 గిగావాట్ల వరకే పరిమితమయ్యింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో దేశ వ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ నాలుగు శాతం తగ్గింది. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ కంటే ఉత్పత్తి అధికంగా వుండడంతో ఎక్స్ఛేంజీల్లో పవర్ ధరలు పడిపోయాయని ఐఈఎక్స్ నిర్వాహకులు చెబుతున్నారు. వాస్తవానికి అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి జరగడం దేశంలో చాలా తక్కువ సందర్భాలలోనే జరుగుతుందని ఐఈఎక్స్ నిర్వాహకులు తెలిపారు. ఈ నెలలో ఐఈఎక్స్‌లో సగటు పగటి పూట యూనిట్ విద్యుత్ ధర 56 పైసలుగా నమోదవడం గమనార్హం. మే నెల 25వ తేదీన ఉదయం నుంచి మధ్యాహ్నం సమయంలో అనేకసార్లు యూనిట్ ధర సున్నాకు దగ్గరగా పడిపోవడం విశేషం. మొత్తం మీద మే 25వ తేదీన సగటు విద్యుత్ రోజువారీ ధర రూపాయి 53 పైసలుగా వుంది. ఈ క్రమంలో దేశంలో విద్యుత్ పంపిణీ డిస్కంలు బొగ్గుతో నడిచే థర్మల్ ప్రాజెక్టుల వద్ద కాకుండా తక్కువ ధరకు లభించే పునరుత్పత్తి విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ఇష్టపడ్డాయి. నీటివనరులు అధికంగా అందుబాటులోకి రావడం ఇందుకు ఒక కారణంగా నిపుణులు చెబుతున్నారు. అయితే తగ్గిన విద్యుత్ యూనిట్ ధరలు సామాన్యులకు బదిలీ చేయాలని నిపుణులు అంటున్నారు. కొన్ని విదేశాల్లో ఇలాంటి పద్ధతులు అమలవుతున్నా యని వారంటున్నారు. అయితే ఇలాంటి పరిస్థి తులవల్ల థర్మల్ పవర్ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లే ప్రమాదం వుందని ఐఈఎక్స్ నిర్వాహకులు చెబుతున్నారు.

# పిల్లల అక్రమ రవాణా ముఠా అరెస్టు

### 13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

### 28 మంది పిల్లలను అక్రమ రవాణా చేసినట్లు గుర్తింపు

### కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహా




బుధవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహా

**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** పిల్లల అక్రమ రవాణా ముఠా ను సూర్యాపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బుధవారం సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా కేసు వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం 10 గంటలకు అక్రమ దత్తతలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారం మేరకు అక్రమంగా దత్తత తీసుకున్న వారిని అరెస్టు చేసి వారి ఒప్పుకోలు ఆధారంగా నిందితులు ఏ1, ఏ2 లను అరెస్టు చేశారు.అదే విధంగా అక్రమ దత్తత గురించి చర్చించడానికి శిశువుల అక్రమ రవాణా ముఠా బృందం సూర్యాపేటకు వచ్చారని, వారు ఇప్పుడు సూర్యాపేటలోని హైటెక్ బస్ స్టాండ్లో అందుబాటులో ఉన్నారని తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు నిందితులు ఏ3 నుండి ఏ13 వరకు అరెస్ట చేయడం చేశారు. వారి తల్లిదండ్రులను కూడా అరెస్టు చేయనున్నట్లు తెలిపారు.13 మంది సభ్యులు కలిగిన పిల్లల అక్రమ రవాణా ముఠాను అరెస్టు చేశారు. సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన వివిధ గ్రామాల నుండి 07 మంది మగ శిశువులు,03 మంది ఆడ శిశువులు,టేకుమట్ల 09 బాలురు శిశువులు, సూర్యాపేట పట్టణం 02 బాలికల శిశువులు, పెన్ పహాడ్ 01 బాలుర శిశువులు, సూర్యాపేట జిల్లా ఉప్పలపహాడ్ 02 బాలుర శిశువులు, నల్గొండ జిల్లాకు చెందిన చిన్న సూరారం 01 బాలిక శిశువు ,హైదరాబాద్ 01 బాలుర శిశువులను రక్షించి పిల్లలందరినీ నల్గొండలోని బాలల సంక్షేమ కేంద్రానికి అప్పగించారు. సూర్యాపేట పట్టణంలోని యాదగిరి, ఉమారాణి అనే ఒక వ్యక్తులు గుడ్ల పంపిణీ వృత్తిని చేస్తూ పిల్లలు లేని తల్లిదండ్రుల గురించి తెలుసుకొని ఆడ,మగ శిశువులను బట్టి వారి కమీషన్ 10 వేల నుండి 2 లక్షల వరకు కలిపి మొత్తం 5 నుండి 10 లక్షల వరకు బేరం కుదుర్చుకొని అక్రమంగా దత్తత తీసుకున్న పిల్లలను వారికి అందించేవారు.

పైన పేర్కొన్న గ్రామాలను సందర్శించి, ఏ3 నుండి ఏ12 ల ద్వారా మధ్యవర్తిత్వం ద్వారా శిశువులను క్రింద పేర్కొన్న తల్లిదండ్రులకు పిల్లలను అక్రమంగా దత్తత ఇచ్చేవారు.ఏ13 కారు డ్రైవరు అతనికి కూడా పై విషయాలు అన్నీ తెలుసన్నారు. తదుపరి నేరస్థులను సూర్యాపేట కోర్టు ముందు హాజరు పరుచడం జరుగుతుందన్నారు. పిల్లల అక్రమ రవాణా కేసులో నిందితుల వివరాలను ఎస్పీ ప్రకటించారు. నక్క యాదగిరి , నక్క ఉమారాణి, కోరు నాగేంద్ర కుమార్, రామలక్ష్మి ్క, పావని, విజయలక్ష్మి ్క, సత్యమని, రాజు, శోభారాణి, ఖాన్ షాహినా, ఎండి షాహినా, శ్రీనివాస్, సునీత పిల్లలను అక్రమ రవాణా కేసులో ఉన్నట్లు గతంలో అ నిందితులపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

పిల్లలను అక్రమంగా దత్తత తీసుకోవడం నేరమని ఎస్పీ తెలిపారు. పిల్లలు లేనివారు దత్తత తీసుకోవడానికి చట్ట ప్రకారము ముందుకెళ్లాలన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులు అడాప్షన్ రిసోర్స్ అథారిటీకి దరఖాస్తులు చేసుకోవాలని ఆ తర్వాత వారు విచారణ చేసి దత్తత తీసుకోవడానికి అన్ని అవకాశాలు ఉంటే తల్లిదండ్రులు చట్ట ప్రకారము దత్తత తీసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. సూర్యాపేట డిఎస్పీ నేతృత్వంలో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపర్చిన సిసియస్ సూర్యాప్ట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం.శివ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.రాజశేఖర్, సూర్యాపేట పెన్ పహాడ్ పోలీస్ ఇన్స్పెక్టర్ పి.హరి కృష్ణ, సూర్యా పేట రూరల్ సిసియస్ ఎస్ ఐ హరి కృష్ణ,పెన్ పహాడ్ పోలీస్ ఎస్ఐ కె.గోపి కృష్ణ,చివ్వేంల ఎస్ఐ వి.మహేష్, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు నాయక్, సిసియస్ సిబ్బందిలను ఎస్పి అభినందించారు.

## వ్యక్తిగత అజెండాతో ఎవరూ మాట్లాడవద్దు: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** పార్టీ కార్యాలయంలో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతలు సున్నితంగా మందలించారు. ఎవరికి తోచినట్లు వారు మాట్లాడటం, వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టారీతన వ్యవహరిస్తూ ఊరుకునేది లేదన్నారు. బుధవారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ముఖ్యనేతలతో సమావేశంఅయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎవరికి ఏ ఆపదవచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని అలాంటి వారికి న్యాయంజరిగే వరకూ పోరాటం చేసేలా నాయకుల తీరు ఉండాలని అన్నారు.

## మద్దతు ధర పెంపుతో తెలంగాణ రైతులకు లబ్ది

### ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతూ ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణ రైతులతో పాటుగా దేశంలోని రైతులకు ఎంతగానో మేలు జరుగుతుందన్నారు. ముఖ్యంగా వరి, పత్తి, జొన్న, వేరు శనగ, కంది పప్పుపండించే రైతులకు లబ్ధి చేకూరుతుంది. తెలంగాణ రైతులకు కూడా ఎంతో లబ్ధి చేకూరనుందన్నారు.

## 16,000 ఆర్టీఐ అప్లికేషన్లు పెండింగ్‌లో

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీ అడుగుజాడల్లో ప్రభుత్వం ఉన్న శాఖలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు ప్రభుత్వ యంత్రాంగం కూడా నిర్వీర్యం అయిపోయిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. భారతదేశంలో ఆర్‌టిఐ చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణలో ఆర్‌టిఐ యాక్ట్ పనిచేయడం లేదు. ప్రస్తుతం 16,000 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అప్పుల వివరాలను మేము ఆర్‌టిఐ ద్వారా అడిగిన 27 ప్రశ్నల్లో వివరాలు కోరుతున్నామన్నారు.

## పరుగులు పెడుతున్న ప్రభుత్వ రంగ సంస్థలు

### మంత్రి జి. కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రభుత్వం గత పదేళ్లుగా తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థిక వృద్ధిలో పరుగులు పెడుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో పిఎస్‌యుల నికర విలువ రూ.9.5 లక్షల కోట్ల నుంచి రూ.17 లక్షల కోట్లకు పెరిగింది. పిఎస యులు సాధిస్తున్న విజయానికి ఇదొక ఉదాహరణ మాత్రమేనని అన్నారు. నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ 1981లో ప్రారంభమైనప్పటి ఏనాడూ అందుకోని రికార్డులను 2024-25లో తొలిసారిగా అందుకుంది. మెరుగైన పనితీరుతో ఆర్థికాభివృద్ధికి బాట లు వేసుకుంటుందన్నారు. నాల్కొ బాటలోనే హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ సైతం 2024-25 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక వృద్ధి నమోదు చేసిందన్నారు. నాల్కొ, హెచ్‌సిఎల్ సాధించిన ఈ అద్భుత ప్రదర్శనకు మన స్ఫూర్తిగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## సిఎంవో సహకారంతో నాంపల్లి పబ్లిక్ గార్డెన్ సరస్సు పునరుద్ధరణ


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నాంపల్లి పబ్లిక్ గార్డెన్ సరస్సు పూర్వ వైభవం సంతరించుకుంది. సీఎంవో,ఉద్యానవన శాఖ అధికారుల మద్దతుతో ఎన్విరాన్‌మెంట్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఇఎఫ్ఐ) సీఎస్ఆర్ ఎన్జీవో సంస్థ ముందుకు వచ్చింది. మొదటి దశ పునరుద్ధరణలో భాగంగా రూ.34.50 లక్షల వ్యయంతో గత ఇరవై రోజులుగా సరస్సు పునరుద్ధరణ పనులు సాగుతున్నాయి. జూన్ చివరి నాటికి సరస్సు పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈఎఫ్ఐ ఎన్జీవో వ్యవస్థాపకుడు అరుణ్ కృష్ణమూర్తి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నారని అన్నారు.

## బాచుపల్లిలో నేడు కాంగ్రెస్ జై హింద్ యాత్ర సభ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** 'జై హింద్ యాత్ర సభ' గురువారం బాచుపల్లిలో జరుగనుంది. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయంగా వాడుకుంటున్న బిజెపి పార్టీ వైఖరిని ఎండగట్టడం, భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలకు మౌనంగా ఉన్న ప్రధాని మోడీ తీరును విమర్శించడం, సైనికులకు సంఘీభావం తెలపడమే లక్ష్యంగా ఏఐసిసి ఇచ్చిన పిలుపు మేరకు ఈ యాత్ర, సభను నిర్వహిస్తున్నారు. కాగా, ఈ యాత్ర మధ్యాహ్నం 2 గంటలకు వివిఎన్ఆర్ కాలేజీ నుంచి కెజిఆర్ కన్వెన్షన్ వరకు జరుగనుంది.

# రాచరిక పాలనకు ఎదురొడ్డి నిలిచిన ధీరుడు సురవరం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




సురవరం ప్రతాపరెడ్డి పురస్కార ప్రదానోత్సవ సభలో పాల్గొన్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 28, ప్రభాతవార్త:** నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడు సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ ఐటి, పరిశ్రమ శాఖా మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. బుధవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతిని పురస్కరించుకుని సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం 2025 ప్రధానోత్సవ కార్యక్రమం శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి శ్రీధర్‌బాబు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్‌కు సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందచేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఎనలేని కృషి చేసిన సురవరం ప్రతాపరెడ్డి భావి తరాలకు గుర్తుండిపోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన పేరును తెలుగు విశ్వవిద్యాలయంకు పెట్టటం ద్వారా ఆ మహనీయుని సముచితంగా గౌరవించిందని గుర్తు చేశారు. తెలంగాణ భాషా, యాసకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రతాపరెడ్డి ప్రముఖ రచనలను పుస్తక రూపంలో తీసుకురానున్నామని, ఇందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని సాహితీవేత్తలను కోరారు. కే.ఐ.వర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి నిజమైన హీరో అని కొనియాడారు. నిజాం కాలంలో తెలుగును చదవటం పక్కన పెడితే కనీసం ఉచ్చరించే పరిస్థితి కూడా లేని విపత్కర పరిస్థితిల్లో తెలుగు భాష కోసం పోరాటం చేసిన మహాయోధుడు సురవరం ప్రతాపరెడ్డి అన్నారు. తెలంగాణ భాషను, యాసను అవహేళన చేస్తే, తమకు భాష, యాస ఉందని చాటిచెప్పిన గొప్ప వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, సభ్యులు సురవరం కృష్ణవర్ధన్‌రెడ్డి, సురవరం రఘువర్ధన్‌రెడ్డి, సురవరం విజయభాస్కర్‌రెడ్డి, సురవరం రంగారెడ్డి, సురవరం అనిల్‌కుమార్‌రెడ్డి, సురవరం కపిల్ తదితరులు పాల్గొన్నారు.

# భూమికి దూరమవుతున్న చంద్రుడు!

### భవిష్యత్తులో రోజుకు 25 గంటలు!



భూమి, చంద్రుడికి మధ్య పెరుగుతున్న దూరంపై అమెరికా శాస్త్రవేత్తలు విడుదల చేసిన చిత్రం

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** భూమికి చంద్రుడు దూరంగా జరుగుతున్నాడని జర్మనీ, అమెరికా శాస్త్రవే త్తల అధ్యయనంలో తేలింది. దీని కారణంగా భవిష్య త్తులో భూమిపై ఇప్పుడు న్నట్లుగా 24 గంటలు కాకుండా 25 గంటలు పెరిగే వీలుందని ఇరు దేశాల శాస్త్రవేత్తలు చెబు తున్నారు. భూమి తన చుట్టూ తాను తిరిగే వేగం క్రమంగా మందగిస్తోందని జర్మనీలోని మ్యూనిక్ టెక్నికల్ యూనివర్సిటీ, అమెరికాలోకి విస్కాన్సిన్ మాడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు తమ పరిశీలనలో వెల్లడించారు. భూమికి సహజ ఉపగ్రహమైన చంద్రుడు ప్రతీ సంవత్సరం సుమారు 3.8 సెంటీమీటర్ల చొప్పున భూమి నుంచి దూరంగా జరుగుతున్నాడని ఆ పరిశోధనలో వెల్లడయ్యింది. దీనివల్ల భూమి, చంద్రుడి మధ్య వున్న గురుత్వాకర్షణ బలాల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. చంద్రుడి ప్రభావంతో సముద్రాల్లో ఏర్పడే ఆటుపోట్ల తీరు కూడా మారుతోందని, వీటికి వాతా వరణ పరిస్థితులలు కూడా తోడై భూభ్రమణ వేగం తగ్గుతోందని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. భూమిలో దాదాపు 20 అడుగుల లోతులో అమర్చిన ప్రత్యేకమైన రింగ్ లేజర్ టెక్నాలజి సహాయంతో ఈ సూక్ష్మమైన మార్పులను గుర్తించినట్లు వారు తెలిపారు. కాగా భూభ్రమణ వేగంలో మార్పులు రావడం, తద్వారా రోజులోని గంటల వనయవధి మారడం అనేది ఇదే మొదటిసారి కాదని శాస్త్రవేత్తలు గుర్తు చేస్తున్నారు. సుమారు 140 కోట్ల సంవ్సరాల క్రితం చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉన్నపుడు, భూభ్రమణ వేగంగా జరిగి రోజుకు కేవలం 18 గంటలు మాత్రమే ఉండేవని వారు వివరిస్తున్నారు. కాలక్రమేణా చంద్రుడు దూరమవుతున్న కొద్దీ భూభ్రమణ వేగం తగ్గి రోజు నిడివి పెరుగుతూ వస్తోందని వారంటున్నారు.

### 25 గంటల రోజు ఎప్పుడంటే...?

రోజుకు ప్రస్తుతం 24 గంటలు వుండగా చంద్రుడు భూమికి దూరమవుతున్న వేళ ఇది 25 గంటలకు పెరగనుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. అయితే ఇది తక్షణమే సంభవించేది కాదని పరిశోధకులు అంటున్నారు. ఈ మార్పు రావడానికి సుమారు 20 కోట్ల సంవత్సరాలు పట్టవ చ్చని వారు చెబుతున్నారు. అప్పటికీ మానవ నాగరికత ఎలా వుంటుందనేది చెప్పలేమని, క్యాలెండర్లలో తేదీల లెక్కింపులు మొదలు కొని, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టంలోని (జిపిఎస్) అటామిక్ క్లాక్ వరకు, విమానయాన సమయపాలన వంటి అనేక వ్యవస్థలలో కీలక సర్దుబాట్లు చేయాల్సి వుంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

# నాణ్యమైన నీటి సరఫరాకు చర్యలు

### జలమండలి అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** ముందస్తు వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో వర్షాకాల ప్రణాళిక 90 రోజుల కార్యచరణ, పురోగతిలో ఉన్న పలుప్రాజెక్టు పనులపై జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఉన్నత అధికారులతో రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. సివరేజ్ రహదారులపై ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలాగా చూసుకోవాలని సూచించారు. ఇప్పటికే జలమండలి, జిహెచ్ఎంసి 146 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించిందని, వాటిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. జలమండలి అధికారులు, సిబ్బంది 90 రోజుల కార్యాచరణ విజయవంతం చేసి, సివరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులను 30 శాతం తగ్గించడంపై ఎండితో సహా అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ 90 రోజుల ప్రణాళికలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది వేసవిలో 40 వేల వినియోగదారులు అధికంగా ట్యాంకర్లు బుక్ చేసినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో సర్వే చేస్తే వారి ప్రాంగణంలో ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఇంకుడు గుంటలు ఉంటే భూగర్భ జలాలు పెరిగి ఈ దుస్థితి రాకపోయేదని అన్నారు. 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీచేసి చేసినట్లు మంత్రి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని 300 గజాల పైన ఉన్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రతిఒక్కరూ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.


## తెలంగాణ కోసం రూ.11లక్షల కోట్లు ఖర్చు చేసిన కేంద్రం

**పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్‌నాథ్**

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** తెలంగాణకు అభివృద్ధి కోసం 2014 నుండి ఇప్పటి వరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం సుమారు రూ. 11 లక్షల కోట్ల ఖర్చు చేసిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్ నాథ్ సారంగుల పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత 16 నెలల్లో కేంద్రం అనేక రకాలుగా సహకరించినా, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం వల్ల అనేక ప్రాజెక్టులు నిలిచిపోయాయని అన్నారు. 2024 ఫిబ్రవరిలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీని కలిసినప్పుడు, పెండింగ్ ప్రాజెక్టులపై హోంవర్క్ ఇచ్చారు. మొబైల్ కనెక్టివిటీ కోసం నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో రూ.32,797 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్, ఎస్సారెస్పీ స్టేజ్-2, రాజీవ్ బీమా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.18,189 కోట్లు పెండింగ్ ఉన్నాయన్నారు. ఎయిమ్స్-బీబీనగర్‌కు రూ.1,366 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్, కాజీపేట-విజయవాడ థర్డ్ లైన్‌కు రూ.3,113 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, చిన్నచిన్న కారణాలతో 71,000 కోట్లకు పైగా అభివృద్ధి పనులు ఆగిపోయాయని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలు ఉంటే 32 జిల్లాలకు జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉందని, మరి ఆ ఘనత నరేంద్ర మోడీ అన్నారు. రైల్వే ప్రాజెక్టుల్లో కేంద్రం 80,000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుండగా, రాష్ట్రం యాక్సెస్ రోడ్లను ఇవ్వకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి.

## అసెంబ్లీని సందర్శించిన యువ ఐఏఎస్ అధికారులు

### అసెంబ్లీ వ్యవహారాలపై అవగాహన కల్పించిన కార్యదర్శి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** అసెంబ్లీ వ్యవహారాలపై అవగాహన పెంచుకునేందుకు 2024 బ్యాచ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారులు బుధవారం అసెంబ్లీని సందర్శించారు. శౌరబ్ శర్మ(భద్రాద్రి కొత్తగూడెం), సోలాని చబ్రా(ఆదిలాబాద్), హర్ష్ చౌదరి(వికారాబాద్), కరోలిన్ చింగ్తియాన్‌మవాయి(నిజామాబాద్) కొయ్యాడ ప్రణయ్‌కుమార్(నారాయణ్‌పేట్) బుధవారం సాయంత్రం అసెంబ్లీని సందర్శించారు. వీరు వారికి కేటాయించిన జిల్లాల్లో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మర్రి చెన్నారెడ్డి హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ కందుకూరి ఉషారాణి యువ ఐఏఎస్‌ల వెంట ఉన్నారు. వీరందరూ అసెంబ్లీని సందర్శించిన సందర్భంగా అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు అసెంబ్లీ వ్యవహారాలపై విస్తృత అవగాహన కల్పించారు. వీరికి అసెంబ్లీ ప్రొసీడింగ్స్ పుస్తకాలను, డైరీలను అందించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సంయుక్త కార్యదర్శి ఉపేందర్‌రెడ్డి, చీఫ్ మార్షల్ కరుణాకర్, అసెంబ్లీ సహాయ కార్యదర్శి మహ్మద్ హమీదుద్దీన్ కూడా పాల్గొన్నారు.

## రెండు పెండింగ్ డిఎలకు సిద్ధం, సీపీఎస్ రద్దుకు కమిటీ!

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన 40కి పైగా సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ సర్కారు సానుకూలంగా ఉంది. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న డీఏలలో రెండు చెల్లించడానికి తెలంగాణ సర్కారు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. అలాగే, ఉద్యోగుల రిటైర్మెంట్ రోజునే వారికి రావాల్సిన బెనిఫిట్స్‌లో కొంత మొత్తం చెల్లించడానికి కూడా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. ఉద్యోగ సంఘాలు త్రిసభ్య కమిటీకి కొన్ని అంశాలను నివేదించాయి. దీనిపై ఇప్పటికే సర్కారుసానుకూలంగా స్పందించింది. ఇందులోని పలు ఆర్థికపరమైన డిమాండ్లను కూడా ప్రభుత్వం నెరవేర్చనున్నట్లు సమాచారం. ఈ నెల 29న సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలతో పాటు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని అందులో చెప్పాలని విక్రమార్క అన్నారు. ఉద్యోగులకు సంబంధించిన 40కి పైగా సమస్యలను పరిష్కరించేందుకు సర్కారు సానుకూలంగా ఉంది.

ఆయా అంశాలు ఆర్థిక విషయాలకు ముడిపడి లేవు. అలాగే, పలు ఆర్థిక సమస్యల పరిష్కారానికి సైతం సర్కారు పచ్చజెండా ఊపనున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల వేళ బదిలీ అయిన అధికారులను మళ్లీ ఆయా ప్రాంతాలకు పంపించే అవకాశం ఉంది.

# మేడిగడ్డ ఎన్డీఎస్ఏ నివేదిక బూటకం

### వెంటనే రిపేర్లు చేయించాలి: కెటిఆర్ డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్అండ్‌టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టిందన్నారు. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణిక మని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వ రంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు.

పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం అత్యంత దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.

## అనాథ పిల్లలతో ఆడిపాడిన మిస్ వరల్డ్ పోటీదారులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** హైదరాబాద్‌లో సందడి చేస్తున్న మిస్ వరల్డ్ పోటీదారులు 200 మంది అనాథ పిల్లలతో ఆడిపాడారు. ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ అండ్ ఇన్ఫ్రా ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మిస్ వరల్డ్ పోటీదారులు సహా మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిస్కోవా, మిస్ వరల్డ్ లిమిటెడ్ జూలియా మోర్లీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మోర్లీ ఫార్చ్యూన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ అధిపతి డాక్టర్ రామకృష్ణ, సరూర్ నగర్ విక్టోరియా మెమోరియల్ హోమ్ ఆధునీకరణ కోసం రూ. కోటి 85 లక్షల చెక్కును అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులకు 20 రకాల వస్తువులతో కూడిన కిట్‌లను మిస్ వరల్డ్ పోటీదారులు అందజేశారు. ఈ సమయంలో చిన్నారులు కంటతడి పెట్టుకోగా పోటీదారులు ఓదార్చారు.

## ఆర్‌జియుకెటి మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో కోర్సులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే28:** మహబూబ్‌నగర్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సిఎస్ఇ(ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్ అండ్ మెషిన్ లెర్నింగ్), సిఎస్ఇ డాటా సైన్స్) ప్రారంభం కానున్నాయని విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వుల్లో వెల్లడించారు.

## పంట నష్టాలకు రూ.51,528 కోట్లు : మంత్రి తుమ్మల

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత రెండు నెలలుగా పలుధఫాలుగా వడగళ్ల వాన, అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారంగా 51.528 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రైతు వారీ పంటనష్టం అంచన వేసిన వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 41,361మంది రైతులకు సంబంధించి 51,528 ఎకరాలలో పంట నష్టం సంభవించిందని అంచనా వేశారన్నారు. ఇందులో వరి 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, ప్రత్తి 4753 ఎకరాలు మరియు ఇతర పంటలు 477 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారన్నారు. ఇందులో భాగంగా పంట నష్టంకు సంబంధించిన సర్వే నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడమైనదని వెల్లడించారు. దీనికి సంబంధించిన 51.528 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు.

## యువ వికాసం తొలి దశలో రూ.50 వేల విలువైన యూనిట్లకు ప్రాధాన్యత

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** యువ వికాసం పథకంలో భాగంగా మొదటి ప్రాధాన్యత కింద 50 వేల రూపాయల పెట్టుబడితో ప్రారంభమయ్యే చిన్న తరహా వ్యాపారాలకే ఇవ్వాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. తదుపరి లక్ష రూపాయల విలువ కలిగిన యూనిట్లను మంజూరు ఇవ్వనున్నట్లు తెలిసింది. జూన్ 2 సందర్భంగా పంపిణీ చేసే శాంక్షన్ లెటర్లలో ఎక్కువగా రూ. 50 వేల పెట్టుబడితో మొదల య్యే వ్యాపారాలు ఉంటాయని తెలుస్తున్నది. ఈ పథకానికి వచ్చిన దరఖాస్తుల్లో మెజార్టీకిరాణ దుకాణాలను ఏర్పాటుకు వచ్చాయి. ఆ తరువాత ఆవులు, గేదెల పెంపకానికి సంబంధించిన యూనిట్లకు దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16 లక్షల మంది దరఖాస్తు చేసుకు న్నారు. అందులో అర్హులైన సుమారు 8 లక్షల మందిని ఎంపిక చేస్తున్నారు. అయితే తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధి పొందేందుకు సిద్ధం గా ఉన్న యువతను ముందుగా ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వంనిర్ణయించింది. అందులో భాగంగా కిరాణషాపులకు ప్రయారిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

## ఎల్ఐసికి రూ. 48,151 కోట్ల లాభం

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ఎల్ఐసీకి లాభాల్లో పెరుగుదల చోటు చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తుది లెక్కలను బోర్డు ఆమోదించింది. ఈ మేరకు దీనికి సంబంధించి బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ కాలానికి గాను పన్ను తర్వాత లాభం (పిఎటి) రూ. 48,151 కోట్లుగా ఉంది. ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 18.38 పెరుగుదల నమోదైంది. 2023-24 సంవత్సరానికి ఎల్ఐసీ లాభం రూ. 40,676 కోట్లుగా ఉంది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి వాటాదారుల ఆమోదానికి లోబడి ఒక్కో షేరుకు రూ.12/ డివిడెండ్‌ను డైరెక్టర్ల బోర్డు సిఫార్సు చేసింది. అలాగే మొదటి సంవత్సరం ప్రీమియం ఆదాయంలో మార్కెట్ వాటా పరంగా లీడర్‌గా కొనసాగుతోంది. మొత్తం మార్కెట్ వాటా 57.05 శాతంగా ఉంది. ఇదే సమయంలో వ్యక్తిగత వ్యాపారంలో 37.46 శాతం, మరియు గ్రూప్ వ్యాపారంలో 71.19 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. ఇక మొత్తం ప్రీమియం ఆదాయం రూ. 4,88,148 కోట్లు కాగా, అంతకుముందు సంవత్సరానికి రూ.4,75,070 కోట్లుగా ఉంది. ఈ నేపథ్యంలో మొత్తం వ్యక్తిగత వ్యాపార ప్రీమియం రూ. 3,19,036 కోట్లకు పెరుగుదల నమోదైంది. ఇది గత సంవత్సరంతో పోల్చదగిన కాలానికి రూ. 3,03,768 కోట్లుగా ఉంది. గ్రూప్ వ్యాపారం విషయానికి వస్తే మొత్తం ప్రీమియం ఆదాయం రూ. 1,69,112 కోట్లు కాగా, అంతకు ముందు ఏడాది రూ. 1,71,302 కోట్లుగా రికార్డయింది. ఇక వ్యక్తిగత విభాగంలో మొత్తం 1,77,82,975 పాలసీలు అమ్ముడయ్యాయి.

## రోడ్డు ఆక్రమణపై హైడ్రా చర్యలు..గోడ కూల్చివేత



**ఘట్‌కేసర్, మే 28, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ జైపురికాలనీలో రోడ్డు ఆక్రమించి నిర్మించిన గోడను బుధవారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఘట్‌కేసర్ సర్వేనంబర్లు 559, 563, 566 లో1968 సంవత్సరంలో జైపురికాలనీ పేరుతో లేఔట్ చేసి ప్లాట్లు విక్రయించగా పలువురు స్థలాలు కొనుగోలు చేశారు. ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న లేఔట్‌లో ప్రజాఅవసరాల కోసం పార్కు, రోడ్లకు స్థలం వదిలిపెట్టారు. ఈలౌఔట్ భూమిలో స్థలాలపై వివాదం ఏర్పడగా కొందరు పట్టాదారులు చుట్టూ ప్రహారిగోడ నిర్మించి లేఔట్‌లో రోడ్లను మూసి వేశారు. రెండు వైపులా గోడ నిర్మించగా ప్లాట్లు కల్గిన వారు అక్కడికి వెళ్ల లేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సంవత్సరాలుగా జైపురి లేఔట్ ప్లాట్లు, పట్టాభూమి అంటూ ఇరువర్గాల మధ్య గొడవలు జరిగి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి. ఈనేపథ్యంలో ప్లాట్ల యాజమానులు-జర్నలిస్టు ఎం.సోమయ్య, రామారావు, జగన్ తదితరులు గత ఫిబ్రవరిలో లేఔట్‌లో రోడ్డు కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన రోడ్డు ఆక్రమణకు గురైనట్లు నిరా ్ధరించారు. బుధవారం హైడ్రా అధికారులు సైదులు, బాసిరెడ్డిలు లేఔట్‌లో రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను జేసీబీతో కూల్చి వేయించారు. మరో వైపు కూడా విచారణ జరిపి రోడ్డుపై నిర్మించిన గోడ కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలి



ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌ను కలిసిన బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ళ మహేందర్

**హైదరాబాద్, మే 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ ప్రక్రియపై అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు సెవెళ్ళ మహేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో సెవెళ్ళ మహేందర్ మాట్లాడుతూ డొనేషన్ల పేరిట విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతూ కళాశాలల యాజమాన్యాలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. విద్యా రంగం వ్యాపారంగా మారిపోతున్న ఈ పరిస్థితిని వెంటనే నియంత్రించాలన్నారు. నిర్దిష్ట నిబంధనలతో పాటు ఫీజు నియంత్రణ కమిటీలు కఠినంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంజినీరింగ్ సీట్ల భర్తీలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆన్‌లైన్ కౌన్సిలింగ్ ప్రక్రియను మరింత మెరుగుపరచాలని, ఎలాంటి అన్యాయాలుచోటు చేసుకోకుండా విద్యార్థులకున్యాయం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

# 'హరి హర వీరమల్లు' నుంచి 'తార తార' సాంగ్ రిలీజ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక యోధుడిగా కనువిందు చేయనున్న ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న హరి హర వీరమల్లులో బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాపై



అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, మూడు గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మరో గీతం తార తార విడుదలైంది. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమాన్ని చిత్ర బృందం చెన్నైలో ఘనంగా నిర్వహించింది. తార తార గీతం మనసుని హత్తుకునేలా శ్రావ్యంగా ఉంది. పవన్ కళ్యాణ్, నిధి అగర్వాల్‌పై చిత్రీకరించిన ఈ గీతం వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇద్దరి జోడి చూడటానికి ఎంతో అందంగా ఉంది. లిరికల్ వీడియోలో భారీతనం కనిపిస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం హృద్యంగా ఉంది. శ్రీహర్ష తన సాహిత్యంతో పాటకు మరింత అందం తీసుకొచ్చారు. లిప్సిక భాష్యం, ఆదిత్య అయ్యంగార్ ఈ గీతాన్ని ఆలపించిన తీరు కట్టిపడేసింది. ప్రస్తుతం తార తార గీతం సామజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. తార తార గీతావిష్కరణ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత ఎ.ఎం.రత్నం మాట్లాడుతూ, చెన్నైతో నాకు మంచి అనుబంధం ఉంది. పలు గొప్ప తెలుగు సినిమాలను తమిళ ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాను. అలాగే పలు తమిళ సినిమాలను తెలుగులో ప్రేక్షకులకు అందించాను. ముఖ్యంగా ఇండియన్ చిత్రం నిర్మాతగా నాకుఎంతో పేరు తీసుకొచ్చింది. సినిమా ద్వారా వినోదంతో పాటు, ఏదో ఒక సందేశం ఇవ్వాలనేది నా తపన.90 శాతానికిపైగా నా సినిమాలు విజయం సాధించాయి. నా కుమారుడు జ్యోతికృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పాలి. చిన్న వయసులోనే గొప్ప కథలతో ప్రముఖ దర్శకులను మెప్పించాడు. ఇప్పుడు పాన్ ఇండియా చిత్రం హరి హర వీరమల్లు బాధ్యతను క్రిష్ దగ్గర నుంచి తీసుకొని, సినిమా అద్భుతంగా రావడంలో కీలక పాత్ర పోషించాడు. ఐదు సంవత్సరాలు ఎంతో కష్టపడి ఈ సినిమాని రూపొందించాము. కీరవాణి అద్భుతమైన సంగీతం అందించారు. ఈ సినిమా కోసం ఐదేళ్లు వెచ్చించిన నిధి అగర్వాల్ కి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. చిత్ర సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి మాట్లాడుతూ, ఎ.ఎం.రత్నం ముఖం లో నేను కోపం ఎప్పుడూ చూడలేదు. శాంతంగా, చిరునవ్వుతో ఉంటారు. ఆయన రియల్ హీరో. హరి హర వీరమల్లు సినిమా ఘన విజయం సాధిస్తుందని నేను నమ్ముతున్నాను. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా పవర్ కనిపించాలి.

# 'షష్టిపూర్తి' గొప్ప చిత్రం అవుతుంది: రాజేంద్ర ప్రసాద్

అమరావతిలో ఈ సినిమాకు సంబంధించిన మొదటి ఫంక్షన్ చేయాలని అనుకున్నాం. కానీ అక్కడ అన్ని సౌకర్యాలు లేవు. అందుకే విజయవాడలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించాం. ట్రైలర్ చూస్తే ఇది ప్రతి ఇంట్లో జరిగే కథ అని అందరికీ అర్థం అవుతుంది. ప్రతీ ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుంది. తెలుగు వారిని ప్రతిబింబించేలా ఈ మూవీ ఉంటుంది. నేను ఒకప్పుడు చిత్రాలు నిర్మించాను. కానీ ఇప్పుడు సినిమా నిర్మాణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడున్నంత టెక్నాలజీ అప్పుడు లేదు. అయితే ఇప్పుడున్నంత డిస్టర్బెన్స్ కూడా అప్పట్లో లేదు. నేను ఇప్పటికీ షాట్ చేసిన తరువాత మానిటర్ చూడను. నాకు ఆ అలవాటు కూడా లేదు. మానిటర్ చూసుకుని వన్స్ మోర్ అని చెప్పాల్సింది దర్శకుడు. మన పని మనం చేసుకోవాలి. అభివృద్ధిని మనం మంచి కోసం వాడుకోవాలి. ప్రస్తుతం మన తెలుగు సినిమా ప్రపంచస్థాయికి వెళ్లింది. థియేటర్లు మూసేయడం అనేది ఒక్కరి నిర్ణయంతో జరిగేది కాదు. అందరూ కలిసి సమిష్టిగా తీసుకోవాలి. కానీ తప్పుడు విధానంలో వార్త బయటకు వచ్చింది. అందుకే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించారు. నేను ఇంగ్లీష్ భాషలో క్విక్ గన్ మురుగన్ అనే చిత్రంలో నటించాను. ఎమిరైట్స్ ఫ్లైట్స్‌లో నా చిత్రం ఉంటుంది. ఇప్పటికే అందులోంచి మూడు పార్టులు రావాల్సి ఉంది. రెండో పార్ట్ త్వరలోనే స్టార్ట్ కాబోతోంది. ఏఐ టెక్నాలజీని వాడి అందులో కొన్ని సీన్లను తీయబోతోన్నారు. మూడు సీన్ల కోసం నన్ను సింగిల్ మూవీకి అడిగారు. నేను చేస్తే ఆ పాత్రకు ప్రాధాన్యం వస్తుందంటే కచ్చితంగా చేస్తాను. సింగిల్ మూవీలో నా కారెక్టర్ చూసి అల్లు అరవింద్ ఫోన్ చేసి అభినందించారు. పాత్రతో పాటు పాత్రను ఎవరు పోషించారు? అన్నది కూడా ముఖ్యమని అరవింద్ గారు అన్నారు. మనం ఏ పాత్రలు పోషించినా.. ఆ పాత్రలే జనాలకు గుర్తుండాలనేది నా సూత్రం. ఇది నా ఐదో జనరేషన్. ఇప్పటికీ నా కోసం షష్టిపూర్తి లాంటి పాత్రలు రాస్తున్నారంటే అది నా అదృష్టం. పిల్లలు తల్లిదండ్రుల పెళ్లిని చూడలేరు. కానీ 60వ పెళ్లిని మాత్రం చూడగలరు. అందుకే షష్టిపూర్తికి అంత ప్రాధాన్యం. ఇలాంటి చిత్రాల్ని, పాత్రల్ని అస్సలు మిస్ అవ్వకూడదు. కళ అనేది సముద్రం. మనం సముద్రం మొత్తాన్ని తాగగలమా? ఈదగలమా?.. కళ కూడా అంతే. ఎప్పటికీ ఆకలి, దాహం తీరదు. ఎప్పటికీ నటుడిగా ఇంకెన్నో పాత్రలు పోషించాలి. షష్టిపూర్తి చిత్రంలో మూడు రకాల వేరియేషన్స్ ఉంటాయి. లేడీస్ టైలర్ మూవీ మాడ్యులేషన్, గెటప్ కావాలని దర్శకుడు పట్టుబట్టుకుని కూర్చున్నారు. కానీ నా యాటిట్యూడ్ వల్ల ఆ పాత్రను ఈజీగా పోషించాను. ఇందులో మూడు ఏజ్ గ్యాప్‌లను చూపించాం. ఇది నాకు ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఇళయరాజామాతో పోటీ పడి మరీ సంగీతాన్ని అందించారు. కీరవాణి మా కోసంపాట రాశారు. కీరవాణి పాట రాస్తున్నారా? అని రాజా కూడా షాక్ అయ్యారు. మా షష్టిపూర్తి కోసం రాజా అద్భుతమైన పాటల్ని అందించారు. చైతన్య ప్రసాద్ మంచి సాహిత్యాన్ని ఇచ్చారు. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో పెద్ద పెద్ద హీరోలు, మహానుభావులంతా ఉన్నారు. మీకంటూఉన్న ప్రత్యేకత ఏంటి? అని అన్న ఎన్టీ రామారావు నన్ను అడిగారు.



## జూన్ నుంచి 'పాన్ ఇండియా ప్రాజెక్ట్' షురూ

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తన అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌తో అలరించడానికి సిద్ధంగా వున్నారు. ఇది పూర్తి స్థాయి మాస్, కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ఉండబోతోంది. పూరి సిగ్నేచర్ స్టైల్, విజయ్ సేతుపతి మాగ్నెటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ బ్లెండ్ చేసే ప్రత్యేకమైన కథాంశంతో విభిన్నంగా ఉంటుంది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. మొత్తం కాస్ట్ అండ్ క్రూ ఇప్పటికే ఖరారు కావడంతో, టీం ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై అంతటా రెక్కీ చేస్తున్నారు. మొదటి షూటింగ్ షెడ్యూల్ కోసం సరైన లొకేషన్ల కోసం వెతుకుతున్నారు. జూన్ చివరి వారంలో షూటింగ్ ప్రారంభంకానున్న ఈ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన కొలాబరేషన్‌ని సూచిస్తోంది. పూరి జగన్నాథ్ క్రియేటివ్, టెక్నికల్ అంశాలన్నింటి లోనూ చాలా కేర్ తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా ఎంచుకున్న లొకేషన్లు విజువల్ స్టోరీ టెల్లింగ్ కి వున్న ప్రాధాన్యత సూచిస్తున్నాయి. విజయ్ సేతుపతి, ఇతర ప్రధాన నటుల మొదటి షెడ్యూల్ నుంచే షూటింగ్‌లో పాల్గొనున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. ఎవర్‌గ్రీన్ నటి టబు, శాండల్‌వుడ్ డైనమో విజయ్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం హిందీ భాషలలో విడుదల కానుంది. తారాగణం: విజయ్ సేతుపతి, టబు, విజయ్ కుమార్ సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్.





# కాశీలో 'కన్నప్ప' సాంగ్ ఆవిష్కరణ

డైనమిక్ స్టార్ విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప సినిమాను జూన్ 28న రిలీజ్ చేయబోతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ప్రమోషన్స్‌లో విష్ణు మంచు కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఆల్రెడీ యూఎస్‌లో కన్నప్ప టూర్‌ని ముగించుకుని వచ్చారు. తాజాగా మోహన్ బాబు మనవరాళ్లు, విష్ణు కూతుళ్లు అరియానా, వివియానా పాడిన శ్రీకాళహస్తి పాటను విడుదల చేశారు. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి వచ్చిన ప్రతీ పాట పాజిటివ్ వైబ్స్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. అరియానా, వివియానా పాడిన ఈ ప్రత్యేకమైన పాటను బుధవారం (మే 28) నాడు కాశీ విశ్వనాథ ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మోహన్ బాబు, దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్, రచయితలు తోట ప్రసాద్, ఆకుల శివ, అర్పిత్ రాంకా వంటి వారు పాల్గొన్నారు. స్టీఫెన్ దేవస్సీ స్వరపరిచిన ఈ పాట భక్తి, భావోద్వేగాలను ప్రతిబిం బించేలా ఉంది. సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ సాహిత్యం శ్రీ కాళ హస్తి దైవిక వారసత్వాన్ని అందంగావివరిస్తుంది. విష్ణుమంచు కుమార్తెలు అరియానా, వివియానా ఈ పాటకు ప్రాణం పోస్తూ ప్రతీ ఒక్కరి హృదయాల్ని తాకేలా ఆలపించారు. ఇక ఈ లిరికల్ వీడియోలో అరియానా, వివియానా కనిపించిన విజువల్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. సుందరమైన ప్రదేశాలలో చిత్రీకరించిన ఓ విజువల్ వండర్‌గా అందరినీ మెప్పించనుంది. ఈ పాట రాబోయే తరాలకు శ్రీ కాళ హస్తి ఆలయ విశిష్టతకు చిహ్నంగా ఉంటుంది.

# 'కరాటే కిడ్' ఫ్రాంచైజ్ మరోసారి తెరపైకి

ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను ఉన్న కరాటే కిడ్ ఫ్రాంచైజ్ మరోసారి తెరపైకి రాబోతోంది. మే 30న విడుదలకానున్న కరాటే కిడ్: లెజెండ్స్ చిత్రం కోసం లెజెండరీ యాక్షన్ హీరో జాకీ చాన్ మరోసారి మిస్టర్ హాన్గా మళ్లీ కనిపించబోతున్నారు. ఆయన శిక్షణలో ఈసారి హీరోగా కనిపించేది బెన్ వాంగ్ ఈ సినిమాకు హిందీ డబ్ ఓ విశేషం. అజయ్ దేవగణ్ తన గొంతు ఇస్తుండగా, అతని కుమారుడు యుగ్ దేవగణ్ ఈ ప్రాజెక్ట్ ద్వారా తన వాయిస్ ఓవర్ డెబ్యూ చేస్తున్నాడు. ఒకే సినిమాలో తండ్రికొడుకు కలిసి పని చేయడం ఇదే తొలిసారి! తాజాగా విడుదలకు ముందు జాకీ చాన్, బెన్ వాంగ్తో కలిసి అజయ్-యుగ్ మాట్లాడారు. అజయ్ మాట్లాడుతూ, తన తండ్రి వీరు దేవగణ్ గురించీ, తనకు మిస్టర్ మియాగీలా ప్రేరణ ఇచ్చిన గురువు అని గుర్తు చేసుకున్నారు. ఆయన కోరికే నన్ను నటుడిని చేసింది అన్నారు. దానికి జాకీ స్పందిస్తూ, నాకు ఒక్క మిస్టర్ మియాగీ కాదు, ఎందరో గురువులున్నారు. అందరికీ నేన్ ఈ రోజు కృతజ్ఞుడిని అన్నారు. యుగ్ తన తండ్రిని జీవితంలో లైట్‌గా అభివర్ణించాడు - అయన లేనిదే నేన్ ఏమీ కాదు అని తెలిపాడు. యాక్షన్ ఎలాగా మారింది? అనే ప్రశ్నకు అజయ్ చెబుతూ- మునుపటిలా కేబుల్స్ లేకుండా, గ్రాఫిక్స్ లేకుండా చేసే రోజుల్లో పని చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు టెక్నాలజీ వలన తేలికైంది. కానీ హార్డ్ వర్క్‌కి మాత్రం ఎప్పుడూ ప్రత్యామ్నాయం లేదు, అని స్పష్టంగా చెప్పారు. జాకీ చాన్ మాత్రం ఇండియాలో కంగ్ ఫూ యోగా షూటింగ్, బాలీవుడ్ స్టైల్ డ్యాన్స్ గురించిన మధుర జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. "బాలీవుడ్ డ్యాన్స్ చూసినప్పుడల్లా ఆశ్చర్యపోతా. అంతటి టైమింగ్, గ్రేస్, రిథమ్ ఉంటాయ్. ఒకసారి మాత్రం నేను ఫుల్ డ్యాన్స్ సీక్వెన్స్ చేయాలి అనిపించింది," అని నవ్వుతూ చెప్పారు. యాక్షన్ - డ్యాన్స్ రెండూ ఒకే కిందికి వస్తాయన్నారు.






# 'ఆపరేషన్ సింధూర్' సాంగ్ లాంచ్

దేశం మీద ప్రేమ కలిగి ఉండటం ఒక వంతు అయితే ఆ ప్రేమను ప్రజలందరికీ ఉపయోగపడేలా ఏదో ఒక రూపంలో బయట పెట్టడం సామాన్య విషయం కాదు. ఇటీవల కాలంలో మన దేశ పౌరులపై జరిగిన దాడికి సమానంగా మన దేశ జవాన్లు పాకిస్తాన్ టెర్రరిస్ట్ క్యాంపులపై చేసిన ఆపరేషన్ సింధూర్ ను ఇన్స్పిరేషన్‌గా తీసుకుంటూ ప్రముఖ ఆరోగ్య డైట్ లక్ష్మణ్ పూడి ఓ పాట రూపంలో తన దేశభక్తిని చూపారు. ప్రసాద్ రచించిన ఈ పాటకు రమేష్ సంగీతాన్ని అందించగా కృష్ణ సినిమాటోగ్రాఫర్‌గా చేశారు. ఉమా శంకర్ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటకు మనికంట ఎడిటింగ్ చేయగా సత్య శ్రీనివాస్ సంగీత సహకారాన్ని అందించారు. లక్ష్మణ్ పూడి ఈ పాటకు స్వరాన్ని జోడించి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ ఈ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి జెడి లక్ష్మీనారాయణ, నటుడు అలీ, మేజర్ ఒబెరాయ్, జేఏసీ చైర్మన్ అంజిబాబు, నిర్మాత కూనిరెడ్డి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మిత్రుడు లక్ష్మణ్ ఆపరేషన్ సింధూర్‌పై మన దేశ జవానుల గురించి పాట పాడటం, ఆ పాట లాంచ్ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించడం ఎంతో సంతోషకరం. దేశంలోని జవాన్ల పట్ల ఆయనకు ఉన్న గౌరవాన్ని ఒక పాట రూపంలో మనకు చూపించారు. దానికి వారిని అభినందిస్తున్నాను. ఆయన ఎంత కాలం కేవలం ఆరోగ్యం గురించి డైట్ చెప్తారు అనుకున్నాను కానీ ఆయన తండ్రి కమ్యూనిస్టు పార్టీలో ఉండటం వల్ల ఆయన భావజాలాలు, దేశం కోసం ఏమైనా చేయాలి అనే తపన లక్ష్మణ్‌లో ఈ పాట ద్వారా కనిపించాయి. మనం ముఖ్యంగా రైతులకు, జవాన్లకు ప్రాముఖ్యత ఇస్తూ జై కిసాన్ జై జవాన్ అనే నినాదంతో వారిని గౌరవిస్తాము. గడియారంలో మధ్యాహ్నం 12 గంటలకు భోజనం చేసే సమయానికి ముల్లులు నమస్కరిస్తూ రైతులకు గౌరవం ఇస్తాయి. అదేవిధంగా రాత్రి 12 గంటలకు మన ప్రశాంతంగా పడుకోవడానికి గల కారణంమైన జవాన్లకు మరోసారి అదే గడియారంలోని ముల్లులు నమస్కరిస్తూ వారికి గౌరవం ఇస్థాయి. కొన్ని దేశాలలో కచ్చితంగా వారి జీవితంలోని రెండు సంవత్సరాలు మిలటరీలో ఉంటారు. అదే రూల్ మనదేశంలో కూడా ఉండాలని సూచిస్తున్నాను. అలాగే ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి నా నమస్కారం అన్నారు. జేఏసీ చైర్మన్ అంజిబాబు మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి విచ్చేసిన జెడి లక్ష్మీనారాయణకి, ఆలీకి, ఒబెరాయ్‌కి నా నమస్కారం. నేను గతంలో ఎంతో అనారోగ్యానికి గురయ్యాను. లక్ష్మణ్ తన డైట్ ద్వారా నన్ను మళ్లీ మామూలు మనిషిని చేశారు. దేశానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేస్తున్న జెడిని, ఒబెరాయ్‌ని నేను ఫాలో అవుతూ ఉంటాను. దేశంపై తనకున్న భక్తిని తెలిపేలా పాటను చేసి అందరి ముందుకు తీసుకువచ్చిన లక్ష్మణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ, మీడియా మిత్రులకు అందరికీ నా నమస్కారం. మంచి కంటే చెడు వేగంగా ప్రజల్లోకి వెళుతుంది. అలాంటిది లక్ష్మణ్ అందరికీ ఉపయోగపడేలా ఆరోగ్యాన్ని పంచుతున్నారు. నాకు తెలిసి లక్ష్మణ్ కూడా ఒకప్పుడు చాలా బరువు ఉండేవారు. కానీ ఆయన ఆ కష్టాన్ని అధిగమించి నేడు అదే మార్గంలో ఎంతో ఆరోగ్యంగా అందరికి ఉపయోగపడేలా డైట్ అందిస్తూ ఎంతో గొప్ప సేవ చేస్తున్నారు. దేశంపై భక్తితో ఆయన చేసిన పాటను లాంచ్ చేయడం కోసం రావడం జరిగింది. ఈరోజు స్టేజిపై ఉన్న రియల్ హీరోలను కలవడం మరింత సంతోషాన్ని కలగజేస్తుంది. గడియారంలో కూడా రెండు చేతులు జోడించి నమస్కరించే ఒక గొప్ప విషయాన్ని నేడు మనకు తెలియజేసిన జెడికి ప్రత్యేక ధన్యవాదాలు. లక్ష్మణ్‌లో ఒక మంచి గాయకుడున్నాడు, నటుడు ఉన్నాడు. ఆయన మీద ఉన్న అభిమానంతో ఈరోజు ఇక్కడికి రావడం జరిగింది. ఒబెరాయ్ తెలుగులో మాట్లాడుతుంటే ఎంతో గర్వంగా అనిపిస్తుంది. మీరు అనుకున్నది సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. మేజర్ ఒబెరాయ్ మాట్లాడుతూ, నేను ఆపరేషన్స్ సింధూర్ గురించి మాట్లాడినప్పుడు ప్రజలు నేను మాట్లాడిన విషయాలను బాగా యాక్సెప్ట్ చేశారు. వారి అభిమానానికి నా కృతజ్ఞతలు. లక్ష్మణ్ అందించినపాట చాలా బాగుంది. అవసరమైతే దేశంకోసం మనమంతా జవాన్లవలే ముందుకు వెళ్లాలి. ప్రపంచంలోనే మన ఆర్మీ ఎంతో బలమైనది.




# 'కృష్ణ లీల' సెకండ్ సింగిల్

యంగ్ ట్యాలెంటెడ్ దేవన్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న సూపర్ నేచురల్ లవ్ స్టోరీ కృష్ణ లీల. తిరిగొచ్చిన కాలం అనేది ట్యాగ్ లైన్. ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తోంది. బేబీ వైష్ణవి సమర్పణలో మహాసేన్ విజువల్స్ బ్యానర్‌పై జ్యోత్స్న జి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కథ మాటలు అనిల్ కిరణ్ కుమార్ జి అందించారు. ఈ సినిమా టైటిల్ మోషన్ పోస్టర్, టీజర్, ఫస్ట్ సింగిల్‌కి కి అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా జే.డి. లక్ష్మీ నారాయణ కృష్ణ లీల సెకండ్ సింగిల్ "సూరి ఓరి సూరి సాంగ్‌ని లాంచ్ చేశారు. స్టార్ కంపోజర్ భీమ్స్ ఈ సాంగ్‌ని ఎనర్జిటిక్ మోటివేషనల్ సాంగ్ కంపోజ్ చేశారు. భాస్కర భట్ల రవి కుమార్ అద్భుతమైన సాహిత్యం రాశారు. జెస్సీ గిఫ్ట్ ఎనర్జిటిక్ పాడారు. ఈ సాంగ్ ఇనిస్టెంట్ హిట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, యువత కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావాలనే సందేశం ఈ సాంగ్‌లో ఉంది. భాస్కర భట్ల రవి కుమార్ అద్భుతమైన సాహిత్యం రాశారు. ఈ సాంగ్ సినిమాకే కాదు యువతరానికి కూడా ముందుకు తీసుకెళ్లడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. హీరో, డైరెక్టర్ దేవన్ మాట్లాడుతూ, ధైర్యం, ప్రజా సేవకు ప్రతీక అయిన గౌరవనీయులైన జె.డి. లక్ష్మీ నారాయణ మా చిత్రం కృష్ణ లీల నుండి సూరి ఓరి సూరి సాంగ్ విడుదల చేయడం చాలా ఆనందంగా వుంది. ఆయన ఇక్కడకి రావడం ఈ కార్యక్రమాన్ని మాత్రమే కాకుండా, మా మొత్తం టీంకి స్ఫూర్తిని పెంచింది. తన నిర్భయ సేవ, సత్యం పట్ల నిబద్ధత ద్వారా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చిన వ్యక్తిగా, ఆయన మా పాటను ఆవిష్కరించడం మేము ఎప్పటికీ గుర్తుంచుకునే క్షణం. సూరి ఓరి సూరి పవర్ ఫుల్ మోటివేషనల్ సాంగ్. ఒక తొలి దర్శకుడిగా, తెలుగు సినిమా లెజెండ్స్ నాకు గొప్ప ప్రేరణగా నిలిచారు. వారు మనకు గొప్పగా కలలు కనడం నేర్పారు. రాజమౌళి విజన్, సుకుమార్ పొయిటిక్ నరేషన్, సందీప్ రెడ్డి వంగా రా అండ్ ఇంటెన్స్ ప్రజెంటేషన్.. ఇవన్నీ నా ప్రయాణాన్ని బలంగా ప్రభావితం చేశాయి. కృష్ణ లీల ఆ అభిమానం నుండి పుట్టింది. కృష్ణ లీల యూనిట్ తరపున మాకు మద్దతు ఇచ్చినందుకు జె.డి.లక్ష్మీ నారాయణకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారి ఆశీర్వాదాలతో ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని ఆశిస్తున్నాము అన్నారు. నటీనటులు: దేవన్, ధన్య బాలకృష్ణన్, వినోద్ కుమార్, పృథ్వి (పెళ్లి), రవి కాలే, తులసి, 7ఆర్ట్ సరయు, ఆనంద్ భరత్.






## ప్రయత్నిస్తే సాధించలేనిది లేదు..



వలసవెల్లి ప్రైవేటు కాలేజీల్లో చేరినా ఆర్థికంగా ఎలాంటి ధోకా ఉండదు. కానీ ఆమె సాధికారత కోసం కలలు కన్నారు. ఆ విషయాన్నే భర్తతో పంచుకోగా ఆయనా మద్దతు తెలిపారు. వారు స్థాపించిన పాఠశాల స్వర్ణోత్సవాలను చేసుకుంది. తెనాలికి చెందిన రంగలక్ష్మి ఎంఏ చేసిన అనంతరం విద్యాభిలాషతో ఎంఈడీ చేశారు. భర్త దాసరి వెంకటప్రకాశ రావు ఎమ్మెస్సీ(మాథ్స్), బీఈడీ చేశారు. ఎక్కడో ఉద్యోగాలు చేయటంకన్నా తమ ప్రాంతంలోనే పాఠశాలను ఏర్పాటు చేద్దామన్న భర్త ఆలోచనకు మద్దతునిచ్చారు ప్రకాశరావు. 1973లోనే తెనాలిలో నెహ్రూనికేతన్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలను కలిగి ఉంది. అప్పట్లో తెనాలిలో ఒకటిరెండు ప్రైవేటు పాఠశాలలు ఉండేవి. అయినా తమదైన విద్యలో పాఠశాలను నడపాలనుకున్నారు. 12 మంది విద్యార్థులతో చిన్న గదిలో స్కూలుమొదలు ఉన్నారు.


ఆమె ఎం.ఎ, ఎంఈడీ, ఆయన ఎమ్మెస్సీ, బీఈడీ.. ఇదీ అయిదు దశాబ్దాల కిందట. ప్రభుత్వ ఉద్యోగం సాధించినా, తమతోపాటు బాగా చెప్పే మరికొందరు టీచర్లను నియమించారు. బోస్ రోడ్డులో మొదటి పాఠశాల ప్రారంభం, తర్వాత పట్టణంలోనే మరో రెండు శాఖలకు విస్తరించారు. వీళ్ల శిష్యులు వేలల్లోనే. అందులో టీచర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు వందల్లో, ప్రస్తుతం ఈ మూడింటిలో 2500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 200 మంది ఉపాధి పొందుతున్నారు. విద్యా సంస్థ 2023లో స్వర్ణోత్సవ సంబరాలను పూర్తిచేసుకుంది. ఇప్పటికీ విద్యాసంస్థల నిర్వహణలో భాగమవుతున్నారు రంగలక్ష్మి. మరోవైపు తమ కుమారులను ఉన్నత విద్యావంతులుగా ముగ్గురు తీర్చిదిద్దారు. బిట్స్ పిలానిలో ప్రొఫెసర్‌గా పనిచేసిన పెద్దబ్బాయి మురళీకాంత్, ఆయన సతీమణి గీత ప్రస్తుతం స్కూల్ నిర్వహణను చూస్తున్నారు. భర్త, కుటుంబ సభ్యుల సహకారంతో విజయం సాధించగలిగాను. నాటితో నేడు మహిళల ప్రస్థానం చాలా మెరుగ్గా ఉంది. ప్రతి మహిళా తనకు నచ్చిన రంగంలో ముందుకు సాగాలి. ఇందుకు క్రమశిక్షణ, నమ్మకం, ప్రణాళిక, పట్టుదల ఉండాలి. కష్ట పడటంతో పాటు కుటుంబ సభ్యుల నమ్మకం, వారి సహకారాన్ని పొందటం అవసరం. ఆ విధంగా ప్రయత్నిస్తే సాధించ లేనిది లేదు అని చెబుతారు రంగలక్ష్మి. □

## పాక్ ఉగ్రవాదంపై గళమెత్తిన ధీర



**పహల్గాం ఉగ్రదాడికి సమాధానంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైన విషయం తెలిసిందే ! ఈ క్రమంలో పాకిస్థాన్ ఓవైపు మన దేశంపై దాడులు చేస్తూనే.. మరోవైపు తమకేమీ తెలియదంటూ నక్కజిత్తులు ప్రదర్శించారు. ఇలాంటి పాక్ మోసపూరిత వైఖరిని ప్రపంచం ముందు బట్టబయలు చేశారు భారత దౌత్యవేత్త అనుపమా సింగ్. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)' తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ ఉగ్రవాదంపై గళమెత్తారామె. తూటాల్లాంటి మాటలతో శత్రుదేశంపై విరుచుకుపడ్డారు. ఇలా ఆమె చేసిన ప్రసంగం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంతకీ ఎవరీ అనుప? తెలుసుకుందాం ..**

**ఉగ్రవాదాన్ని అంతం చేసింది! ...** పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్రంగా మారింది. అయినా తామే బాధితులమంటూ నటిస్తోంది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే కాదు.. దీని ద్వారా ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోంది. పాక్‌లో శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఏప్రిల్ 22న పహల్గాంపై జరిపిన దాడిలో 26 మంది అమాయక టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబ సభ్యులకళ్లెదుటే వాళ్లను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. ఇలాంటి ఉగ్రవాదులను మట్టుబెట్టి, వారి స్థావరాల్ని నేలమట్టం చేయడానికే భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టారు. ఈ రకమైన ఆ దేశంలోని సామాన్య పౌరులకు నష్టం, ప్రాణహాని జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ఇలా ఉగ్రదాడులకు తెగబడడమే కాదు.. సింధూ జలాల ఒప్పందంపైనా కట్టుకథలు అల్లుతోంది.. అని నిర్ధారించిన తర్వాతకథనాలు ప్రచారం చేస్తోంది. ఈ సందర్భంగా ఆమె చేసిన ప్రసంగం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనితో పలువురు అనుపమ స్పీచ్‌పై ప్రశంసలు కురిపిస్తు న్నారు. ఇలా ఇప్పుడే కాదు. గతేడాది మార్చిలో 'ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్ఆర్‌సి)' వేదికగా జరిగిన ఓ సదస్సులోనూ.. జమ్మూకశ్మీర్‌పై పాక్ చేసిన ఆరోపణల్ని తనదైన ప్రసంగంతో తిప్పి కొట్టారామె. అప్పుడూ ఆమె స్పీచ్ నెట్టింట్లో వైరలైంది.అధికారిక ఉద్యోగాన్ని కాదని! ఢిల్లీకి చెందిన అనుపమ చిన్నతనం నుంచి చదువు, ఇతర వ్యాపకాల్లో చురుగ్గా ఉండేది. సివిల్స్ చదవాలని, దేశానికి సేవ చేయాలని చిన్నతనంలోనే సంకల్పించుకున్న ఆమె.. మొదట్లో బీటెక్ పూర్తిచేసింది. చదువు పూర్తికాగానే ఓ ప్రకటన సంస్థలో కన్సల్టెంట్‌గా చేరిన ఆమె.. తనదైన పనితీరుతో అనతి కాలంలోనే సీనియర్ కన్సల్టెంట్‌గా పదోన్నతి పొందింది. నిజానికి ఆమె అంతిమ లక్ష్యం ఇది కాదు.. ఈ ఉద్యోగానికి రాజీనామా చేసి.. యూపీఎస్సీకి సన్నద్ధమవ డం ప్రారంభించింది. 2014లో తన కలను నిజం చేసుకున్న అనుపమ.. అదే ఏడాది 'లాల్‌బహదూర్ శాస్త్రి దౌత్యవేత్తగా పనిచేస్తోన్న ఆమె.. తనదైన పనితీరు, ప్రసంగాలతో ఎప్పటికప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. ఫైనాన్స్ విభాగంలో ఎంబిఎ పట్టా కూడా అందుకున్న అనుపమ. సివిల్స్‌లో చేరకముందు 'ఛార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్' ప్రోగ్రామ్ పూర్తి చేసింది. కార్పొరేట్ ఫైనాన్స్ వాల్యుయేషన్, పోర్ట్‌ఫోలియోల నిర్వహణ.. వంటి అంశాల్లో అనుపమకు పట్టుది. □








ఫ్యాషన్ ఫ్యాషన్

## మెడ నిండుగా రత్నాల హారం !

కాలంతో పాటు అమ్మాయిల అభిరుచులూ మారిపోతుంటాయి. ఒకప్పుడు యువతరం మెడలో కనీకనిపించని నగల్ని వేసుకోవడానికి ఆసక్తి చూపించేవారు. ఇప్పుడు మాత్రం మిగిలిన సందర్భాలు ఎలా ఉన్నా... వేడుకలూ, పండుగలప్పుడు మాత్రం సంప్రదాయంగా మెరిసిపోవాలనుకుంటున్నారు. ఆ సమయంలో పట్టుక జతగా ఆడంబరంగా ఆభరణాలు ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అందుకే, ఇప్పుడు హెవీ జ్యుయెలరీ హవా. అందులోనూ మెడ నిండుగా కనిపించేలా రెండు మూడు వరుసల్లో చేయించుకోవడమే ట్రెండు. అసలే బంగారం రేటు పెరిగింది... మరి అంత పెద్ద పుత్తడి కొని చేయించుకోగలమా అంటారా? ఇప్పుడా అవసరం లేదు. ఎందుకంటే ఇవి బంగారు పూతతో అలంకరించిన సిల్వర్‌లోనూ, 18, 14 క్యారెట్ల పసిడి రకాలుగానూ వస్తున్నాయి. ముత్యాలు, పచ్చలు, రూబీలు, కుందన్లు... వంటి నవరత్నాలను కూడా పొదువుకొని వరుసల్లో తయారై మురిపిస్తున్నాయి. అలాంటివాటిల్లో కొన్ని డిజైన్లు ఇవి మీకు నచ్చేశాయా?
















## గోధుమ మెరిపిస్తుంది



ముఖాన్ని మెరిసేలా చేయగలిగే యాంటీఆక్సిడెంట్లు మరెన్నో పోషకాలు గోధుమ పిండిలో మెండుగా ఉంటాయి. మరి దీన్ని సౌందర్య సాధనంగా ఎలా ఉపయోగించాలో చూద్దామా...

చర్మం మెరుపు తగ్గినప్పుడు లేదా మృదుత్వం దూరమైనప్పుడు గోధుమపిండికి మరొక పదార్థాన్ని కలిపిన మిశ్రమంతో సమస్యను తరిమేయొచ్చు. రెండు టేబుల్‌స్పూన్ల మెత్తని గోధుమపిండి, టేబుల్‌స్పూన్ తాజా మిల్క్ క్రీమ్ తీసుకోవాలి. దానికి తగినంత గులాబీ నీటిని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూత వేసి పావుగంట ఆరనివ్వాలి. ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రంచేస్తే చాలు. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మెనోపాజ్ దగ్గరపడుతున్నప్పుడు ఎదురయ్యే పిగ్మెంటేషన్ సమస్య, అలాగే ఎండవల్ల ఏర్పడే మచ్చలకు నివారణ దొరుకుతుంది. చర్మ పీహెచ్ స్థాయులను సమన్వయం చేసి స్కిన్‌టోన్‌ను మెరుగుపరుస్తుంది. మృతకణాలను తొలగించడమే కాదు, మాయిశ్చరైజర్ పనిచేసి డ్రైప్యాచ్‌లను దూరం చేస్తుంది.

**మచ్చలు దూరం...** రెండు టేబుల్ స్పూన్ల చొప్పున గోధుమపిండి, పెరుగు తీసుకుని టేబుల్‌స్పూన్ తేనె, తగినన్ని నీళ్ల కలపాలి. ముఖాన్ని శుభ్రంగా ఈ మిశ్రమాన్ని రాసి పదినిమిషాలపాటు ఆరనివ్వాలి. ఆపై కడిగేస్తే సరి. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. ముఖంపై గీతలను తగ్గిస్తుంది. అలాగే రెండు టేబుల్స్పూన్ల గోధుమపిండికి చిటికెడు పసుపు, అయిదారుచుక్కల నిమ్మరసాన్ని కలిపి ముఖానికి అప్లై చేయాలి. పావుగంట తర్వాత కడగాలి. ఎండవల్ల లేదా వయసురీత్యా వచ్చే మచ్చలు, పిగ్మంటేషన్ మార్క్స్ దూరమవుతాయి. ముఖం మెరుస్తుంది. □

### చెలి చిట్కా

★ వెన్న కాచేటప్పుడు తాజా బంగాళా దుంప ముక్క కొంచెం కర్వేపాకు వేస్తే నెయ్యి సువాసనా భరితంగా ఉంటుంది.

★ పచ్చికొబ్బరి చిప్పలు లోపలకొద్దిగా నిమ్మరసం పూస్తూ వారం రోజుల వరకు నిల్వ వుంటాయి. □

## అతిగా తింటున్నారా..



తిండి మనిషిని బతికిస్తుంది. కానీ ఏది పడితే అది తింటే అదే చిన్న చిన్న మన ప్రాణాల్ని తీసేస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. మరి ఆ ఆహారం ఏంటి? అధ్యయనాలు ఏం చెబుతున్నాయో తెలుసుకుందామా..

ఆరోగ్యంగా ఉండటానికి రోజూ సమతులాహారం తీసుకోవాలి. అప్పుడే ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవు. కానీ ఈ మధ్యకాలంలో అందరూ రుచుల పేరుతో అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌నే ఎక్కువ ఇష్టపడుతున్నారు. వీటిని తినడం వల్ల అనేక దీర్ఘకాలిక అనారోగ్యాలు వస్తున్నాయని ఇటీవల బ్రిటిష్ మెడికల్ జర్నల్ 30 ఏళ్లపాటు జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. అయితే వీటిని ఎక్కువ రోజులు నిలువ చేయడానికీ, రుచిని పెంచడానికీ ఉపయోగించే మసాలాలు, కృత్రియ రంగులు, ఫ్రక్టోజ్ సిరప్‌లు, టెస్టింగ్‌సాల్ట్, హైడ్రోజినేటెడ్ ఫ్యాట్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. దీంతో దీర్ఘకాలిక అనారోగ్యాల బారిన పడుతున్న వాళ్ల సంఖ్య పెరుగుతోంది. అంతేకాదు, ఈ ఆహార పదార్థాల్లో మన శరీరానికి అవసరమయ్యే విటమిన్లు, పీచుపదార్థాలు లేకపోవడంతో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఓ అద్యయనం ప్రకారం వారానికి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఇన్‌స్టంట్ నూడుల్స్ తిన్నవారిలో టైప్-2 డయాబెటిస్, రక్తపోటు, ఊబకాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గుండె పోటు వచ్చే అవకాశం 28 శాతం ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అందుకే చాక్లెట్లు, ఐస్‌క్రీమ్, బేకరీ ఐటమ్స్ వంటి వాటికి వీలైనంత దూరంగా ఉండాలి. వీటితో పాటు ఫ్రోజెన్ చికెన్, మటన్, సీఫుడ్‌కి దూరంగా ఉండాలి.పూర్తిగా మానేస్తే మంచిది. □



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

**ప్రశ్న :** మా అమ్మాయి ఒక్కోసారి విచిత్రంగా ప్రవరిస్తోంది. అనవసరంగా కోపం ప్రదర్శిస్తుంది. చదువులో వెనుక బడుతున్నది. అప్పుడప్పుడు అలిగిపోతుంది. అలిగినప్పుడు తెలిసిన వారి ఇంటికో లేక బంధువుల ఇంటికో వెళ్లిపోయేది. కొద్ది వయసు వచ్చిన తరువాత ఇతరుల ఇంటికి వెళ్లడం మానేసింది. ఎవరితోను మాట్లాడకుండా తన గదిలోనే గడుపుతుంది. అయితే ఈ సంవత్సరంలో రెండు సార్లు తిరుమలకు వెళ్ళి పోయింది. అక్కడ సత్రాల్లో పడుకుని అన్నదాన క్యాంటీన్‌లో భోజనం చేసేది. రెండు సార్లు పోలీసుల సాయంతో ఆమె ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తిరుమల వెళ్లి తీసుకుని వచ్చాము. కారణం అడిగితే సమాధానం చెప్పదు. తనకు అలా అనిపించిందని మాత్రం చెపుతుంది. ప్రస్తుతం ఆమె బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. వయస్సు 20 ఏళ్ళు. ఎత్తు 160 సెంటిమీటర్లు ఉంది. బరువు మాత్రం 37 కిలోలు ఉంది. చిన్నప్పటి నుంచి చాల సన్నగా ఉంది. ఇప్పటికీ తగినంత ఆహారం తీసుకోదు. పండ్లు, కూరగాయలు తినదు. ఉదయం రెండు ఇడ్లీలు తింటుంది. మధ్యాహ్నం, రాత్రి చాల తక్కువగా తింటుంది. మల బద్ధకంతో బాధపడుతున్నది. తరచు తలనొప్పి వస్తోంది. రుతుక్రమంలో తేడాలు ఉన్నాయి. బిటెక్

## ప్రవర్తనా లోపాలు సరిదిద్దండి

వ్యథ




మొదటి సంవత్సరం అన్ని సబ్జెక్టులు పాసైంది. రెండు సంవత్సరం ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యింది. తరువాత పరీక్ష రాసి పాసయ్యింది. ఇప్పుడు చదువులో మరింత వెనుకబడింది. గత వారం అలిగి తిరుమలకు వెళ్ళిన సమయంలో సహాయం చేసిన పోలీసు సి.ఐ. ఆమెకు కౌన్సెలింగ్ చేయించమని సలహా ఇచ్చారు. అలిగి వెళ్ళిపోవడం, సరిగా తినకపోవడం కూడా మానసిక సమస్యలేనా? అన్న అనుమానం కలుగుతోంది. బి.టెక్ చదువుతున్న అమ్మాయికి ఆ మాత్రం జ్ఞానం ఉండదా? మామూలుగా పెద్దవారు చెపితే చాలదా? అన్న సందేహాలు ఉత్పన్నం అవుతున్నాయి. కాబట్టి మా అమ్మాయి సమస్యలు, పరిష్కార మార్గాలపై తగిన సలహాలు ఇవ్వండి.

- ఒక సోదరి, తిరుపతి.

**జవాబు :** అమ్మా మీ అమ్మాయి ప్రవర్తనా లోపాలతో బాధపడుతున్నది. అలాగే మనోజనిత శారీర రుగ్మతలు ఆవహించాయి. పిల్లలు సహజ సిద్ధంగా ఉండకపోవడం లోపంగానే భావించాలి. ఆహారం, వ్యవహారం, ఆటపాటలు, చదువు, స్నేహం లాంటి అంశాలలో అసహజంగా వ్యవహరిస్తుంటే మానసిక సమస్య గానే గుర్తించాలి. ఇందులో మానసిక సమస్యలతో పాటు, ప్రవర్తనా లోపాలు ఉంటాయి. మీ అమ్మాయి సరిగా తినక పోవడం, బరువు చాల తక్కువగా ఉండటం, రుతుక్రమంలో తేడాలను బట్టి ఆమెలో మానసిక, శారీరక సమస్యలు ఉన్నట్టు భావించాలి. ఈటీంగ్ డిజార్డర్ ఉన్నవారు అతిగా తినడం లేదా చాల తక్కువగా తినడం చేస్తుంటారు. ఎక్కువగా తినడాన్ని బులీమియా, తక్కువగా తిన్నడాన్ని అనోరెక్సియా నర్వోసా అంటారు. మీ అమ్మాయి వయసు, ఎత్తుకు తగినబరువు లేదు. మరీ తక్కువ బరువు ఉంది. దీని వల్ల హార్మోన్ల సమస్యలు తలెత్తుతాయి. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపిస్తుంది. కోపం, చికాకు, అలక, విసుగు లాంటి ప్రవర్తనా లోపాలు తలెత్తుతాయి. సైకాజిస్టును కలిస్తే ఆమెలోని మానసిక లోపాలను సరిదిద్దుతాయి. అలాగే గైనకాలజిస్టును కలసి చికిత్స చేయించడం మంచిది. నెమ్మదిగా సమతుల ఆహారం తీసుకునేలా అలవాటు చేయండి. రోజు కొంత సమయం వ్యాయమం చేయించడం అవసరం. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తినేలా శ్రద్ధ చూపండి. □

## విన్నవించని చిన్న కోరిక

ఆధ్యాత్మికం



అది 1917 జూలై నెల 4వ తేదీ- అంటే అది గురుపూర్ణిమ రోజు. సాయిబాబాను సద్గురువుగా ఎందరో సేవించారు ఆ రోజున ప్రత్యేకంగా. దహను గ్రామానికి చెందిన హరి భావు కార్నిక్ సాయిని ఆరాధించాడు. ఇక తన సద్గురువు వద్ద సెలవు తీసికొని ద్వారకామాయి మెట్లు దిగుతున్నాడు. ఆకస్మాత్తుగా అతనికి తన సద్గురువు సాయికి మరో రూపాయి దక్షిణగా సమర్పిద్దామనే కోరిక కలిగింది. అతనిని మెనుదిరిగి సాయి వద్దకు రావద్దని ముందుకు సాగిపొమ్మని శ్యామా సైగ చేశాడు. ఒకసారి సాయి వద్ద సెలవు తీసుకొన్ని తరువాత తిరిగి సాయిని దర్శించటం సాంప్రదాయం కాదు. అది షిరిడీలోని ఒక సాంప్రదాయం. అతడు తిరిగి రాకుండా ముందుకే వెళ్ళిపోయాడు. తన ఊరికి పోతూ నాసిక్‌కు వెళ్ళాడు. అక్కడ కాలారాం మందిరం విఖ్యాతమైనది అది పంచమటి ప్రాంతంలో ఉన్నది. శ్రీ రంగారావు ఓడేకర్ ఆ ఆలయ నిర్మాత. ఒకసారి శ్రీరాముడు స్వప్నంలో దర్శనమిచ్చి తాను నల్లని విగ్రహ రూపంలో గోదావరిలో ఉన్నాని తెలిపాడు. వెంటనే ఆ సర్దారు నల్లని 'కాలా) రాముని కొరకు అన్వేషించగా రాముని విగ్రహంతో పాటు సీతా, లక్షణుల విగ్రహాలు దొరికాయి. ఆ విగ్రహ మూర్తులు లభించిన ప్రదేశం రామకుండం అని అంటారు. తన 14 ఏండ్ల వనవాసంలో రాముడు కొద్దికాలం అక్కడ నివసించాడు. రాముడు నడయాడిన పవిత్ర స్థలంలో కాలా రాముని మందిరం నిర్మితమైంది. ఈ మందిరంతో అనేక మహనీయుల గాథలు ముడిపడి ఉన్నాయి. చక్రదర స్వామి, ఏకనాథ మహారాజ్, సమర్ధ రామదాసు ప్రస్తుతం సాయి సమకాలీనులైన గజానన్ మహారాజ్, నర్సింహ మహారాజు ఈ ఆలయాన్ని దర్శించారు. నర్సింగ్ మహారాజ్ అవధూత. ఈయన జనన వివరాలు తెలియవు. ఆయన ఆ మందిరంలో ధునిని వెలిగించే వాడు. ఇతరుల నుండి ఏమి ఆశించడు. ఎవరితోనూ మాట్లాడడు. అటువంటి ఆయన హరి భావ్ కార్ణిక్ ఆ ఆలయాన్ని దర్శిస్తున్నప్పుడు కార్ణిక్ చేతి మణికట్టును పట్టుకొని ' నా రూపాయి నా కివ్వు" అని అడిగారు. మరుక్షణంలో తాను సాయికి దక్షిణ ఇద్దామనుకున్న ఆలోన జ్ఞాపకం వచ్చింది. మనసులోని సంకల్పం సాయికి చెప్పనవసరం లేదు. తన మరో రూపమైన నర్సింగ్ మహారాజ్ ద్వారా దక్షణను స్వీకరించి, హరిభావ్ కోరికను తీర్చారు సాయి. దక్షిణ ఎవరికిస్తే ఏం?!

- యం.పి.సాయినాథ్






# నేటి నుండి ప్లేఆఫ్

## పంజాబ్‌తో బెంగళూరు ఢీ

## ఫైనల్ ఆడకుండానే రెండు జట్లు ఔట్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్2025 లీగ్‌దశ మ్యాచ్‌లు పూర్తికావడంతో ఇప్పుడు ప్లేఆఫ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. నాలుగు జట్ల మధ్య జరగనున్న ఈ ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఈ నెల 29 నుండి ప్రారంభమవుతున్నాయి. ఈ సీజన్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టాప్2లో చోటు దక్కించుకోగా, గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్ మూడు, నాలుగు స్థానాల్లో నిలిచి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఇప్పుడు టైటిల్ రేసులో నాలుగు జట్లు మిగిలి ఉన్నాయి. రాబోయే రోజుల్లో జరగబోయే మ్యాచ్‌లు చాలా ఉత్కంఠభరితంగా ఉండబోతున్నాయి. లీగ్ దశ తర్వాత, పంజాబ్ కింగ్స్ 19 పాయింట్లు, 0.372 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా 19 పాయింట్లు సాధించింది. కానీ, 0.301 నికర రన్ రేట్ తో రెండవ స్థానంలో నిలిచింది. రెండు జట్లు 14 మ్యాచ్‌ల్లో 9 గెలిచాయి, 4 ఓడిపోయాయి. 1 మ్యాచ్ అసంపూర్ణంగా ముగిసింది. గుజరాత్ టైటాన్స్ 18 పాయింట్లు, 0.254 నెట్ రన్ రేట్ తో మూడో స్థానంలో నిలవగా, ముంబై ఇండియన్స్ 16 పాయింట్లు, 1.142 నెట్ రన్ రేట్ తో నాలుగో స్థానంలో నిలిచింది. తొలి ప్లేఆఫ్ మ్యాచ్ (క్వాలిఫయర్-1) గురువారం పంజాబ్ కింగ్స్‌కు, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు మధ్య జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఓడిపోయిన జట్టుకు క్వాలిఫైయర్ 2లో మరో అవకాశం లభిస్తుంది. ఈ నెల 30న జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్-గుజరాత్ టైటాన్స్ మూడు, నాల్గవ స్థానంలో నిలిచిన జట్లు డూ ఆర్ డై మ్యాచ్‌లో ఒకదానితో ఒకటి తలపడతాయి. ఓడిన జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది, గెలిచిన జట్టు క్వాలిఫయర్2కి చేరుకుంటుంది. ఈ ఎలిమినేటర్‌లో ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ తలపడతాయి. ముంబై ఇండియన్స్ నెట్ రన్ రేట్ 1.142. ఇది ముంబై దూకుడు బ్యాటింగ్, బౌలింగ్ బలాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు, గుజరాత్ టైటాన్స్ సీజన్ అంతటా నిలకడను ప్రదర్శించి 9 మ్యాచ్‌ల్లో గెలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఇది డూఆర్‌డై మ్యాచ్ అవుతుంది. రెండు జట్లు తమ శాయశక్తులా ప్రయత్నిస్తాయి. ఈ మ్యాచ్‌లో ఓడిన జట్టు సీజన్ నుంచి నేరుగా నిష్క్రమిస్తుంది. ఇక జూన్ 1న జరిగే క్వాలిఫయర్2లో క్వాలిఫయర్1లో ఓడిన జట్టుకు ఎలిమినేటర్‌లో విజేత అయిన జట్టుకు మధ్య జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇక జూన్ 3న ఫైనల్ మ్యాచ్ క్వాలిఫయర్1 విజేతతో క్వాలిఫయర్2 విజేత ఢీ కొట్టనుంది. ఈ మ్యాచ్ ఐపీఎల్ 2025 ట్రోఫీని ఏ జట్టు గెలుస్తుందో నిర్ణయిస్తుంది.

### ఐసిసి మహిళల ర్యాంకింగ్స్‌లో..

## నం.1 పాక్ బౌలర్ సదియా

### రెండో ప్లేస్‌కు భారత్ స్టార్ దీప్తి




**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల టీ 20 ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ బౌలర్ సదియా ఇక్బాల్ అగ్రస్థానానికి ఎగబాకింది. ఇంగ్లండ్ బౌలర్ సోఫీ ఎక్లేస్టోన్‌ను కిందకుదించి టాప్ ప్లేస్‌కు చేరుకుంది. తాజాగా స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన సిరీస్‌లో ఎక్లెస్టోన్ పాల్గొనకపోవడంతో సదియా అగ్రపీఠాన్ని దక్కించుకుంది. సదియా ఖాతాలో 746 రేటింగ్ పాయింట్లు ఉండగా, ఎక్లేస్టోన్‌కు 734 పాయింట్లు ఉన్నాయి. దీంతో ఎక్లెస్టోన్ మూడు స్థానాలు కోల్పోయి నాల్గవ ప్లేస్ పడిపోయింది. ఇక భారత్ స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ 737 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకగా, ఆసిస్ బౌలర్ అన్నాబెల్ సదర్‌ల్యాండ్ ఒక స్థానం మెరుగుపరచుకుని 3వ ప్లేస్‌కు చేరింది. భారత్ పేసర్ రేణుక సింగ్‌ఠాకూర్ 5వ స్థానాన్ని నిలబెట్టుకుంది. ఇంగ్లండ్ బౌలర్ లారెన్ బెల్ 6వ ప్లేస్‌కు చేరింది. మరో ఇంగ్లండ్ బౌలర్ చార్లీ డీన్, పాక్ బౌలర్ సఫ్రా సంధు, ఆస్ట్రేలియా బౌలర్ జార్జియా వేర్హమ్ 7 నుండి 9 స్థానాల్లో ఉన్నారు. ఇంగ్లండ్ బౌలర్ 10వ ప్లేస్‌కు పడిపోయింది. భారత్ బౌలర్లలో రాధా యాదవ్ 16, శ్రేయాంక పాటిల్ 21, పూజా వస్త్రాకర్ 33 స్థానాల్లో ఉన్నారు.




### సింగపూర్ ఓపెన్‌లో గాయంతో

## లక్ష్య సేన్ నిష్క్రమణ

### డబుల్స్ సాత్విక్-చిరాగ్ జోడీ గెలుపు

**న్యూఢిల్లీ:** సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తన ప్రారంభ రౌండ్ మధ్యలో భారత నంబర్ వన్ లక్ష య సేన్‌కు గాయం కావడంతో టోర్నీ నుండి నిష్క్రమించాడు. అయితే భారతదేశపు అగ్రశ్రేణి పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-గద్దె రుత్విక జంట విజయంతో తిరిగి వచ్చారు. ఇక పురుషుల డబుల్స్‌లో చిరాగ్ శెట్టి, రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌తో కలసి, 32వ రౌండ్‌లో మలేషియాకు చెందిన చూంగ్ హాన్ జియాన్-ముహమ్మద్ హైకల్‌లను 21 -16, 21-13 తేడాతో ఓడించాడు. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని 35 నిమిషాల్లో అమెరికా జంట చెన్ ఝి యి-ఫ్రాన్సిస్కా కార్బెట్‌ను 21-16, 21-19 తేడాతో ఓడించి ప్రీక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన ఆకర్షి కశ్యప్ చైనాకు చెందిన హాన్ యు చేతిలో 21-17, 13-21, 7-21 తేడాతో ఓడిపోయింది.

### నార్వే చెస్‌లో అర్జున్ చేతిలో


## గుకేష్ చిత్తు

**న్యూఢిల్లీ:** నార్వే చెస్‌లో ప్రపంచ ఛాంపియన్, భారత్‌కు చెందిన డి గుకేష్ ఓటమిని చవిచూశాడు, ఈ టీనేజర్ నార్వే చెస్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడిపోయాడు. ఈసారి తన దేశ ఆటగాడు అర్జున్ ఎరిగైసి చేతిలో ఓడిపో యాడు. దీంతో నార్వేలోని స్టావాంజర్‌లో జరిగిన ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో రెండు రౌండ్ల తర్వాత తన ఖాతా తెరవలేకపోయాడు. థ్రిల్లర్



లో మాగ్నస్ కార్ల్‌సెన్ చేతిలో ఓడిపోయిన ఒక రోజు తర్వాత, గుకేష్ ఎరిగైసి చేత తొం దరపడి ఇబ్బంది పడ్డాడు. దీంతో సమయం ముగిసే సమయానికి తప్పులు చేశాడు. ఎరిగైసి చివరకు 62 కదలికలలో గుకేష్‌ను ఓడించాడు, అతని ప్రత్యర్థి తన గుర్రంతో చెక్ ఇచ్చిన తర్వాత రాజీనామా చేయవలసి వచ్చింది. గురువారం నాటికి 19 ఏళ్లునిండనున్న గుకేష్, ఒక ప్రధాన టోర్నమెంట్‌లో ఎరిగైసి చేతిలో ఓడిపోవడం ఈ ఏడాది ఇది రెండోసారి.

ఆట




### ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

## మిక్స్‌డ్ రిలేలో భారత్ జట్టుకు స్వర్ణం

### రూపాల్, పూజకు రజత పతకాలు.. యూనస్‌కు కాంస్య పతకం

**న్యూఢిల్లీ:** ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్‌కు పతకాల పంట పండింది. దక్షి ణ కొరియాలోని గుమిలో జరిగిన రెండో రోజు బుధవారం నాడు జరిగిన పోటీల్లో మిశ్రమ రిలేలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. రూపల్, సంతోష్ కుమార్ తమిళ రసన్, విశాల్ టికె, మరియు శుభ వెంకటేశన్‌లతో కూడిన భారత జట్టు విజయాన్ని సాధించింది. ఈ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో, భారత్ జట్టు 4400 మీటర్ల మిశ్రమ రిలేలో 3:18.12 సెకన్ల సమయంతో ముందుండి విజయం సాధించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. రూపల్, సంతోష్ కుమార్ తమిళరసన్, విశాల్ టికె, మరియు శుభ వెంకటేశన్‌లతో కూడిన భారత జట్టు విజయాన్ని సాధించింది. ఇక చైనా 3:20.52 సెకన్లతో రజతం, శ్రీలంక 3:21.95 సెకన్లతో కాంస్య పతకాన్ని దక్కించుకుంది. పురుషుల 1500 మీటర్ల పరుగులో యూనుష్ షా కాంస్యం గెలుచుకోవడం ద్వారా రెండవ పతకాన్ని సాధించాడు. తదుపరి పూజ మహిళల 1500 మీటర్ల పరుగులో రజత పతకాన్ని సాధించింది. మహిళల 400 మీటర్ల పరుగులో, రూపాల్ 52.68 సెకన్లలో వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు సాధించి రెండవ స్థానంలో నిలిచింది. ఈ రేసులో మరో భారతీయురాలు విథ్యా రామ్‌రాజ్ 53 సెకన్లతో ఐదవ స్థానంలో నిలిచింది. ఇక పురుషుల 1500 మీటర్ల రేసులో, యూనస్ ఎక్కువ భాగం ముందంజలో ఉన్నాడు కానీ చివరి దశలో 3:43.03 సమయంతో కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. మహిళల 1500 మీటర్ల పరుగులో పూజా తీవ్రంగా ముందుకు సాగింది కానీ 4:10.83 సమయంలో గమ్యాన్ని చేరుకుని రెండవ స్థానంలోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. లిలి దాస్ 4:13.81 సమయంలో నాల్గవ స్థానంలో నిలిచింది. పురుషుల 400 మీటర్ల పరుగులో, విశాల్ టికె 45.57 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయం నమోదు చేశాడు.

# వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు


**ముంబై, మే 28:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ, బ్లాక్‌డీల్స్, ప్రైమరీ మార్కెట్లో పెరిగిన యాక్టివిటీ మూలంగా నిధులు తరలివెళ్లాయి. దీంతో వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాల్లో ముగిసాయి. రోజంతా ఓ మోస్తరు స్థాయిలో ట్రేడయి, చివరికి నష్టాల్లో స్థిరపడ్డాయి. ఎఫ్ఎంసిజి షేర్ల అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం సెన్సెక్స్ 81,457.61 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,244.02-81,613.36 పాయింట్ల మధ్య ట్రేడయింది. చివరికి సెన్సెక్స్ 239 పాయింట్ల నష్టంతో 81,312.32 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.37గా ఉంది. ఐటిసి, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి షేర్లు ముఖ్యంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసిఐసిఐ బ్యాంకు, అదానీ పోర్ట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ 64.61 డాలర్ల వద్ద కొనసాగింది. ఎల్ఐసి షేర్లు బుధవారం దూసుకెళ్లాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.19,013 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసిన నేపథ్యంలో కంపెనీ



షేర్లు 9శాతం మేర లాభపడ్డాయి. చివరికి బిఎస్ఇలో రూ.69.30 లాభంతో 7.96శాతం రూ.940 వద్ద ముగిసాయి. ఎన్ఎస్ఇలో రూ.69.50 7.98శాతం లాభంతో రూ.940.75 వద్ద స్థిరపడ్డాయి. ఐటిసిలో బ్రిటీష్ మల్టీనేషనల్ బిఎటి పిఎల్‌సి 2.3శాతం మేర తన వాటాలను బ్లాక్ డీల్ ద్వారా విక్రయించిన నేపథ్యంలో కంపెనీ షేర్లు పతనం అయ్యాయి.

## మూడో స్థానానికి దిగివచ్చిన ఓలా

**ముంబై, మే 28:** దేశీయ విద్యుత్ ద్విచక్ర వాహన మార్కెట్‌లో ఒకప్పుడు టాప్‌లో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ క్రమంగా తన స్థానాన్ని కోల్పోతూ వస్తోంది. ప్రత్యర్థి కంపెనీలైన టీవీఎస్ మోటార్, బజాజ్ ఆటో విక్రయాలు జోరందుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మేలో మూడో స్థానానికి పడిపోయింది. దీంతో ఇప్పటికే నియంత్రణ సంస్థల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్న ఈ సంస్థకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లైంది. ప్రభుత్వ వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మే 1 26 మధ్య 15,221 ఓలా ఎలక్ట్రిక్ వాహన రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది మేలో నమోదైన 37,388 యూనిట్లతో పోలిస్తే సుమారు 60 శాతం తక్కువ. ఈ ఏడాది ఏప్రిల్‌లో 22.1 శాతంగా ఉన్న మార్కెట్ వాటా మే నాటికి 20 శాతానికి పడిపోయింది. గతేడాది ఇదే సీజన్‌లో ఈవీ ద్విచక్ర వాహన విభాగంలో 50 శాతం వాటాతో అగ్రగామిగా నిలిచింది. 2025 మే నాటికి టీవీఎస్ మోటార్ 25 శాతంతో తొలి స్థానంలో నిలవగా.. బజాజ్ ఆటో 22.6 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఇక ఏథర్ ఎనర్జీ వాటా 13.1 శాతంతో నాలుగో స్థానానికి పరిమితమైంది. కంపెనీ షేర్లు 0.95 శాతం లాభంతో రూ.53 వద్ద ట్రేడవుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరికి గాను




వాహన్ పోర్టల్‌లో ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 8,652గా ఉంది. కంపెనీ మాత్రం 25వేల యూనిట్లు విక్రయించినట్లు ప్రకటించింది. మార్చి 20నాటికి పోర్టల్‌లో ఈ సంఖ్య 11,781గా నమోదైంది. దీంతో ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఈ వాహన విక్రయ సంస్థ డేటాపై విచారణ చేపట్టింది. ఇప్పటికే వాహన నాణ్యత, సర్వీసుల్లో లోపాలపై సీసీపీఏ దర్యాప్తును ఎదుర్కొంటోంది.

## యూట్యూబ్ సిఇఒకు గూగుల్ ఆఫర్

**న్యూఢిల్లీ, మే 28:** దిగ్గజ సంస్థల్లో భారతీయ-అమెరికన్ల హవా కొనసాగుతోంది. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి వాటిని ముందుండి నడిపిస్తున్న సంగతి తెలిసిందే. ఆ కోవకే చెందిన యూట్యూబ్ సీఈఓ నీల్‌మోహన్‌కు సంబంధించిన ఆసక్తికర విషయం వైరల్‌గా మారింది. జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్‌లో ఎంతోమంది ప్రముఖులు పాల్గొంటున్నారు. తాజాగా నీల్‌మోహన్ కూడా దానిలో మెరిశారు.

ఆయనకు 2011 నాటి ప్రశ్న ఎదురైంది. ఆ సమయంలో గూగుల్ అడ్వర్టైజింగ్, యూట్యూబ్ ప్రొడక్ట్ స్ట్రాటెజీలో ఆయన కీలకంగా ఉన్నారు. మీరు వేరే సంస్థకు వెళ్లకుండా ఉండేందుకు గూగుల్ 100 మిలియన్ల ఆఫర్ చేసిందని చదివినట్లు నాకు గుర్తు. 15 ఏళ్ల క్రితం చాలా పెద్దమొత్తం కదా..? అని కామత్ అడిగారు. ఆ ప్రస్తావనను నీల్‌మోహన్ తోసిపుచ్చలేదు. 2023 నుంచి యూట్యూబ్‌కు నీల్ మోహన్ సీఈఓగా కొనసాగుతున్నారు. ఆయన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పొందారు. అండర్సెన్ కన్సల్టింగ్ (ప్రస్తుతం యాక్సెంచర్)లో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తర్వాత నెట్‌గ్రావిటీకి మారారు. ఆ స్టార్టప్‌ను డబుల్‌క్లిక్ సంస్థ సొంతం చేసుకుంది. అక్కడే అంచెలంచెలుగా ఎదుగుతూ బిజినెస్ ఆపరేషన్స్‌లో వైస్‌ప్రెసిడెంట్ స్థాయిని అందుకున్నారు. 2007లో డబుల్ క్లిక్.. గూగుల్ పరమైంది. నాటి నుంచి దాని యాడ్ బిజినెస్‌లో కీలకంగా మారారు. గూగుల్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్ట్రాటెజీలో కీలక వ్యక్తిగా ఎదిగారు. ఆయన టాలెంట్‌ను గుర్తించిన గూగుల్ 2011లో ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్)లోకి మారకుండా 100 మిలియన్లు ఆఫర్ చేసి, అట్టిపెట్టుకుంది. అప్పటికే ఆయన మాజీ బాస్ డేవిడ్ రోజెన్‌బ్లాట్.. ట్విటర్ బోర్డులో చేరారు. చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్‌గా నీల్‌ను తీసుకోవాలని



ఆయన భావించారు. అప్పుడు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ చేపట్టిన ట్విటర్ దృష్టి నీల్‌మోహన్ మీద మాత్రమే పడలేదు. ప్రస్తుత గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌ను కూడా తమ సంస్థలో చేర్చుకోవాలని భావించి ఆఫర్ ఇచ్చింది. 50 మిలియన్ డాలర్ల స్టాక్ గ్రాంట్ ఇచ్చి పిచాయ్‌ను గూగుల్ ఆపేసిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఆయన ఏ స్థాయికి ఎదిగారో తెలిసిందే. 2015లో గూగుల్ సీఈఓ బాధ్యతలు స్వీకరించారు. 2019లో దాని మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఇంక్ సీఈఓగా నియమితులయ్యారు.


## పెట్రోడీజిల్ అమ్మకాలకు ప్రత్యేక అవుట్‌లెట్లు

**న్యూఢిల్లీ, మే 28:** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) అనుబంధ సంస్థగా ఉన్న చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (సిపిసిఎల్) రిటైల్ ఇంధన మార్కెట్లోకి ప్రవేశించడానికి పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు లభించాయి. దీంతో సిపిసిఎల్ ప్రత్యేకంగా తన సొంత బ్రాండెడ్ అవుట్‌లెట్ల ద్వారా పెట్రోల్, డీజిల్‌ను విక్రయించనుంది. ప్రస్తుతం సిపిసిఎల్ చెన్నైలోకి మనాలిలో సంవత్సరానికి 10.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో క్రూడాయిల్ రిఫైనరీని నిర్వహిస్తోంది. ఇప్పటివరకు కంపెనీ మొత్తం ఉత్పత్తులను రిటైల్ అమ్మకాలను నిర్వహించే ఐఒసికి సరఫరా చేసింది. సొంత రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఐఒసి, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, రిలయన్స్, షెల్, నయారా ఎనర్జీ వంటి ప్రధాన ఇంధన రిటైలర్లతో సిపిసిఎల్ పోటీ పడనుంది. కంపెనీ ఉత్పత్తుల పంపిణీ కోసం గతంలో ఐఒసిపై ఆధారపడిన సిపిసిఎల్ రిటైల్ రంగంలోకి ప్రవేశించడం దాని సొంతఇంధన ధరలు, అమ్మకాల వ్యూహాలను నియంత్రించడం ద్వారా లాభాలు ఆర్జించనుంది. భవిష్యత్తులో ప్రీమియం ఇంధన ఆఫర్లు, ప్రత్యామ్నాయ ఇంధన పరిష్కారాలను విస్తరించడానికి ఈ చర్యలు వీలు కల్పిస్తున్నాయి. అయితే సిపిసిఎల్ తన రిటైల్ అవుట్ లెట్ల సంఖ్యను, వాటి లొకేషన్లను ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. కంపెనీ తన మార్కెట్ ఉనికికి విస్తరించడానికి ప్రధాన పట్టణ కేంద్రాలు, రహదారుల సమీపంలో వ్యూహాత్మకంగా అవుట్ లెట్లను ఏర్పాటు చేస్తుందని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.





## ఐపిఒకు 'ఓయో' రెడీ

**ముంబై, మే 28:** హాస్పిటాలిటీ కంపెనీ ఓయో మళ్లీ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతోంది. ఈకంపెనీ మార్చి 2026 త్రైమాసికంలో ఐపిఒను ప్రారంభించాలని చూస్తోంది. గుర్గావ్‌కు చెందిన ఈ స్టార్టప్ కంపెనీ ఇప్పటికే రెండుసార్లు ఐపిఒ తీసుకురావడానికి ప్రయత్నించింది. కానీ మార్కెట్ పరిస్థితులు బాగాలేకపోవడంతో కంపెనీ లాభాలు ఆర్జించడంపై దృష్టి సారించింది. అందువల్ల ఐపిఒ ఆలస్యం అయింది. ఆ కంపెనీ మొదట 2021 లో ఐపీఓ తీసుకురావాలని ప్లాన్ చేసింది. మూలాల ప్రకారం ఈసారి ఐపిఒ ద్వారా కంపెనీ 67 బిలియన్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెప్టెంబర్ నాటికి మార్కెట్ నియంత్రణసంస్థ సెబీకి ఐపిఒ పత్రాలను దాఖలు చేయాలని ఓయో ఆలోచనచేస్తుంది. మొదటి ఐపిఒ ప్రయత్నం నుండి ఓయో గణనీయంగా మారిందని వర్గాలు తెలిపాయి. కంపెనీ లాభాలతో పాటుగా వృద్ధిపై దృష్టి సారిస్తోంది. కంపెనీ మెరుగైన ఆర్థికపనితీరు, కంపెనీ పద్ధతులు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచినట్లుగా తెలుస్తోంది. అందుకే కంపెనీ మళ్ళీ స్టాక్ మార్కెట్లోకి రావడానికి ప్రయత్నిస్తోంది. అయితే ఈ వార్తలపై ఓయో ఇంకా అధికారికంగా వ్యాఖ్యానించలేదు. ఓయో వచ్చే నెలలో కంపెనీ బోర్డు, దాని అతిపెద్ద వాటాదారు సాఫ్ట్‌బ్యాంక్ ప్రతినిధులతో ఐపిఒ ప్రక్రియపై కీలక చర్చలు జరపనుందని సమాచారం. జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ ఈ కంపెనీలో 40శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. ఓయో మాతృ సంస్థ ఒరావెల్ స్టేజ్ త్వరలో మర్చంట్ బ్యాంకర్లతో చర్చలు ప్రారంభించనుంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఓయో అధికారులు గత నెల రోజులుగా బ్యాంకర్లతో అనధికారిక చర్చలు జరుపుతున్నారు. ఇప్పుడు ఆ ప్రతిపాదనను అధికారికంగా వినడానికి కంపెనీ కూడా సిద్ధంగా ఉందని వార్తలు వస్తున్నాయి. ఓయో విలువ 10 బిలియన్ డాలర్ల వరకు ఉంటుందని కొన్ని బ్యాంకులు అంచనా వేసినట్లు అనధికార వర్గాలు తెలిపాయి. అయితే, ఓయో కంపెనీ విలువ 67 బిలియన్ల మధ్య ఉంటుందని విశ్వసిస్తోంది. ఆ కంపెనీ భారతీయ, అంతర్జాతీయ పెట్టుబడి బ్యాంకులతో చర్చలు జరుపుతోంది.ఆగస్టు, సెప్టెంబర్ మధ్య కంపెనీ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేస్తుందని భావిస్తున్నారు. ఈ కంపెనీ మార్చి-ఏప్రిల్ 2026 నాటికి స్టాక్‌మార్కెట్లో లిస్ట్‌కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓయో ఇంకా 2025 ఆర్థిక గణాంకాలను విడుదల చేయలేదు. కానీ ఈ కాలంలో కంపెనీకి రూ.620 కోట్ల నికర లాభం ఉంటుందని అంచనా. ఆ కంపెనీ తన ప్రపంచ కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకుంది. ఇప్పుడు కంపెనీ భారతదేశం, అమెరికా, యూరప్, ఆగ్నేయాసియా వంటి కీలక మార్కెట్లపై దృష్టిసారిస్తోంది.




## ఎఐతో తగ్గిన ఫ్రెషర్ల నియామకాలు

**ముంబై, మే 28:** కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికత ప్రతి రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. దీని రాకతో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరీ ముఖ్యంగా టెక్ కంపెనీల్లో ఏఐ సాంకేతికత వినియోగం విస్తృతంగా పెరగడంతో ఫ్రెషర్ నియామకాలు తగ్గాయి. గత కొన్నిసంవత్సరాల్లో టాప్ టెక్ కంపెనీల్లో ఈ ట్రెండ్ కనిపిస్తోందని తాజాగా ఓ నివేదికలో వెల్లడైంది.వెంచర్ కేపిటల్ సంస్థ సిగ్నల్ ఫైర్ డేటా ప్రకారం, టాప్ టెక్‌కంపెనీల్లో ఎంట్రీలెవల్ నియామకాలు 15శాతం ఉండగా, ఇప్పుడు 7శాతానికి పడిపోయింది. గతంతో పోలిస్తే ఏకంగా 50శాతం క్షీణించింది. ఇది తాత్కాలికంకాదని.. టెక్ కంపెనీలు పనితీరును ఏఐ ఎలా మారుస్తుందో తెలియజెప్పేందుకు స్పష్టమైన సంకేతమని నిపు ణులు భావిస్తున్నారు. కృత్రిమమేధ సామర్థ్యం పెరగడంతో, ఫ్రెషర్లకు జూనియర్ స్థాయి ఉద్యోగాలు కనుమరుగవుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏఐ కారణంగా ఇప్పటికే పలు సంస్థలు సిబ్బందిని తొలగిస్తున్నాయి. తాజాగా ఐబీఎం ఎనిమిది వేల మందిని తొలగించింది. ముఖ్యంగా హెచ్‌ఆర్ విభాగంలో ఈ కోతలు జరిగినట్లు తెలుస్తోంది. ఆ విభాగం పనుల్ని నిర్వహించేందుకు కంపెనీలు ఏఐని ఉపయోగించడమే ఇందుకు కారణమని పలు నివేదికలు తెలుపుతున్నాయి. కొత్త టెక్ ఉద్యోగాల్లో ఈ స్కిల్స్ ఉన్న వారికే కంపెనీల ప్రాధాన్యత ఇస్తున్నాయని ది వాల్ స్ట్రీట్ జర్నల్ సర్వే తెలిపింది. దాదాపు 87 శాతం మంది రిక్రూటర్లు కృత్రిమ మేధలో అనుభవం ఉన్న అభ్యర్థుల కోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. ప్రతి నాలుగు ఉద్యోగాల్లో ఒకటి ఈ నైపుణ్యంపై ఆధారపడుతోందని పేర్కొంది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.